# జ్యోతి

మే '67 - 80 పై




మంచికి మానవత్వానికి దారిచూపించే చిత్రం!
పద్మశ్రీ వారి
ప్రాణమిత్రులు
నిర్మాత
పి. వెంకటేశ్వర్లు
దర్శకత్వం
పి. పుల్లయ్య
కథ, మాటలు.. ముళ్ళపూడి వెంకటరమణ
సంగీతం: కె. వి. మహదేవన్




MODERN INDIA

DURGA
BRAND

PORTLAND
CEMENT

MANUFACTURERS
THE ANDHRA
CEMENT CO., LTD.,
VIJAYAWADA-3

# తొలిమాట

ఫలానావారు "జీవితాన్ని సాహిత్యసేవకే అంకితం చేశారు" అని పత్రికలలో చదువుకొనడానికో, ఉపన్యాసాలలో వినడానికో బావుంటుంది కాని, జీవితంలో కూడా బావుంటుందా ?— ఈ సమస్యను తీసుకుని శ్రీమతి సి ఆనందారామంగారు రచించిన చిన్న నవల "తీరని వెతలే తీయని గాథలు" ఈ సంచికలో సీరియల్‌గా ప్రారంభిస్తున్నాము

* * *

ప్రముఖ కథారచయిత శ్రీ ఇచ్ఛాపురపు జగన్నాథరావుగారి రచనలు ఇటీవల పత్రికలలో అంత తరుచుగా వెలువడడం లేదు లేదా అరుదుగా వెలువడుతున్నాయి వారి రచన ("ఇది ఎవరికథ?") "జ్యోతి"లో మొదటి సారిగా ఈ సంచికలో ప్రచురిస్తున్నాము (57)

* * *

ఈ సంచికలో మరొక ప్రముఖ రచయిత శ్రీ బలివాడ కాంతారావుగారి కథ "మెత్తని దొంగ" (64), ప్రఖ్యాత రచయిత్రులైన శ్రీమతులు అచంట శారదా దేవి ("జాలి గుండె – 41), కె రామలక్ష్మి ("అందమైన పొరుగు" – 75) గార్ల రచనలు "జ్యోతి" పాఠకులను అలరించగలవని విశ్వసిస్తున్నాము

"ప్రముఖుల హాస్యాలు" (73), "రచయితల వింత అలవాట్లు" (82) పాఠకులకు గిలిగింతలు పెట్టగల రచనలు.

లింకన్, కెనెడీల జీవితాలలో కొన్ని పోలికలున్న విషయం పాఠకులకు తెలియనిది కాదు కాని, ఖచ్చితంగా ఎన్ని పోలికలు ? వాటి నన్నిటిని గుదిగుచ్చిన ఒక రచనను ఈ సంచికలో (102) చదవండి


నవజ్యోతి ఫిలిమ్స్
పట్టుకుంటే పదివేలు
నిర్మాతలు
సాంబశివరావు, వందనం
దర్శకత్వం
ఎం. మల్లిఖార్జునరావు
సంగీతం
టి. చలపతిరావు
కెమెరా
లక్ష్మణ్ గోరే
ఆల్ ఇండియా రిలీజ్

సుచిత్ర మాసపత్రిక

బకింగ్ హామ్ పేట పోస్టు
విజయవాడ-2

విడిప్రతి వెల
80 పైసలు

ఏడాది చందా
9-50 రూపాయలు

సంపుటి 6
మే 1967
సంచిక 5

మేనేజింగ్ ఎడిటర్
వి. వి. రాఘవయ్య


ఉత్తరాలు— 6
రాజకీయాలు— 8
ఆస్కార్ సెల్లు— 12
'రచయితను కావాలని'—
టి జె ఫ్యూజిక్ 17
వాక్యాస్త్రమ్— మిస్ ఎ కమల 20
అదృష్టం—వెన్నవెల్లి రామం 23
తీరని వెతలే తీయనిగాథలు—
సి ఆనందారామం
[కొత్త సీరియల్] — 25
పొట్టికథలు— 37
సివిల్ ఇంజనీర్ ప్రేమ గీతం—
విజయ సాంయి 40
జాలిగుండె—
ఆవంటు శారదాదేవి 41
ప్రేమ, ద్వేషం-జి నరసింహారావు 49
ఇది ఎవరికథ ?—
ఇచ్ఛాపురపు జగన్నాధరావు 57
మెత్తని దొంగ—
బలివాడ కాంతారావు 64
ప్రముఖుల హాస్యాలు—
సి నాగేశ్వరరావు 73
అందమైన పొరుగు—
కె రామ లక్ష్మి 75
రచయితల వింత అలవాట్లు—
ఆదుర్తి రామప్రసాద్ 82
సముద్రాలకు పోటు పోటు—
డాక్టర్ మహీధర నళినీమోహన్ 85
కిశోర ప్రాయం (సీరియల్)
విజయలక్ష్మి రామకృష్ణన్ 89
లింకన్ - కె డీ - 102
కూలివాడైన మహారాజు 104
సినిమా— 105


ముఖచిత్రం
ఎస్ వి ఆర్ ఫిలిమ్స్ వారి
చదరంగం లోని దృశ్యాలు

# ఉత్తరాలు

ఇక్కడ మీ మాసపత్రిక ఆంధ్ర పాఠకులలో నేనొకడిని మాకు ఈ అవకాశము కలిగినందుకు సంతోషిస్తున్నాము. ప్రతి నెల 'కొత్త' 'జ్యోతి' కోసం ఆరాటు పడుతున్నామంటే మీకు ఆశ్చర్యంగా ఉంటుందేమో! దీనికి కారణం తెలుగు పుస్తకాలు, పత్రికలు చదివే అవకాశం లేకపోవడంకన్నా, ఆంధ్ర మాసపత్రిక 'జ్యోతి'లో ప్రచురింపబడే చక్కని కథలూ, వ్యాసాలు అంతే సమంజసంగా ఉంటుందనుకుంటాను. 'జ్యోతి' వారపత్రికగా వెలువడితే ఎంతబాగుంటుందో అని మాలో మేమను కోవడం అరుదుకాదు.

ఇంకొక విషయం కూడా చెప్పాలనిపిస్తోంది. మీ 'జ్యోతి' మాస్కో నగరంలో ఉండే తెలుగు విద్యార్థులచే చదవబడేదే కాదు; కొందరు సోవియట్ ప్రజలు కూడా 'జ్యోతి' పాఠకులే అని తెలుస్తే మీకు నమ్మశక్యంగా ఉండదేమో! మా స్కో నగరంలో గల విదేశీయ భాషా ప్రచురణాలయాని, 'జ్యోతి' నిజంగా జ్యోతి లాంటిదే. వారికి జ్యోతి చక్కటి నవీన సారస్వతం.

ఫిబ్రవరి నెల జ్యోతిలో ప్రచురించిన కామేశ్వరిగారి అసమర్థుడు కథ, బెర్నార్డ్ షా ఛలోక్తులు మమ్మల్ని బాగా ఆకర్షించాయి.

అభినందనలతో

**ఉదయకుమార్,**

మాస్కో, యు. ఎస్. ఎస్. ఆర్.

మీ పత్రికలో ప్రచురించిన యద్దనపూడి సులోచనగారి 'విజేత' సీరియల్ చాలా బాగుంది. కథ కొంచెం పొడిగించినా, ముగింపు ఊహించ గలిగినదేయైనా, కథ మొత్తానికి క్రొత్త పోకడలతో రసవత్తరముగా యున్నది. రచయిత్రికి నా హృదయ పూర్వక అభినందనలు తెలుపుకొంటూ, మన ప్రస్తుత పరిస్థితులను ప్రతిబింబించే మరొక సీరియల్‌ను త్వరలో వెలువరించి మమ్మానందింప చేయమని కోరుతూ—

పఠిత

**విజయమూర్తి,**

న్యూయార్క్, యు. ఎస్. ఎ.

నమస్కారములు. "నమస్కార బాణాలు విసిరే ఈ భక్తులు ఎవరు?" అని ఆశ్చర్యపడకండి. నేను జ్యోతి పాఠకుణ్ని, అభిమానిని. జ్యోతి విషయమే ఈ ఉత్తరంలో మీకు వ్రాస్తున్నాను. ఏప్రిల్ 'జ్యోతి' చదవాక ఈ ఉత్తరం వ్రాయాలని నిశ్చయించుకున్నాను.

పోయిన్నెల జ్యోతిలో ప్రకటించినట్టు, కీ. శే. బాలగంగాధర తిలక్ గారి కథ వేసినందుకు ఎంతో సంతోషిస్తున్నాను. ఆ సంతోషం తెలిపేందుకే — ఈ ఉత్తరం.

"పరివర్తన"—స్వర్గీయ పాఠక లోక మాన్య బాలగంగాధర తిలక్ గారి కథ — కమ్మగా వుంది. ఈ కథ చదివాక — ఇలాంటి గొప్ప రచయితని కోల్పోయినందుకు మరోసారి బరువుగా నిట్టూర్పు వచ్చింది. ఈ కథ ఏప్రిల్ జ్యోతికి ఏదో ప్రత్యేకత తెచ్చిపెట్టింది. కీర్తిశేషులైన ఆ రచయిత అముద్రిత కథని సంపాదించి ప్రచురించినందుకు మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. నా కృతజ్ఞతలు స్వీకరించండి.

**వి. యస్. ప్రసాద్,**
**పుంగనూరు.**

యువ కథా రచయితలు గర్వించదగిన వ్యక్తి, వరిష్ఠ కథా రచయిత శ్రీ శ్రీరంగం రాజేశ్వరరావు ఇటీవల అకాల మరణానికి గురి అయినందుకు మేమెంతో విచారిస్తున్నాము.

యౌవనంలో అడుగుపెట్టి స్వల్ప కాలంలోనే ముత్యాల్లాంటి కథలను పత్రికల ద్వారా పాఠక లోకానికి అందజేసిన అతని జీవితం ధన్యం —

అతని ఆత్మకు శాంతి కలుగుగాక!

**వివేకానంద, వెంకుబాబు,**
**గుంటూరు.**

మీ పత్రికలో ఇటీవల ప్రసిద్ధ ఆంగ్ల హాస్య రచయితల ఛలోక్తులను, జీవితాలను, గ్రంథాలను పరిచయం చేస్తున్నారు. బెర్నార్డుషా, మార్క్ ట్వేన్ గార్ల గురించి మీరు ప్రచురించిన వ్యాసాలు బాగున్నాయి ప్రతి నెల ఈ విధంగా ఒక్కొక్క రచయిత గురించి ప్రచురించవలెనని కోరుతున్నాను

**వి. శాంతాదేవి, హైద్రాబాదు.**

శ్రీమతి విజయలక్ష్మి రామకృష్ణన్ గారి సీరియల్ "కిశోర ప్రాయం" మొదటి సంచికతోనే నన్ను ఆకర్షించింది. అటువంటి సహజమైన ఇతివృత్తాలతో కూడిన నవలలు నాకెంతో ఇష్టం.

**కె. రంగనాథరావు,**
**రాజమండ్రి.**

ఇటీవల మీరు తిరిగి గేయాలను ప్రచురిస్తూ వుండడము ముదావహం. ఏప్రిల్ సంచికలో గోపాలచక్రవర్తి గారి "ఈ ప్రయాణం తప్పదు" వంటి గేయాలను ఇంకా తరుచుగా మీరు ప్రచురించాలని నా కోరిక.

**వి. సి. హెచ్. వెంకటేశ్వరరావు,**
**గుంటూరు.**

## రాజకీయాలు

# రానున్న రాష్ట్రపతి ఎవరు?

రాష్ట్రపతి ఎన్నిక మే 6వ తేదీన జరగబోతోంది. ఈ ఎన్నిక సంరంభం యావత్తు దేశం దృష్టినే కాక, మొత్తం ప్రపంచ దృష్టినే ఆకర్షిస్తోంది.

ఎవరు ఎన్నిక అవుతారు? డాక్టర్ జాకీర్ హుస్సేన్‌గారా? శ్రీ కోకా సుబ్బారావుగారా?

డాక్టర్ హుస్సేన్ కాంగ్రెసు అభ్యర్థి. శ్రీ సుబ్బారావు ప్రతిపక్షాల అభ్యర్థి.

వీరిద్దరు కాక పోటీరంగంలో మరొక పదిహేనుమంది చిల్లర అభ్యర్థులున్నారు. డాక్టర్ హుస్సేన్ గెలిచి తీరుతారని చెప్పే కాంగ్రెసుగాని, శ్రీ సుబ్బారావు విజయం తథ్యమని చెప్పే ప్రతిపక్షాలుగాని ఈ అభ్యర్థుల ఊసు ఎత్తడంలేదు. వారు కొన్ని ఓట్లు అయినా చీల్చకుండా వుంటారా? చీల్చితే అటు హుస్సేన్ గారికీ ఇటు సుబ్బారావుగారికి రావలసిన వోట్లు కొన్ని తగ్గిపోవా? తగ్గిపోతే ఎవరు గెలుస్తారో ఖచ్చితంగా చెప్పడం కష్టం కాదా? ఏమైనా ఆ ఇద్దరే ప్రధాన అభ్యర్థులు. వారిద్దరిలోనే ఎవరో ఒకరు ఎన్నిక కావడం తథ్యం.

ప్రెసిడెంట్ పదవి ఎన్నిక సమస్య ఈ సారి చాలా ప్రాధాన్యం పొందింది. ఇదివరలో కాంగ్రెసు ఏ అభ్యర్థిని సమర్థిస్తే ఆ అభ్యర్థి రెండో ఆలోచనకు తావీయకుండా గెలిచి, వూరుకునేవారు ఇప్పుడలా కాదు. అన్ని రాష్ట్రాలలోను కాంగ్రెసు బలం తగ్గింది. కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెసేతర పక్షాలు ప్రభుత్వాలను స్థాపించాయి. పార్లమెంటులోకూడా వాటి బలం

హెచ్చింది అందుచేత కాంగ్రెసు అభ్యర్థి విజయం నల్లేరు పై నడక వంటిది కాదు.

కాంగ్రెసేతర పక్షాల ప్రభుత్వాలు వచ్చిన కారణంగా ముందు ముందు కేంద్రానికీ, రాష్ట్రాలకు మధ్య, రాష్ట్రాలలో రాష్ట్రాలమధ్య రాజ్యాంగ సంబంధమైన చిక్కులు ఏర్పడవచ్చు. ఇంతకుపూర్వం ప్రెసిడెంట్ అధికారాలు ఎప్పుడో తప్ప వినియోగంలోకి వచ్చేవి కావు. ఇకపై వాటికి తరుచుగా పని తగలవచ్చు. ప్రెసిడెంట్ పదవికి ప్రాధాన్యం ఇకముందు బాగా హెచ్చబోతున్నది. ఈ కారణంవల్ల కూడా ఈసారి ఎన్నికను చాలా ముఖ్యమైనదిగా అందరు భావిస్తున్నారు. కాంగ్రెసు, తదితర పక్షాలు తమ బలాబలాల పరీక్షగా దాన్ని భావిస్తున్నాయి.

డాక్టర్ రాధాకృష్ణన్ తాము ఎన్నికకు నిలబడేది లేదని, పదవి నుంచి విరమించుకుంటున్నామని ప్రకటించేదాకా ప్రతిపక్షాలుగాని, కాంగ్రెసుగాని ఏకగ్రీవంగా ఒక అభ్యర్థిని నిర్ణయించే అవకాశం లేదని ముందే తేలిపోయింది. ప్రతిపక్షాలు ముందుగానే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వుంటున్న శ్రీ కోకా సుబ్బారావు అభ్యర్థిత్వాన్ని బలపరచగలమన్నాయి. ఆయన రెండు రోజులు ఆలోచించి పోటీ చేయడానికి ఒప్పుకున్నారు. ప్రతిపక్షాలు ఆయనపేరు ప్రతిపాదించాయి. అంతవరకు తమలో తమకే ఏకాభిప్రాయం కుదరక తటపటాయించిన కాంగ్రెసు డాక్టర్ జాకిర్ హుస్సేన్ పేరును ప్రతిపాదించింది. ఈ విషయంలో కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్‌కు, ప్రధాని ఇందిరాగాంధికి మధ్య భేదాభిప్రాయాలు కూడా వెల్లడయ్యాయి. చివరికి ప్రధానిమాటే నెగ్గింది.

శ్రీ కోకా సుబ్బారావు నామినేషన్ తతంగం అంతా ముగిసిన తరవాత తమను బలపరచవలసిందిగా ఓటర్లకు విజ్ఞప్తిచేస్తూ తాము ఏ పార్టీకి చెందిన అభ్యర్థి కాదని, ఇండిపెండెంటుగా దేశసేవా నిమిత్తమే పోటీ చేస్తున్నామని ప్రకటించారు. పోటీ చేయాలనే ఆలోచన ఆయనంతట ఆయనకు వచ్చింది కాదు. ప్రతిపక్షాలు ఆయనపేరు సూచించిన తరవాతే వచ్చింది. బహుశా ఆయన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వుండకపోతే ఆయనపేరు ఏ ఒక్కరికి తట్టేదికాదు. ప్రెసిడెంట్ పదవికి ఆయన అర్హుడుకాడని కాదు. రాజ్యాంగం ప్రకారం ౩౫ సంవత్సరాలకు పైబడిన ఏ భారతీయ పౌరుడైనా అర్హుడే. కాని, సుప్రీంకోర్టు పదవిలో వుండగా ఆయన ప్రతిపక్షాల సమర్థనపై పోటీచేయ నిశ్చయించడం దేశంలో వాదోపవాదాలకు దారితీసింది. తాను ఏ పార్టీ తరఫున పోటీచేయడం లేదని ఆయన చాలా ఆలస్యంగా చేసిన ప్రకటన కూడా ఈ వాదోపవాదాలను తొల

గించ లేక పోయింది. కొన్ని రాజకీయ పక్షాల సమర్థన తనకు లేకపోతే ఆయనకు పోటీ ఆలోచనవచ్చేదా ?

ప్రెసిడెంట్ అయిన వ్యక్తి రాజకీయ పక్షాల అభిమాన, దురభిమానాలకు అతీతుడుగా వుండాలి. డాక్టర్ హుస్సేన్‌గాని, శ్రీ సుబ్బారావుగాని అలా లేకపోగా, వారిని నిర్ణయించడం మతానికి సంబంధించిన వివాదాలకు, అభిమాన, దురభిమానాలకు కూడా తావిచ్చింది. అంటే వారికి పార్టీల వారీగానే కాక, మతాలవారీగా కూడా వోట్లు పడే అవకాశం ఇవ్వబడిందన్నమాట. అలాగే ఉపరాష్ట్రపతి పదవికి కాంగ్రెసు హిందువును (శ్రీ వి. వి. గిరి) నిర్ణయించగా, ప్రతిపక్షాలు ముస్లిమును (శ్రీ హబీబ్) నిర్ణయించాయి.

ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేది పార్లమెంటు రెండు సభల సభ్యులు. కాంగ్రెసుకు పెద్ద మెజారిటీ వుంది కనుక దాని అభ్యర్థి ఎన్నిక దాదాపు ఖాయమనే చెప్పవచ్చు.

పోతే, రాష్ట్రపతి ఎన్నిక ఫలితమే సందిగ్ధమైంది.

రాష్ట్రపతిని ఎన్నుకునే ఎలక్టరల్ కాలేజిలో పార్లమెంటు ఉభయ సభలలో ఎన్నుకోబడిన సభ్యులు, రాష్ట్రాల అసెంబ్లీలలో ఎన్నుకోబడిన సభ్యులూ వుంటారు. అయితే అసెంబ్లీ సభ్యులకు ఒక్కొక్కరికి ఒక వోటు చొప్పున వుండదు. వారి వోట్లు విలువలలో రాష్ట్రానికిరాష్ట్రానికి తేడాలుంటాయి.

అసెంబ్లీ సభ్యుల వోట్ల విలువలను ఈ విధంగా నిర్ణయిస్తారు. ఒక రాష్ట్రాన్ని తీసుకుంటారు. ఆ రాష్ట్రం మొత్తం జన సంఖ్యను ఆ రాష్ట్రం అసెంబ్లీ సభ్యుల సంఖ్యచేత భాగిస్తారు. వచ్చిన ఫలితాన్ని వెయ్యిచేత భాగిస్తారు అప్పుడు ఫలితంగా వచ్చిన సంఖ్యను ఆ రాష్ట్రం అసెంబ్లీ సభ్యుల వోటు విలువగా పరిగణిస్తారు.

ఉదాహరణకు — ఆంధ్రప్రదేశ్ జనాభానుబట్టి, అసెంబ్లీ సభ్యుల సంఖ్యనుబట్టి ఒక్కొక్క సభ్యుని ఓటు విలువ 125. మొత్తం 287 మంది సభ్యుల వోట్ల విలువ 37,875. ఇలాగే అస్సాంలో వోటు విలువ 94, మద్రాసులో 144, పంజాబులో 107 — ఈ మాదిరిగా మారుతూ వుంటాయి. మొత్తం ఈ విధంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీ సభ్యుల వోట్ల విలువ 1,37, 403.

ఈ సంఖ్యను పార్లమెంటు ఉభయ సభల ఎన్నుకోబడిన సభ్యుల సంఖ్యచేత భాగిస్తే వచ్చేదాన్ని ఒక్కొక్క ఎం. పి. వోటు విలువగా నిర్ణయించారు. మొత్తం పార్లమెంటు సభ్యుల సంఖ్య 725. ఒక్కొక్కరి వోటు విలువ 576. వారి మొత్తం వోట విలువ 4,17,600. ఇప్పుడుఅసెంబ్లీసభ్యుల,పార్లమెంటు సభ్యుల వోట్ల విలువలను కలిపితే

మొత్తం విలువ ౮,౫౫,౦౦౩ వస్తుంది. వీటిలో ఏ అభ్యర్థికి ఎక్కువవోట్లు పడితే అతడు గెలుస్తాడు.

కేవలం పార్టీల వారీగా చూస్తే కాంగ్రెసుకే వోట్లు ఎక్కువ వున్నాయి. వారి మొత్తం వోట్ల విలువ 4, 43,604. కాంగ్రెసేతరుల వోట్ల విలువ 4, 11, 399. తేడా 32 వేల చిల్లర. అంటే కాంగ్రెసు వారందరూ డాక్టర్ జాకిర్ హుస్సేన్‌కు వోటుచేస్తే ఆయన గెలుపు ఖాయం. దీనికితోడు ఇండి పెండెంట్లలో కాంగ్రెసును బలపరిచే వారున్నారు. డాక్టర్ హుస్సేన్ ముస్లింకనుక ముస్లిం లీగ్ వోట్లు పడతాయి. ఇతర మైనారిటీ వర్గాల వోట్లు కొన్ని పడవచ్చు. అందువల్ల ఆయన తప్పక గెలుస్తాడని కాంగ్రెసు విశ్వసిస్తున్నది.

కాని, అంత నిక్కచ్చిగా చెప్ప డానికి వీలులేదేమో. కాంగ్రెసు టిక్కెట్టుపై ఎన్నికైన అసెంబ్లీ సభ్యుల ప్రవర్తన చూస్తున్నాం గదా. ఏరోజున వారు ఎటు తిరిగి పోతారో చెప్పడానికి వీలు లేదు. కాగా, సీక్రెట్ బ్యాలట్‌తో జరగబోయే రాష్ట్రపతి ఎన్నికలో ఎవరెలా వోటు చేస్తారో చెప్పడం ఎలా? ఈ ధీమాతోనే ప్రతిపక్షాలు తమ అభ్యర్థి గెలుస్తాడని విశ్వాసంతో వున్నారు.

మొత్తంమీద, రాష్ట్రపతి ఎన్నిక చాలా ఆసక్తికరమైంది. ముఖ్యులైన అభ్యర్థులిద్దరూ ఆ పద వికి తగిన అర్హతలు కలవారే. ఒకరు ఉపరాష్ట్రపతిగా అనుభవం గడించి, విద్వాంసుడుగా, విద్యావేత్తగా పేరుపొందినవారు. రెండవవారు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా న్యాయ విషయమైన లోతుపాతులు ఎరిగినవారు. చివరికి లెజిస్లేటర్లు ఎవరిని వరిస్తారో మే 6వ తేదీన తేలిపోతుంది.

***





ప్రసంగ చాతుర్యంలో ప్రసిద్ధుడైన

# ఆస్కార్ వైల్డ్

"అతి సర్వత్ర వర్జయేత్" అని పెద్దల సూక్తి.

అంటే అతిని అన్నిచోట్ల వర్జించాలి. దేనిలోను అతి పనికిరాదు; మితంగా వుండాలి.

అన్ని సూక్తుల లాగానే ఇదీ చూడ్డానికి బాగానే కనిపిస్తుంది. దీనికి ఎట్టి పరిస్థితులలోను తిరుగు లేదనిపిస్తుంది.

కాని, ప్రతి నాణానికి రెండో వైపు వుంటుంది. అలాగే ప్రతి సూక్తిని తిరగేసి కొత్త సూక్తిని తయారు చెయ్యవచ్చు. అది కూడా మొదటిదానంత నిజమైందిగానే కనిపిస్తుంది.

ఉదాహరణకి పై సూక్తినే తీసుకోండి. దాన్ని తిరగేస్తే "అతిని ఎప్పుడూ విసర్జించవద్దు" అని వస్తుంది.

అవును మరి. అతి ఏదో, అది ఎలా వుంటుందో తెలుసుకోకపోతే ఏది మితమో ఎలా తెలుస్తుంది?

ఈ మాదిరిగా మనం సాధారణంగా ఉదహరించే సుభాషితాలన్నిటిని తిరగేసి కొత్త సూక్తులను సృష్టించిన ఇంగ్లీషు రచయిత ఒకడున్నాడు. అతని పేరు ఆస్కార్ వైల్డ్.

"కర్తవ్యం అనేది ఇతరులు ఆచరించాలని మనం కోరుకునేది."

"నేను దేనికీ లొంగిపోను — వ్యసనానికి తప్ప."

"కళకు ప్రయోజనం లేదు. కళ కోసమే కళ."

ఇటువంటి సూక్తులను వందలాదిగా తన రచనలలో ఆస్కార్ వైల్డ్ గుప్పించాడు. అతని సంభాషణలలో ఇటువంటివి అప్రయత్నంగా ప్రవాహ సదృశంగా దొర్లేవి.

ఆస్కార్ వైల్డ్ 1854లో ఐర్లెండు రాజధాని డబ్లిన్‌లో జన్మించాడు. ఇంగ్లీషు సాహిత్యాన్ని తమ అద్భుత రచనలతో సుసంపన్నం చేసిన ఆలివర్ గోల్డ్‌స్మిత్, బెర్నార్డ్ షా, జేమ్స్ జాయిస్, డబ్ల్యు. బి. యేట్స్ మొదలైన వారి వలెనే వైల్డ్ కూడా ఐరిష్ వాడే.

> "ఎల్లుండి చేయదగినదాన్ని
> రేపటికి వాయిదా
> వేయవద్దు"
>
> —ఆస్కార్ వైల్డ్

అతని తండ్రి సర్ విలియం వైల్డ్ పేరు పొందిన సర్జన్. తల్లి "స్పెరాంజా" అనే మారుపేరుతో పద్య, గద్య రచనలు చేసేది. ఆమెకు రచయిత్రిగా మంచి పేరుండేది.

ఆస్కార్ వైల్డ్ చిన్ననాటినుంచి సౌందర్యారాధకుడు. తన వేదాంతం సౌందర్యం అని అతడనేవాడు. చదువుకునే రోజుల్లోనే "కళ కళ కోసమే" అనే సిద్ధాంతం లేవదీశాడు. ఆడదానిలా జుట్టు పొడుగ్గా పెంచాడు. తన గదనిండా నెమలి ఈకలు, లిలీపుష్పాలు, ప్రొద్దు తిరుగుడు పుష్పాలు, నీలపు పింగాణీ వస్తువులు ఇంకా ఏమేమిటో అందమైన వస్తువులన్నీ చేర్చేవాడు.

అతన్ని చూసి తోటి విద్యార్థులందరు గేలి చేసేవారు. అతని దుస్తులు కూడా విచిత్రంగా ఉండేవి. అన్ని సంస్కరణలకంటె ముందుగా దుస్తుల సంస్కరణ రావాలి అనేవాడు.

ఆడదానివలె నాజూకులకు పోయినా, వైల్డ్ అబలుడుకాడు. అతని దేహబలం సుప్రసిద్ధమైంది. ఒకసారి ట్రినిటీ కాలేజిలో చదువుతుండగా అతని పద్యాలను ఒక విద్యార్థి వెక్కిరించాడు. వైల్డ్ సరాసరి వెళ్ళి తనకంటె ఒడ్డూ పొడుగూ వున్న ఆ విద్యార్థిని చితగ్గా బాది వదలిపెట్టాడు.

మరొకసారి ఆక్స్‌ఫర్డులో చదువుకునే రోజులలో అతని గదిలోని వింత వస్తువులన్నిటిని ధ్వంసం చేయడానికని నలుగురు బాగా తాగిన విద్యార్థులు దండెత్తివచ్చారు. మొదటివాడు గదిలోకి రాగానే వైల్డు తన బూటుకాలితో ఒక్క తన్ను తన్ని బయటికి పంపించాడు. రెండోవాడిని మొహం చితక గొట్టాడు. మూడోవాడు గాలిలో తేలిపోతూ వచ్చిన దోవనే వెళ్ళిపోయాడు. నాలుగోవాడిని అమాం

తంగా ఎత్తివేసి వాడిగదిలో కుదేసి పైన కుర్చీలు, బల్లలు మొదలైనవి దిట్టంగా ఒత్తుపెట్టి తిరిగివచ్చాడు. ఇదంతా చూస్తున్న మిగతా విద్యార్థులందరు ఆనాటినుంచి వైల్డ్ శిష్యులైపోయారు.

ఇరవై ఏడవ ఏడు వచ్చేవరకు వైల్డ్ పెద్దగా ఏమీ రాయలేదు. కాని, అతనికి ఇంగ్లండులోనేకాదు, యూరప్‌లోను, అమెరికాలోను కూడా పెద్దపేరు వచ్చేసింది. అతని సంభాషణా చాతుర్యం, వేషధారణ, సిద్ధాంతాలు అన్ని దేశాలలోను మారుమోగిపోయాయి.

సంభాషణా చాతుర్యంలో ప్రసిద్ధుడైన డాక్టర్ జాన్సన్ కూడా ఆస్కార్‌వైల్డు ముందు దిగదుడుపే. అతడు ఏ పార్టీకి, ఏ మీటింగుకు వెళ్ళినా హాలు హాలంతా కలకల నవ్వులతో నిండిపోయేది. సభ్యులంతా వైల్డు చుట్టూ మూగేవారు. అతడు గంటల తరబడి తన విచిత్ర సూక్తులతో, ఛలోక్తులతో, కథలతో, సామెతలతో జనాన్ని ముగ్ధులను చేసేవాడు. మొత్తం లండన్ నగరమంతా అతని వెంటపడేది.

"ఇవాళంతా మీరు ఏం చేశారు?" అని ఎవరో అడిగితే "నా పద్యాల ప్రూఫులు చదువుతున్నాను. పొద్దునంతా ఆలోచించి ఒక కామా తీసేశాను. సాయంత్రమంతా ఆలోచించి ఆ కామా మళ్ళీ అక్కడే పెట్టేశాను" అని వైల్డు సమాధాన మిచ్చాడు.

"మీ ఆహ్వానాన్ని అంగీకరించలేకపోయినందుకు చింతిస్తున్నాను. మీ తరవాత ఇంకొకళ్ళు నన్ను ఆహ్వానించారు."

"మీ రెవరో గుర్తు పట్టలేకపోయినందుకు క్షమించాలి. ఈ మధ్య నేను చాలా మారిపోయాను."

ఇటువంటి చతురోక్తులు అతని నోటివెంట ప్రవాహంవలె వచ్చేవి. మాటకు మాట అంటించడంలో అతని నేర్పు అసాధారణమైంది. మనల్ని ఎవరైనా ఏదైనా అంటే దానికి జవాబు మర్నాటిదాకా తోచదు. అరే, ఈ మాట అప్పుడే అంటే బాగుండేది కదా అనిపిస్తుంది. అటువంటి 'రిపార్టీ' అనబడే మాటలు వైల్డ్ పుంఖాను పుంఖంగా ప్రయోగించేవాడు.

1882 నాటికి అతని వయస్సు 28 సంవత్సరాలు. చెప్పుకోదగింది, చదవదగింది అప్పటికి అతడు ఏమీ రాయనేలేదు. అయినా, అతనికి అమెరికానుంచి ఆహ్వానం వచ్చింది ఉపన్యాసా లివ్వవలసిందని.

అతని అమెరికన్ యాత్ర అద్భుత విజయం పొందింది. అతడు అమెరికాలో అడుగు పెట్టింది మొదలు తిరిగివెళ్ళే క్షణంవరకు అమెరికన్ పత్రికలన్నీ అతని ప్రశంసలతో నిండిపోయాయి. అతని

## వచ్చే సంచికలో

పరిహారం —ద్వివేదుల విశాలాక్షి
తీర్పు —బీనాదేవి
వంతెన —భమిడిపాటి జగన్నాథరావు
కథలాంటి జీవితం —ఐ. వి. ఎస్. అచ్యుతవల్లి

---

చతురోక్తులను ప్రచురించని పత్రిక వుండేదికాదు.

నౌక దిగి దిగడంతోనే కస్టమ్స్ అధికారి వైల్డువద్దకువచ్చి మామూలు ప్రకారం 'మీ లగేజిలో తనిఖీ చేయవలసినవి ఏమైనా ఉన్నాయా?' అని అర్థం వచ్చేట్లు అడిగాడు. 'నా తెలివి తేటలుతప్ప నా వద్ద మరేమీ లేవు (ఓన్లీ మై జీనియస్)' అని వైల్డు ఇచ్చిన సమాధానం అమెరికాలో వెంటనే ప్రాకిపోయింది.

వైల్డు ఉపన్యాసం ఇవ్వబోతున్న ఒక సభలో అతన్ని గేలి చేయడానికి అరవైమంది విద్యార్థులు సరిగ్గా అతని మాదిరిగానే విచిత్రవేషాలు ధరించి లిలీపుష్పాలను, పొద్దుతిరుగుడు పువ్వులను చేత పట్టుకుని వచ్చి ముందు వరసలో కూర్చున్నారట. వారి సంగతి తెలిసి వైల్డు తాను మామూలుగా ధరించే విచిత్ర వేషం మానేసి సాధారణంగా అందరు ధరించే దుస్తులతో వెళ్లాడు. పాపం, ఆ విద్యార్థులు తెల్లమొహాలు వేశారు. 'మామూలు మనుషులు గొప్పవారికిచ్చే కానుకే – అనుకరణ' అని అతడు ఉపన్యాసం ప్రారంభించాడు. హాలు హాలంతా నవ్వులతో దద్దరిల్లిపోయింది.

ఇంగ్లండు తిరిగి వచ్చిన తరవాత అతడు కొన్నాళ్ళు 'వుమన్స్ వర్ల్డు' అనే పత్రిక సంపాదకత్వం, 'పాల్ మాల్ గజెట్' పత్రికలో ఆర్ట్ క్రిటిక్ మొదలైన ఉద్యోగాలు చేశాడు కాని, ఏవీ నిలుపుకోలేక పోయాడు.

ఆ రోజులలో ప్రసిద్ధుడైన అమెరికన్ చిత్రకారుడు విజ్లర్‌కు, వైల్డుకు తరచుగా ఛలోక్తుల యుద్ధాలు జరిగేవి. విజ్లర్‌కు స్వాతిశయం ఎక్కువ. అతని చిత్రాలను సమీక్షిస్తూ వైల్డు ఇలా రాశాడు: "విజ్లర్ గొప్ప చిత్రకారుడని నా అభిప్రాయం. అంతేకాదు, నా అభిప్రాయంతో మిస్టర్ విజ్లర్ కూడా ఏకీభవిస్తున్నాడు."

32వ ఏట అతడు మొదటిసారిగా ఫెయిరీ టేల్స్ సంపుటం ఒకదాన్ని ప్రచురించాడు. పిల్లలను ఉద్దేశించి రాసినవైనా ఆ కథలు అపార విజయం పొందాయి.

ఆ తరవాత నాలుగేళ్ళకుగాని వైల్డు తనకు శాశ్వత కీర్తిని, లండన్‌లో అద్భుత విజయాన్ని సాధించిపెట్టిన నాటకాలను రాయలేదు. 1892 లో "లేడీ విండర్ మియర్స్ ఫ్యాన్" అనేదానితో మొదలుపెట్టి 1894లో "ఇంపార్టెన్స్ ఆఫ్ బీయింగ్ ఎర్నెస్ట్" అనే నాటకం, ఆ తరవాత "ఐడియల్ హజ్బెండ్" మొదలైన నాటకాలు రాశాడు. ఇవన్నీ లండన్ నగరాన్ని గాలి దుమారంలా ఒక ఊపు ఊపి వదిలిపెట్టాయి. షేక్‌స్పియర్ తరవాత ఇంత గొప్ప నాటక రచయిత లేడనే వరకు ఆనాటి ప్రేక్షకులు అతనిపట్ల తమ ఆదరాభిమానాలు కురిపించారు.

ఈ విధంగా అతనికి 40 సంవత్సరాల వయస్సు వరకు ఒక వెలుగు వెలిగాడు. కాని హఠాత్తుగా ఆ వెలుగు ఆరిపోయింది. అతని దశ మారిపోయింది. ఎంత కీర్తి సంపాదించాడో అంతగా అపకీర్తి పాలయ్యాడు. అతని సెక్సు జీవితాన్ని గురించి కొన్ని భయంకరమైన ఆరోపణలు ప్రచారంలోకి వచ్చాయి. అతని అభిమానులు అవన్నీ అబద్ధాలని నమ్మి అతన్ని కాపాడ్డానికి ప్రయత్నించారు. కాని, అవి నిజాలని రుజువుకావడంతో, అవమానం, కారాగార శిక్ష, దైన్యం, దారిద్ర్యం అతన్ని చుట్టుముట్టాయి. చివరికతడు చాలా హీనమైన చావుకు గురి అయ్యాడు. ప్రపంచ సాహిత్య చరిత్రలో అతని అవసాన సంవత్సరాల కాలం అత్యంత విషాదకరమైన ఘట్టాలలో ఒకటి.

అయితే, అతడు చనిపోయిన కొన్ని సంవత్సరాల తర్వాత అతని ప్రతిభా విశేషాలు తిరిగి వెలుగులోకి వచ్చాయి. అతని వ్యక్తిగత దౌర్బల్యాలు ఎలాంటివైనా అతని గొప్పదనం అసాధారణమని ప్రపంచం గుర్తించింది. షేక్‌స్పియర్ నాటకాల తర్వాత యూరప్‌లో అంతగా ప్రచారం పొందినవి ఆస్కార్ వైల్డు నాటకాలే.

***

# "రచయితను కావాలని..."

మరొక్క సెకన్ ఆగితే ప్రపంచం నుండి తమకు కావలసింది పోతుందన్నట్లు త్వరత్వరగా నడచే మనుష్యులు, వాడిచూపులతో జట్లు జట్లుగా నడిచే కుర్రకారూ, కార్లున్న పెద్ద మనుషుల హారన్లు, 'నీ కేలే ఉంది బోడిజారు' అని తప్పుకొనే కాళ్ళున్న చిన్న మనుషులు; సిటీ బస్‌ల కోసం వృధాగా జీవితంలో చాలా భాగం ఖర్చు పెడుతున్నామే అనుకొనే వాళ్ళూ, వాళ్ళలోనే ఆధునిక నాగరికతకు ప్రతినిధిగా ఒక నాజూకూ అమ్మాయీ, ఆ సమీపంలోనే నేరో ప్యాంట్లు ఛలోక్తులూ, వాటిని వింటూ గుర్రుగా చూసే ధోవతీ లాల్చీలూ—విశాఖపట్నంలో పూర్ణా మార్కెట్ ప్రాంతానికి రూపకల్పన చేస్తున్నారు. దూరంగా పేవ్‌మెంట్ మీద ఓ స్త్రీ నిర్లిప్తంగా ఇదంతా చూస్తోంది. వీళ్ళలో ఎంతమంది తీరుతున్న ఆశలతో జీవిస్తున్నారు? ఎంతమంది ఆశలతో అంతస్తులు కడుతున్నారు? ఆశలు కూడ పుట్టని నాలాంటి దౌర్భాగ్యులెందరు? అనే ప్రశ్నలు కళా విహీనమైన ఆమె మొహంలో, అదోరకమైన నవ్వుతో స్నేహం కలుపుకొన్నాయి. నీ జీవితానికి మేం నిర్వచనం ఇవ్వమా? అన్నట్లున్నాయి ఆమె ధరించిన చిరిగిన, మాసిన బట్టలు. దిగంబరులైన ఆమె నలుగురు పిల్లలూ, అన్యాయపు సృష్టికి భగవంతుడి మీద కేసు పెడితే, ఆ కేసుకు సాక్ష్యులుగా నిలబడి నిజయాన్ని చేకూడుస్తారనడంలో ఏ మాత్రం సందేహంలేదు. వాళ్ళు విలాసంగా అర్థంలేని పాటలతో, తోచిన గంతులు వేస్తూ, ప్రక్కనున్న షాపు యజమాని కేకలకు గొణుక్కుంటూ, నోరు మూసుకొన్నారు. అంతలోనే చెత్తకుండిలో వేసిన పదార్థాలకోసం పరుగులెత్తి, కుక్కలతో హోరాహోరీ పోరాడి, అంతవరకూ కలసికట్టుగా ఉండి అప్పటికప్పుడే వాళ్ళలో వాళ్లు రక్కుకుంటూ, వాటికోసం కొట్టుకొంటూంటే, నాలుకలు బయటపెట్టి కుక్కలు విస్తుపోయి చూస్తున్నాయి. చివరికి బలమున్నవాళ్ళదే రాజ్యం అన్న ప్రపంచంలోని ప్రాథమిక సూత్రం నిజంకాగా, చిన్న వాళ్ళిద్దరూ అరుస్తూ, ఏడుస్తూ, వాళ్ళ

---

మొదటి బహుమతి రు. 50

**టి. జె. ఫ్యూజిక్,**
3వ సంవత్సరం.
ఆంధ్రా మెడికల్ కాలేజి,
విశాఖపట్నం

---

# పోటీదార్లకు మనవి

"జ్యోతి" మాసపత్రిక కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థినీ, విద్యార్థుల నిమిత్తం "చిన్న చిన్న కథల పోటీ" నిర్వహిస్తున్నది. దీనిలో పాల్గొనేవారు ఈ క్రింది నిబంధనలు పాటించ గోరుతున్నాము

1. కథలు "జ్యోతి" లో రెండు మూడు పేజీలకు మించరాదు

2. స్వకపోల కల్పితమైన స్వతంత్ర రచనలే పంపించాలి.

3. తమ పూర్తిపేరు, చదువుతున్న తరగతి, కాలేజి, లేక విశ్వవిద్యాలయం పేరుతో సహా పూర్తి చిరునామా జత పరచాలి.

4. ప్రతినెల 1వ తేదీ వరకు అందిన రచనలనే, ఆ పైనెల సంచికలో పోటీకి పరిగణిస్తాము.

5. బహుమతి పొందని రచనలు త్రిప్పి పంపబడవు. అందుచేత స్టాంపులు పంపించ నవసరంలేదు. రచనల విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

6. కవరు మీద "జ్యోతి, చిన్న చిన్న కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి.

7. రచనలను పంపవలసిన చిరునామా: ఎడిటర్, "జ్యోతి" సచిత్ర మాసపత్రిక, విజయవాడ - 2.

8. రూ. 50లు ప్రథమ బహుమతి. రూ. 25లు చొప్పున రెండు ద్వితీయ బహుమతులు.

మ్మకు ఈ లోకాన్ని గుర్తు చేసి, కడుపు మాడ్పించి న్యాయం చెప్ప మన్నారు ప్రౌఢటినుండి బిచ్చగత్తెగా తన సంపాదన పతి పైనపెట్టే నానే నిరాశతో, కోపం పెరిగి, ఏం చేయాలో తోచక, వాళ్ళ వీపుల మీద వడ్డించింది.

—తరువాత? వాళ్ళని చూచి మనసు కరగి, విలపించిన ఆ స్త్రీని ఒక పాత్రచేత, ఒక దొంగతనం చేయించాలి. ఆ తరువాత పాఠకుల పూర్తి సానుభూతి లభించేలా బ్రహ్మాండమైన మెలిక సృష్టించాలి... కథను "జ్యోతి" కి పంపించాలి. ఇలా ఆలోచిస్తూ కళ్ళు మూసుకొన్న నాకు హఠాత్తుగా ఈ కథ నే నెందుకు వ్రాస్తున్నాను అనే భావన కలిగింది.

తరువాత నా గురించి నాకే అదోలా అనిపించసాగింది. నిజంగా నే నా స్త్రీని పూర్ణా మార్కెట్ ప్రాంతంలో చూశాను. అయితే నేనేం ఒక్క పైసా సహాయంకూడా చెయ్యలేదే. ప్రక్కనున్న ఫ్రెండ్స్, "అబ్బ! వీ డేరా దయామయుడు!" అని అనుకొంటారేమో నని పిరికితనానికి లోబడ్డానే! (హోటల్లో టిప్ ఇస్తే పర్వాలేదు) అటువంటి నేను, పైగా ఆ స్త్రీని నా కథకు వస్తువుగా తీసుకొని, ఏవేవో కల్పించబోతున్నాను. రానురాను నా భావనలు తీవ్రరూపం దాల్చి, నా ఎదురుగా ఆ స్త్రీ నిలబడి, నన్ను నిలదీసి అడుగుతున్నట్లు అనిపించసాగింది. "ఏం బాబూ! నాకు పాఠకుల సాను

భూతి సంపాదించి పెడతావా? ఏం చేసుకోమంటావు బాబూ? నాకొక దొంగతనం కూడ అంటగడతావు కదూ! ఇప్పటికే జీవితంలో ఎన్నో పాట్లు పడ్డ నాకు నీ కలంపోట్లు తక్కువైనవా బాబూ! ఒక్క పైసా వేసి నీ సానుభూతి చూపెట్టుకోలేని బాబువి... నీ పేరు అచ్చులో చూసుకోవడం కోసమా... ఎంత స్వార్థం. అవునే! నేనూ నా పిల్లలూ లోకానికే లోకువ కదూ"—నిర్లక్ష్యంగా చూస్తూ, అదృశ్య మయినట్లుంది.

అబ్బ! మనసంతా అదోలా అయింది. ఆమె ఆరోపణలన్నీ నిజమేనా? నా పేరు అచ్చులో చూసుకోడం కోసమా? ఛ...ఛ...కాదు. ఒక చిన్న రచయితగా ఆమె దుస్థితి చిత్రించ దలచాను... అయితే ఏదో అసంతృప్తి నాలో దోబూచులాడ సాగింది. నా అంతరంగం వెక్కిరిస్తోంది. ఈ అసంతృప్తులూ, వెక్కిరింతలూ పోవాలంటే ఒక్కటే చెయ్యాలి. 'రూంమేట్! డబ్బులేమన్నా ఉంటే ఇయ్యి" అడిగాను. "సినిమాకా?" అన్న వాడి ప్రశ్నకు జవాబు చెప్పకుండా వాడిచ్చింది తీసుకొని, త్వరత్వరగా నడచి, నేననుకొన్న ప్రాంతం చేరాను. ఆ ప్రదేశం ఖాళీగా ఉంది. పక్కనే గలభా జరుగుతుంటే అటువైపు నడిచాను. "ఇంకొకసారి ఈ చుట్టుపక్కల కనబడ్డావంటే, కీళ్ళూడదీయించి, జైల్లో తోయిస్తాను... ఇవాళ పళ్ళ దొంగతనం... రేపు ఇంకొకటి... జాగ్రత్త" అని పళ్ళషాపు ఆసామి పళ్ళు బిగబెట్టి చేసే హెచ్చరికకూ, చుట్టూ వున్న జనం పేవ్‌మెంట్లపై బ్రతుకుల చరిత్రల గురించి చేసే విమర్శలకు, అర్థంకాని చూపుతో జవాబిస్తోంది—ఆ స్త్రీయే. "పో ఇక్కణ్ణుంచి" అన్న ఆ ఆసామీ మాటతో, "ఇంతటితో వదిలాను, సంతోషించు" అన్న అర్థం కూడా తీసుకొని బయట పడింది.

నేను నిశ్చేష్టుణ్ణయ్యాను. అయితే నా కలంకల నిజమైందన్నమాట! అంతలోనే నేను కాగితం మీద పెట్టినదంతా జ్ఞాపకం వచ్చింది. ఆమెను వెంటాడాను. ఒక వీధి మలుపులో ఆమెను సమీపించాను... భయంగా చూసింది నావంక... "నిజంగా దొంగతనం చేశావా?" ప్రశ్నించాను. ఎందుకు నాలో అంత ఉత్సుకత కలిగిందో ఇప్పటికీ నాకు అర్థం కాలేదు. "తొలిసారిగా సేద్దామనుకొన్నను... ఈ ఎదవలకోసం. కానీ సెయ్యలేదు బాబూ... దొరికిపోయాను... సెమించు బాబూ! వదిలిపెట్టు" దణ్ణం పెట్టింది. వీధి దీపం గుడ్డికాంతిలో, ఇక ముందు చెయ్యను అన్న హామీ ఏమైనా ఉందేమో అని చూపుల్లో వెదికాను. ఆ చూపులు నాకేం అర్థం కాలేదు. చేతిలో ఉన్న డబ్బు ఆమె చేతిలో పడవేసి, గిర్రున వెనక్కి తిరిగి వచ్చేశాను. పోస్టల్ అప్ ఎక్కుతుంటే, మీదపడ్డ లైట్ హౌస్ వెలుగు "చూడు! ఇలాంటి బ్రతుకులు చాలా ఉన్నాయి లోకంలో" అని మళ్ళీ క్షణంలో మాయమయింది.

***

# వాక్యాస్త్రమ్

కాళింది వచ్చింది

అంతవరకూ కోలాహలంగా ఉన్న మా పరిసరాలూ, శరీరాలూ సర్దుకొని కూర్చున్నాయి నిశ్శబ్దంగా ఎవరు తెచ్చుకున్న టిఫిన్ వాళ్ళు తినేస్తున్నారు ఆమె వచ్చిందీ అంటే భయమే! బల్లి శాస్త్రం నిజమో కాదో తెలీదు గానీ, ఆమె వాక్యాస్త్రం మాత్రం బ్రహ్మాస్త్రం! అందుకే అందరూ ముద్దుగా 'కాళీ' అని పిలుచుకొంటారు (పరోక్షంలోనే సుమండీ) ఆమె నోరు, నోరు కంటే గొంతు, దాని కంటె ప్రభావం ఒకదాని కంటె ఒకటి పెద్దవి

మరి మీకు ఉదాహరణ కావాలా?

ఓరోజు ఇలాగే టిఫిన్ తింటున్నాం కాళింది కూడా వచ్చి నా ప్రక్కనే కూర్చున్నది క్యాంటీన్ బోయ్ కాఫీలు తెచ్చిపెట్టాడు నేను మాటల ధోరణిలో మర్చిపోయి గ్లాసు నోటి దగ్గరకు పోనిచ్చాను అంతే! నాలుక ముక్క కరిగి కాఫీలో పడిందేమో? అనుకొని చటుక్కున గ్లాసు వదిలేసి నాలుక తడుముకున్నాను

ఎదురుగా కూర్చున్న లలిత 'కాళిందీ' అంది స్వరయుక్తంగా కాళింది వెంటనే ఊరుకోకుండా నవ్వుతూనే 'ఏం పాపం రోగమా' అన్నది లలిత వంక చూసి అంతే లలిత మరి వారం వరకూ మంచం దిగితే ఒట్టు!

నవ్వుతూ అంటేనే అంత ప్రభావం చూపిన ఆమె వాగ్బాణం, కోపంతో అంటే -? అందుకనే అందరూ సర్దుకు కూర్చున్నారు ఆ దేమీ గమనించనట్లే వచ్చి కూర్చున్నది మౌనంగా వుంది

ప్రక్కనే ఉన్న నా కేరియర్ మీది మూత తీసుకొని చూస్తూ -

'మధురా! నీ పేరు చాలా బావుంటుంది నువ్వూ, నేనూ ఒక విధంగా సన్నిహితులం కూడా కదూ!' అన్నది

నా గుండెల్లో 'సర్కార్' స్టార్ట్ అయ్యింది 'అయ్య బాబోయ్, ఇవాళ నా మీద పడిందా నీ కన్ను కాళీ!' అనుకొని పైకి మాత్రం నవ్వేశాను

'సన్నిహితులం అయినా, ఒకే గోపాలుడు మాత్రం వద్దుబాబు!' అన్నాను

కాళింది పెద్దగా నవ్వింది

---

రెండవ బహుమతి రు 25

## మిస్ ఎ. కమల

భాషా ప్రవీణ (3 వ సం॥)
ఎస్ బి యస్ సంస్కృత కాలేజి, పొన్నూరు
గుంటూరు జిల్లా

---

"పోస్ట్!"

వెయిటింగ్ రూమ్‌లోకి వచ్చాడు పోస్ట్‌మేన్ అందరం అటే చూశాము

"ఎక్స్‌ప్రెస్ కార్డ్, మిస్ మధురి – సెకండ్ బి యస్‌సి" అన్నాడు

"నీకే తీసుకో" అంది కాళింది నన్ను మోచేత్తో పొడిచి.

అర్థం కాలేదు. సంతకంచేసి తీసుకున్నాను. పైన స్టేషన్ అన్నదాని ప్రక్కనే "మద్రాస్" అని కనిపించింది. ఇంకా విస్మయం. సాంతం చదివి అలాగే రాయి కట్టుకు పోయాను.

కాళింది నా చేతిలోనుండి కార్డు లాక్కుని చదివి "కుమారి మధుర పంపిన కథకి ప్రైజు వచ్చినది గనుక, వెంటనే తమ ఛాయా చిత్రాన్ని పంపవలసిందిగా సదరు పత్రికా సంపాదకుల కోరిక" అని చాటించేసింది.

ఇంతలో అందరూ "కంగ్రాచ్యులేషన్ మధురా" అంటూ చుట్టూ చేరారు. నాకు గాలి అందడంలేదు.

ఇంతలో కాళిందే అన్నది "మరో శుభవార్త! ఈ సమయానికి చిహ్నంగా మధురాదేవి ఈనాటి కాంటీన్ బిల్లు మొత్తం ఇవ్వగలదు" అందరూ "హియర్, హియర్" అంటూ చప్పట్లు కొట్టారు. మాట్లాడలేక అయిదు రూపాయల చిల్లరగా కాంటీన్ బోయ్‌కిచ్చి పంపేశాను

ఇంతలో కాలేజీ బెల్ కొట్టేశారు

లాస్ట్ అవర్‌లో "నన్ను ప్రిన్స్‌పాల్ గారు పిలుస్తున్నారంటూ కబురు తెచ్చాడు ప్యూన్

భయపడ్తూనే వెళ్ళాను.

"రా మధురాదేవీ నువ్వేదో కథ వ్రాశావట? దానికి ప్రైజ్ కూడా వచ్చిందట. సంతోషం! నువ్వింకా పైకి రావాలని ఆశీర్వదిస్తున్నాను. ఇంకొక విషయం. చాలా ముఖ్యమైనది. వచ్చే నెలలో జరుగబోయే కాలేజీ వార్షికోత్సవానికి గరల్స్ చేత నాటకం వేయించాలని ఉంది. అదీ మన కాలేజీ విద్యార్థులే వ్రాస్తే మరీ బాగుంటుంది గదూ? అందుకని నువ్వు తప్పక ఒక వారంలో చిన్న నాటిక వ్రాసి యిచ్చావంటే, తక్కిన విషయాలు నేను చూచుకుంటాను. సరే నువ్వెళ్ళు. క్లాసు అనవసరంగా పోతుంది" అంటూ ముగించాడాయన.

నాకు ముచ్చెమటలు పట్టినై.

"అ...అ...ది కాదండీ"

"నాకు తెలుసు నువ్వు చెప్పబోయేదేమిటో. స్టడీస్ దెబ్బతింటాయని గదూ? ఏం ఫర్వాలేదు. అన్నిరంగాల్లోనూ విద్యార్థులు కృషి చెయ్యాలి" అంటూ ఆయనలేచి వెళ్ళిపోయారు.

నీరసంగా క్లాసుకువచ్చి కూర్చున్నాను "ఆయనకి విషయం ఎలా తెలిసి ఉంటుంది" అనుకుంటూండగా, ఈగోల జరిగినప్పుడు క్యాంటీన్ బోయ్ అక్కడే ఉన్నట్లు గుర్తొచ్చింది. వాడు ఏ లెక్చరర్‌తోనో చెప్పి వుంటాడు ఆయనకాస్తా ప్రిన్సిపాల్‌కి అంటించాడు. భగ భగ మండుతున్నది మనసు.

ఏం చెయ్యను? ఇప్పుడేం చెయ్యాలి? నోట్సు వ్రాసుకోడానికే బద్ధకించే, తను కథ వ్రాయడమేమిటి? దానికి ప్రైజ్ రావడమేమిటి? చిత్రం! అంతా మహా విచిత్రం!!

తలంతా దిమ్ముగా మొద్దుబారిపోయింది. 'ఇప్పుడీ నాటకం బెడద వదిలించుకోవడమెలాగా" అని ఆలోచిస్తూ నెమ్మదిగా, అడుగులో అడుగు వేస్తున్నాను.

"ఏరా, రఘూ! నీ కథేమయ్యిందిట? మాధురి అనే కలం పేరుతో పంపేవ్ కదూ?" అని వెనుక నుండి మాటలు వినిపించాయి. ఆశ్చర్యంతో వెనక్కి తిరిగాను. నా వెనకే మాట్లాడుకుంటూ వస్తున్నారు, మా క్లాసులోనే ఉన్న రాజూ, రఘూ. తత్తరపడుతూ నా కొచ్చిన ఉత్తరం తీసి అడ్రస్ చూశాను "మిస్ మాధురి" అనే కనిపించిందప్పుడు

ఇంగ్లీషులో ఉండటంవల్ల పోస్‌మేన్ పొరబాటుగా "మదురి" అన్నాడని ఊహించాను

కథకి ప్రైజ్ రాలేదని ఎంత బాధ పడుతున్నాడో ఏమోనని ప్రక్కమలుపు తిరుగుతున్న రఘూని చూసి "మిస్టర్ రఘూ" అని పిల్చాను.

అతడు ఆశ్చర్యపడుతూ నా దగ్గరకు వచ్చాడు.

"మీకు వచ్చిన ఉత్తరాన్ని పోస్టుమేన్ పొరపాటున నా కిచ్చేడు. తీసుకు వెళ్ళండి. మీ కథకు ప్రైజ్ వచ్చినందుకు హార్టీ కంగ్రాచ్యులేషన్స్" అంటూ కార్డు అందించేను.

"చూడండి రఘుగారూ! ఇది చాలా గందరగోళం చేసింది. రేపు ప్రిన్సిపాల్ గారికి 'రచయిత' మీరేనని తెలియజెయ్యండి. నన్ను బ్రతికించిన వారవుతారు" అన్నాను.

అతడు "థాంక్స్" చెప్పి వెళ్ళిపోయాడు.

ప్రక్కనే వున్న హొటల్లోకి వెళ్ళాను, హాయిగా గాలి పీల్చుకొంటూ.

పరధ్యానంగా కాఫీ గ్లాసు పట్టుకొన్నానేమో, చుర్రుమన్నది చెయ్యి. వెంటనే జ్ఞాపకం వచ్చింది ఎప్పుడో సంఘటన మరోసారి అనుకున్నాను "కాళింది వాక్యాస్త్రం బ్రహ్మాస్త్రం!"

***

# అదృష్టం

“టెలిగ్రాం సార్”—

ఆ సారు తనేనని తెలిసి శేషగిరి ఫైళ్ళ గుట్టలోంచి తల పైకి ఎత్తాడు. 'మీకు టెలిగ్రాం వచ్చిందండీ' అని పోస్టల్ బంట్రోతు కవరు మీద పడేశాడు. ఏం కొంప మునిగిందోనని వణికే వేళ్ళతో సంతకంపెట్టి కవరు చింపాడు. మద్రాసు నుంచి. మద్రాసులో తనకెవ్వరూ లేరే?

'గ్లాడ్ టు ఇన్‌ఫార్మ్ యు గాట్ ది ఫస్ట్ ప్రైజ్' — హెయిర్ ఆయిలు కంపెనీవాళ్ళ మానేజరు పంపింది.

శేషగిరి తల తిరిగిపోయింది. “నాకు—శేషగిరికి—ఫస్టు ప్రైజు” తను వున్నది ఆఫీసులో అని మర్చిపోయి ఆనందంతో ఆవేశంలో ఒక గావుకేక పెట్టాడు.

'ఇందాకా బాగానే వున్నాడు. ఇంతలో వీడికి ఏం వచ్చిందోనని' నలుగురూ చుట్టూ మూగారు.

టెలిగ్రాం ఎవర్నో పంపించివేసి వుంటాడని మూర్తి టెలిగ్రాం పైకి తీసి చదువసాగాడు — “ఫస్టు ప్రైజ్! అమ్మబాబోయ్! శేషగిరిగాడికి ఫస్టుప్రైజ్ — అంటే పదివేల రూపాయలు” అందరూ కాసేపు అసూయతో దిమ్మెక్కిపోయారు.

“కంగ్రాచ్యులేషన్స్ గురూ!” అందరూ కోరస్‌గా అన్న ఆ అభినందనలు తన చెవుల్లోకి దూరలేదు.

ఇంకా శేషగిరి ఆ షాక్‌లోంచి తేరుకోలేదు. ఫాన్ కేసి వెర్రివెర్రిగా చూస్తున్నాడు... ఔను మరి. నూటయాభై రూపాయల గుమాస్తాగాడికి పదివేలంటే మాటలా.

ఆఫీసులో ఏదో ప్రళయం వచ్చినట్లుందని పరుగెత్తుకు వచ్చిన మానేజరు విషయం తెలుసుకొని తనవంతు కంగ్రాట్స్ అందజేశాడు. జెలసీ ఆయన కళ్ళల్లో స్పష్టంగా మెరుస్తోంది అనుకొన్నాడు శేషగిరిరావు.

“గురూ! మరి మా పార్టీ మాట ఏం చేశావ్?” మళ్ళీ కోరస్.

“తప్పకుండా! సాయంత్రం బృందావన్‌లో” చిరునవ్వుతో వాళ్ళకి వరం యిచ్చాడు.

తన ఆనందం పంచుకోనేందుకు అర్ధాంగి వుందని గుర్తుకు వచ్చి త్వరగా పర్మిషన్ అడిగి యింటి ముఖం పట్టాడు “కాపురానికి వచ్చి రెండేళ్ళయింది. ఒక ముద్దా,

రెండవ బహుమతి రు. 25

## వెన్నవెల్లి రామం

బి ఎస్సీ, ఫైనల్ బి ఇ (ఎలక్ట్రికల్)
కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్,
కాకినాడ

మురిసేటూ—! పక్క యింటావిడ కట్టుకొంటే చూసి మురిసేదుకే తప్ప టెర్లీను చీర కట్టుకొనే యోగ్యత నాకు లేదు" — శ్రీమతి ఈ మాట ఏ వెయ్యిసార్లో అని వుంటుంది కొంతకాలం "ఈ నెలలో తప్పకుండా" అనేవాడు ఆ తర్వాత ఆ మాట వినబడనట్లు ఊరుకొనే వాడు "దాన్తో తనని ఒర్రి అసమ ర్థుడి కింద జమకట్టి పారేసింది ఇప్పుడు చూపించాలి మన తడాఖా" అనుకొని బట్టలకొట్టులో జొర బడ్డాడు తీరుబడిగా అన్ని చీరలూ చూసి ఒక చీర, బ్లౌజూ తీయిం చాడు బిల్లు డెభ్భై అయ్యింది "ఓస్ యింతేనా" అని ఇల్లు జేరాడు

భర్త ముఖారవిందం, చేతిలో ఎన్నడూ లేనిది ప్యాకెట్టు చూసి లక్ష్మి ముఖం చేటంత అయ్యింది సంగతి తెలుసుకొని "తన మొగుడు యింత గొప్పవాడా" అని నమ్మనట్లు ముఖం పెట్టింది

"మరి ఏమిటి అనుకున్నావ్! ఈ శేషగిరి అంటే ఇంతకాలం నివురు గప్పిన నిప్పు-అష్టే"

వచ్చిన అవకాశాన్ని శేషగిరి సద్వినియోగం చేసుకొని తన గొప్ప నంతా ఒక్కసారి ఏకరువు పెట్టాడు

సాయంత్రం ఆఫీసుకు వెళ్ళి తన మిత్ర బృందాన్నంతా వెంట బెట్టుకొని హొటలుకేసి నడిచాడు అంతా శేషగిరిని ఒకటే పొగడ్డం రూఫ్ గార్డెన్‌లో, పుచ్చ పువ్వు లాటి వెన్నెల్లో శేషగిరి షాజహాన్ చక్రవర్తి అంత గొప్పగా ఫీల య్యాడు అంతా బ్రేవ్‌మని త్రేన్చి థ్యాంక్స్ చెప్పి యిళ్ళకిపోయారు బిల్లు నలభై-పైసలు కాదు - రూపా యలు ఎప్పుడూ బట్టల కొట్టులోనే అంత బిల్లు యివ్వని శేషగిరి, నలభై రూపాయలు నవ్వుతూ యిచ్చేశాడు

మర్నాడు గంట ఆలస్యంగా ఆఫీసుకు వెళ్ళిన గిరి మేనేజరు దగ్గ ర్నుంచి మంగళహారతి రానందుకు — "హు! డబ్బు మహిమ" అని ఫోజు యిచ్చి కాళ్ళు జాపుకు కూర్చు న్నాడు పోస్టుమాన్ యింకా ఎంత సేపట్లో వస్తాడో అని ఆలోచిస్తూ వరాలు యిచ్చే ఆది శివుడులా ప్రత్యక్షమయ్యాడు పోస్టుమాన్ తనకి ఒక కవరు లోపల ఒక కాగితం దానికి గ్రుచ్చిఒక చెక్కు హుందాగా కాగితాన్ని చదివాడు

"ఒక్క తప్పూ లేకుండా మీరు పంపినకూపనుకి మొదటి బహుమతి మీలాగే పంపిన అందరికీ బహు మతి సొమ్ము సమానంగా పంచడ మైనది దీనితో మీకు రావలసిన సొమ్ము నూరు రూపాయలు చెక్కు ద్వారా పంపుచున్నాము ఒక తప్పుతో పంపిన—" ఇక మీదట ఉత్తరం చదువలేక పోయాడు నెల గడిచేందుకు అప్పుకోసం ఎవరి దగ్గరకి పరుగెత్తాలా అని ఆలో చిస్తూ

* * *

# తీరని వెతల్లో తీయని గాథలు

**సి. ఆనందారామం**

"అతి సాధారణంగా ఉంది—"

—అవును—అలాగే అన్నాడు. అతను తప్ప ప్రతి ఒక్కరూ ఎంతో గొప్పగా ఉందన్నారు. అతను మాత్రం అలా అన్నాడు. ఎందుకు? అతిశయం—తనకే మహా అంతా తెలిసినట్లు—ఆ మాటలు తన మనసు నెంత మండిస్తాయో, తన అహాన్నికెంత గొడ్డలిపెట్టులో అతనికి తెలియదూ? తెలుసు — తెలిసే అన్నాడు తన నవమానించాలని.

తను కూడా కొంత వ్రాయగల ననుకుంటూన్న రచయిత్రికి "నీ రచన అతి సాధారణంగా ఉంది" అనటం కంటె అవమానం ఉంటుందా? రచనలు చేసేవాళ్ళకే ఈ క్షోభ అర్థమవుతుంది.

రావుమీది కోపంతో ఉడికిపోతూ కూర్చుంది సరళ. రిక్షా ఆగిన చప్పుడుకు కిటికీలోంచి బయటికి చూసింది.

ఎవరు? సుదర్శనం బావ! తమ ఇంటికి! ఆశ్చర్యంగా వెళ్ళి తలుపు తీసింది.

"ఎవరు? సుదర్శనమా?"

మాటలు రాక నిలబడి పోయింది సుభద్ర.

తన రాక అందరిలో కలిగించిన సంచలనాన్ని చూసి సుదర్శనం కొంత ఇబ్బందిగా ఫీలయ్యాడు.

"అంత ఆశ్చర్యపోతావేమిటత్తయ్యా! మీ ఇంటికి నేను రాకూడదా?"

సుభద్ర కొంత తేరుకుంది.

"అహా! అదికాదు—ఏం లేదు—అకస్మాత్తుగా వచ్చేసరికి కొంచెం ఆశ్చర్యం కలిగింది. రా! రా! కాళ్ళు కడుక్కో! స్నానం చేశావా?" సంభ్రమంగా లోపలి కెళ్ళింది సుభద్ర ఆతిథ్యపు టేర్పాట్లు చూడటానికి.

ఆశ్చర్యంగా సుదర్శనాన్ని చూస్తూ నిలబడిపోయింది సరళ.

ఆ రెండు కుటుంబాలకూ మధ్య తెగతెంపు లయిపోయాయని నిర్ణ

**కొత్త సీరియల్**

యించుకుని ఇంకా ఒక్క సంవత్సరం నిండలేదు

సాధారణంగా మధ్యతరగతి కుటుంబాలన్నింటిలోలాగే సుభద్రా శ్రీనివాసరావులు కూడా తమ కూతురు సరళను మేనరికపు సంబంధం సుదర్శనానికిచ్చి చెయ్యాలని ఆశపడ్డారు.

ఫారిన్‌లో కెమిస్ట్రీలో డాక్టరేట్ డిగ్రీ తీసుకున్న కెమిస్ట్ సుదర్శనం—ఆస్తికూడా చెప్పుకోదగినంత ఉంది. రూపమూ ఉంది. ఎవరాశపడరు? కానీ, సుభద్రా—శ్రీనివాసరావుల ఆశలు ఫలించలేదు. సుదర్శనం తల్లి భవాని తన కొడుక్కి కట్నంగా పదివేలు కావాలని తేల్చి చెప్పేసింది. ఆ సందర్భంలో కొంత మాటామాటా పెరిగి నువ్వెంతంటే; నువ్వెంత అనుకునే వరకూ వచ్చింది. మనసు కష్టపెట్టుకొని ఆ సంబంధంమీద ఆశ వదిలేసుకున్నాడు శ్రీనివాసరావు.

సరళ మాత్రం తేలిగ్గా నిట్టూర్చింది. సుదర్శనం బాగుంటాడు! నిజమే! కానీ, అతడెప్పుడూ ఆమెకు అందమైన బొమ్మలా కనిపించేవాడు. అతని సమక్షంలో తానొక స్త్రీననే భావం కూడా కలిగేది కాదామెకు. కాని, రావు సమక్షంలో తనకు సెకనుల్లా దొర్లిపోతాయి గంటలు. గంభీరంగా ఉన్న రావు కంఠస్వరం తన నెప్పుడూ వెన్నంటే ఉన్నట్టనిపించేది. ఏదో అపూర్వ విజ్ఞానంతో మెరిసిపోతున్న కళ్ళతో, చైతన్యంతో విచ్చుకున్న చిరునవ్వుతో రావు మూర్తీభవించిన సరళ మనసు సుదర్శనం తిరస్కారానికి బాధను కంటె హాయినే పొందగలిగింది. ఒక సమస్యను బావే పరిష్కరించి పెట్టాడనుకొని తృప్తి పడింది.

కానీ, ఇప్పుడకస్మాత్తుగా వచ్చాడు సుదర్శనం.

ఎందుకో?

సరళ ప్రశ్నకు ఆ సాయంత్రమే సమాధానం లభించింది.

బాల్కనీలో తీరుబడిగా గార్డెన్ చైర్స్‌లో కూర్చున్నప్పుడు సంభాషణ ప్రారంభించాడు సుదర్శనం.

"నీ రచనలు చదువుతున్నాను సరళా! చాలా బాగుంటున్నాయి. ముఖ్యంగా నిన్నభినందించటానికే వచ్చాను."

సరళ మనసు పొంగిపోయింది. రచయిత్రికి తన రచనలు బాగున్నాయని వినటంకంటె సంతోషం కలిగించేది మరొకటుండదు.

"అమ్మ తరఫున నిన్ను క్షమాపణ వేడుకుంటున్నాను. నీ కభ్యంతరం లేకపోతే నిన్ను నా దాన్ని చేసుకుంటాను. నీలాటి రచయిత్రి నా భార్య కావటం నాకు గర్వకారణం" అన్నాడు సుదర్శనం.

సరళ మనసు పనిచెయ్యడం ఆగిపోయింది. సుదర్శనంలాంటి వ్యక్తి తన రచనలను పొగడుతూ తను



రచయిత్రి అయిన కారణంగానే, తనదాన్నిగా చేసుకోవాలనుకుంటున్నాడు.

రావు తన మనసులో రేపిన గాయానికిది అమృతపు సేచనంలా అనిపించింది. దెబ్బతిన్న అహానికి ప్రాణం వచ్చింది.

తన రచనలు అతి సాధారణంగా అనిపించాయి రావుకి ఒక్కడ సుదర్శనం — పెద్ద ఆఫీసరు—తన రచనల్ని పొగుడుతూ తన పాణికోసం ప్రాధేయ పడుతున్నాడు.

“నాకొంచెం టైమియ్యి బావా! ఆలోచించి చెపుతాను—”

సుదర్శనం వెంటనే ఒప్పేసుకున్నాడు. సరళ తనను కాదనగలదని అతనికే కోశానా అనుమానం లేదు.

మరునాడే రావును కలుసుకుంది సరళ, ఎప్పుడూ కలుసుకునే లైబ్రరీ లోనే.

సరళ వడిలిపోయిన ముఖం చూస్తూ తనలో తాను నవ్వుకున్నాడు రావ్.

"సారీ సరళా! నిన్ను నొప్పించాలని అలా అనలేదు. నీ లోపాలు నీకు తెలియకపోతే ఎలా? నువ్వింకా మంచి రచయిత్రివి కావాలనే నా ఆశ!"

ఈ మాటలకు సరళ మనసు కుదుటపడలేదు. మరింత గాయపడింది.

అంటే, తన రచనలో లోపాలున్నాయన్నమాట! తను మంచి రచయిత్రి కాదన్నమాట!

"నీ లాంటి ప్రతిభాశాలికి నా బోటి చిన్న రచయిత్రుల రచనలెలా అర్థమౌతాయిలే!" వ్యంగ్యంగా అంది సరళ.

సరళ వ్యంగ్య ధోరణి రావుకు అర్థమయింది. సరళలో ఈ భాగం రావుకు నచ్చలేదు. తన రచనలో లోపాలున్నాయంటే సరళ ఎందుకర్థం చేసుకోదు? ఆ లోపాలేవిటో అర్థం చేసుకొని సరిదిద్దుకోడానికి బదులు ఇలా కప్పి పెట్టుకుంటుం దేవిటి? ఈ సంకుచితత్వం పోవాలి సరళలోంచి —

"సరళా! నీలో 'కళ' ఉంది. ఒక విషయం ఎత్తుకున్నాక దాన్ని చక్కగా పోషించగలుగుతున్నావు. కానీ, అసలు ప్లాట్‌లో పాత్ర పోషణలో కొన్ని వీక్ పాయింట్లు వున్నాయి. నువ్వు తీసుకున్న వాతావరణం చాలా కొద్దిమందికి మాత్రమే పరిచితమైనదైతే సార్వజనీనత సాధించటం కొంత కష్టమౌతుంది. న్యాయానికి ప్లాట్‌లో ఏం లేదు. ట్రీట్‌మెంట్‌లోనే రచన కందం వస్తుంది. నువ్వు తీసుకున్న వాతావరణం నీ రచనకు ఫ్రేం లాంటిది. దాన్ని సాధ్యమైనంత సాధారణంగా తీసుకోవటం మంచిది. ఇక పాత్ర పోషణ విషయం. ఒక్క సంగతి వివరిస్తాను విను—"

సరళలో అసహనం రెచ్చిపోయింది. తనలాంటి ప్రఖ్యాత రచయిత్రిని కూర్చోబెట్టి హైస్కూల్ విద్యార్థినికి లాగా పాఠాలు చెబుతా డేవిటి? "ప్లీజ్ నాకు తలనొప్పిగా వుంది, ఇంకేదైనా మాట్లాడు."

"సారీ! సరళా! సాహిత్యం రచనలు ఇట్లాంటి విషయాలమీద మాట్లాడమంటే మాట్లాడ గలను. కానీ, వేరే మాటలు రావు నాకు. ఆ మాటకొస్తే మన పరిచయం పునాదే అది కదా!"

అవును. ఆ నాడు శ్రీశ్రీ సన్మాన సభలో శ్రీశ్రీ గురించీ, నవ్య కవిత్వాన్ని గురించీ రావు మాట్లాడుతూంటే వింది. అతని విజ్ఞానానికి ముగ్ధురాలయింది. ఆనాటి నుండీ అతనితో పరిచయం

చేసుకోవాలని తహతహలాడుతూనే ఉంది. తర్వాత యాదృచ్ఛికంగా అతను పనిచేస్తున్న ఆఫీసులోనే తను క్లర్క్‌గా చేరటం జరిగింది. రావు పరిచయభాగ్యం కోసం కొట్టుకు పోతున్న తన మనసు అతని సహృదయత ఆలంబనగా అతి తేలికగా అతన్ని అల్లుకుంది.

నన్నయ మొదలుకొని నేటి కథా రచన వరకూ అన్ని విషయాలు మాట్లాడేవాడు రావు. వాగ స్వరం వింటున్న నాగకన్యలా తనను తను మరచి వినేది

అతని మాటలు కొన్ని వినటానికి వింతగా వున్నా, నిజాలనిపించేది.

"గొప్ప కావ్యాలన్నీ అలంకార శాస్త్రాలు రాకముందే వచ్చాయి"

"అలంకార శాస్త్రాలొచ్చాక అసలు మంచి కావ్యాలు రాలేదు."

"సాహిత్యాన్ని కొన్ని గిరులలో బంధించేశారు మనవాళ్ళు – అలా బంధించినప్పుడు సాహిత్య వికాసానికి అవకాశంలేదు."

"బాల వ్యాకరణం తెలుగు వ్యాకరణంకాదు. అసలు తెలుగుకు "తెలుగు వ్యాకరణం ఇంతవరకూ రాలేదు."

ఈ సిద్ధాంతాలు విని మొదట్లో హడలిపోయేది తను. కానీ, తన మాటల నతడు సహేతుకంగా నిరూపిస్తూంటే బొమ్మలా కూర్చుండి పోయేది. అతని 'ఒరిజినాలిటీ'కి నిర్ఘాంత పోయేది.



ఒకనాటి సాయంత్రం సులోచన్రావుకి తనపెళ్ళాం ఫొటో చూపిస్తే, ఇంత అనాకారిని ఎలాచేసుకొన్నానా అని సందేహం పుట్టి, ఆవిడనే అడిగేశాడు. మొదటు మండి పడ్డా తర్వాత జవాబు వచ్చింది! పెళ్ళిచూపులికి వచ్చినపుడు సులోచన్రావు కళ్ళజోడు పెట్టుకురాలేదనీ ...

---

రావు తెలివి గలవాడు.

ప్రతివాన్ని విమర్శనాత్మకంగా ఆలోచించగలడు.

ఆ విమర్శ సహేతుకంగా, విజ్ఞానాత్మకంగా ఉంటుంది.

ఇదంతా నిజమే!

కానీ, అంత మాత్రాన తన నింత దారుణంగా అవమానిస్తే ఎలా? తన

రచన అతి సాధారణంగా ఉందని, దానిలో అన్నీ లోపాలేనని అంటుంటే ఎలా సహించగలదు? ఒక వైపున ఇందరు పొగుడుతున్నప్పుడు—

పెదిమలు పళ్ళతో నొక్కిపట్టి కొంతసేపాగి "అయితే మన మధ్య మాటలు లేనట్లేనా?" అంది ఈ మట లంటూంటే మనసు వణికింది రావు సరళ వంక విచిత్రంగా చూశాడు

"నా మాటలు నీవు సహించ లేక పోతే, నేం... చెయ్యగలను? నీ ఇష్టప్రకారం మాటలే ఆపేస్తాను"

"నేను వేరు నాలోని రచయిత్రి వేరు కాదు రచయిత్రిగా నీకు నా మీద గౌరవం లేనప్పుడు"

రావు సూటిగా సరళ ముఖం వంక చూశాడు

"క్షమించు, రచయిత్రిగా నీమీద నాకు పెద్ద గౌరవం లేదు ఆ రంగంలో నువ్వింకా ప్రాథమిక దశలోనే ఉన్నావని నా ఉద్దేశం ఆ దశ దాటడానికి ప్రయత్నించక పోగా, ప్రవాహంలోపడి కొట్టుకు పోతున్నావు"

సరళ అగాం తీవ్రగా గాయపడింది రివ్వున లేచింది

"గుడ్ బై"

"గుడ్ బై"

ఇంటికిరాగానే ఎందుకో తెలియకుండా ఏడుపొచ్చేసింది రావు మీద ఏదో కసి లాంటిది బయలుదేరింది ఎలా తీర్చుకోవాలి ఈ రకమైన కసి?

"సరళా!"

సుదర్శనం చనువుగా లోపలికి వచ్చాడు

ఏం సరళా! ఇంకా ఆలోచించుకోలేదా? నేను రేపు వెళ్ళి పోతున్నాను, చెప్పు నీలాటి ప్రఖ్యాత రచయిత్రికి భర్త కాగలిగే అదృష్టాన్ని కలిగించవూ?"

సరళ బలహీనత ఎక్కడో అక్కడ స్పృశి చాడు సుదర్శనం తన అందాన్ని పొగిడినా ఇంతగా కరిగిపోయేది కాదు

'రచయిత్రిగా నేనంటే మీకు చాలా గౌరవమా బావా!"

"మెల్లిగా అంటున్నావా? నా స్నేహితులందరూ 'సరళగారి రచనలు బాగుంటా'యంటే నా 'మరదలని ఎంత గొప్పగా చెప్పుకుంటానో తెలుసా? అందుకే నీ దగ్గిరకొచ్చింది నీకన్ని విధాలా ప్రోత్సాహమిస్తాను రచనే నీ జీవిత ధ్యేయంగా రచనలు సాగించు నాకు అదే కావాలి నీ సం ఒక గది ప్రత్యేకంగా యిస్తాను వంట కూ దానికీ ఒకవితంతు బంధువురాలినిపిలిపిస్తాను ఏంసరళా, అవుననవూ! సరళ శ్రీమతి సరళా

సుదర్శనం కావాలి సరళా సుదర్శనం ప్రఖ్యాత రచయిత్రి కావాలి ఆ విఖ్యాతిలో నేనూ భాగం పంచుకోవాలి చెప్పు సరళా!"

సరళ పులకించిపోయింది సుదర్శనం ఆమె కళ్ళముందుంచిన స్వర్గం ఆమెను మైమరపించింది తన రచనలకే ఆటంకమూ ఉండదు అన్నివిధాలా ప్రోత్సాహం లభిస్తుంది ఒక రచయిత్రిగా తన నారాధించే వ్యక్తి తనకు భర్త కాబోతున్నాడు

"నువ్వు నన్ను స్వీకరిస్తే అదృష్టవంతురాలిని బావా!" తల వంచుకుని అంది

"గుడ్!" సంతోషంతో అరిచి సరళను రెండు చేతుల్తోను ఎత్తి గిరగిరా తిప్పి క్రిందకు దింపి నవ్వుతూ వెళ్ళిపోయాడు సుదర్శనం

లోకమంతా గిర్రున తిరిగి నట్లయింది సరళకు

త్వరలోనే సరళా సుదర్శనాలకు వివాహం నిశ్చయమయిపోయింది

శుభలేఖ రావుకు పోస్ట్ చేస్తూ ఒక ఉత్తరం కూడా వ్రాసింది సరళ

"రావ్!

మా సుదర్శనం బావను గురించి నీకు చెప్పాననుకుంటాను ఫారిన్ కూడా వెళ్ళివచ్చాడు ప్రస్తుతం ఆఫీసర్ హోదాలో ఉన్నాడు ఒక రచయిత్రిగా నన్నారాధించి నన్ను చేసుకుంటున్నాడు బ్రతికినంత కాలమూ రచయిత్రిగానే బ్రతకాలనీ, అందరిచేత రచయిత్రిగానే చూడబడాలనీ నా కోరిక

— సరళ —"

సరళ పెళ్ళికి రావు కూడా వచ్చాడు ఒక అందమైన ఫైలూ, మంచి ఫౌంటెన్ పెన్నూ స్వయంగా సరళకి ప్రెజంట్ చేశాడు

రావు కళ్ళలో నుబ్బులున్నాయో లేవో, అతని చిరునవ్వు వెనకాల విషాద రేఖలు తొంగిచూస్తున్నాయో లేదో సరళకు తెలీదు

ఆమె వంచిన తలెత్తలేదు

తన కళ్ళు మరొకరి కంట పడటం సరళ సహించలేదు

"శ్రీమతి సరళా సుదర్శన్! మీ ఆశయం నెరవేరాలని మనసారా కోరుతూ ఇవి ప్రెజంట్ చేస్తున్నాను"

వణికే చేతులతో అందుకుంది సరళ

"శ్రీమతి సరళా సుదర్శన్"
సరళ చెవుల్లో తిరిగి తిరిగి ప్రతిధ్వనిస్తోంది తనిప్పుడు సరళ కాదు—సరళ మారిపోయింది సరళా సుదర్శన్‌గా మారిపోయింది ఈ విషయం ఇంతవరకూ తన మనసుకి తట్టలేదు. రావునోట వినేవరకూ తట్టలేదు "శ్రీమతి సరళా సుదర్శన్" అన్న పిలుపు పెద్ద వెక్కిరింతలా వినిపిస్తుందేమిటికి

సుదర్శనాన్ని విష్ చేసి రావు వెళ్ళిపోయాడు. సరళ తనతో మాట్లాడగలిగే స్థితిలో లేదని రావుకు తెలుసు—

## 2

జడనిండా పువ్వులతో ఏవేవో అత్తరు వాసనలతో భర గదిలోకి ప్రప్రథమంగా అడుగు పెట్టింది సరళ. ఇదమిత్థమనరాని ఏవేవో భావాలతో మనసు ఊగిపోతోంది, ఆ బరువు మోయలేకపోతోంది. భావాల బరువు దించుకునే మార్గం ఒక్కటే! అది రచన!

చిరునవ్వుతో సరళను సమీపించాడు సుదర్శనం.

"ఏమిటలా ఆలోచిస్తున్నావ్?" అన్నాడు.

"నా మనసు ఏదో ఉద్వేగంతో కొట్టుకు పోతోంది. కథ వ్రాయాలనుంది."

తన మాటలు తనకే ఎంతో అసంబద్ధంగా వినిపించాయి సరళకు. తొలి రాత్రి నూతన వధువు మాట్లాడవలసిన మాటలేనా అవి?

అతడు చిన్నబుచ్చుకుంటూ దనుకుంది.



"కథలు తరువాత..." అంటూ తనను ఊపిరాడనీయ దనుకుంది.

కానీ,

అతడు గదిలోంచి బయటికి వెళ్ళి పోయాడు.

కోప మొచ్చిందేమోనని భయ పడింది. అంతలోనే కాగితాలూ, పెన్నూ తీసుకుని లోపలి కొచ్చాడు సుదర్శనం.

నివ్వెరపోయింది సరళ.

"మూడ్ వచ్చినప్పుడు వెంటనే వ్రాసెయ్యాలి. కథ వ్రాసుకో!" అంటూ కాగితాలూ పెన్నూ సరళ చేతికిచ్చి పక్క మీద వాలి పోయాడు.

కొంచెం సేపట్లోనే అతని గాఢనిద్రను సూచిస్తూ క్రమబద్ధమైన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వినవచ్చాయి.

ఎందుకో గుండె కలుక్కుమంది సరళకు.

తలలో జాజులు, చీర జరీఅంచ, అగరువత్తుల సువాసనలు, ఇవన్నీ సరళ మనసు నొక్కసారిగా మెలి పెట్టేశాయి.

అంత ఘర్షణ సహించలేక పోయింది.

చటుక్కున కాగితం, కలం అందుకుంది.

నవ దంపతుల తొలి రాత్రి ప్రణయాన్ని అత్యంత మధురంగా చిత్రించిన కథానిక తయారయింది.

ఆ కాగితాల వంక తృప్తిగా చూసుకుని ఆ బల్లమీదే తల వాల్చి నిద్రపోయింది.



సుబ్బారావుకి అందరిలాగానే చిన్నప్పటినించీ జడ్జి అవుదామని ఆశవుంది. బి.ఎల్., ప్యాసయ్యాడు. చివరికి చాలా కాలానికి అతని ఆశ ఫలించింది. నాటక పోటీల్లో జడ్జీ అయ్యాడు.

ఆ మరునాడు సరళ వ్రాసిన కథ చదివి పొంగిపోయాడు సుదర్శనం.

"చాలా చక్కగా వ్రాశావు సరళా! నిన్ను చూసుకొని గర్విస్తున్నాను" అన్నాడు అప్పటికప్పుడు ఆ కథని పోస్ట్ చేయించాడు.

ప్రేమతో సరళని దగ్గరకు తీసుకున్నాడు. సరళ మనసంతా ఏదో అసంతృప్తితో నిండిపోయింది. కారణం — సుదర్శనం మాట్లాడే ప్రతి మాటా, ప్రతి చేష్టా, తను వర్ణించినట్లే ఉంది. అచ్చంగా — ఒక ఆట బొమ్మకు కీ ఇచ్చి ఆడించుతున్నట్లనిపించింది. తనకు కనిపిస్తున్నది తన నీడ—వేరొక వ్యక్తికాదు అతని చేష్టలన్నీ తన చైతన్య స్రవంతిలోని కెరటాలు — తన చైతన్యాన్నెదుర్కొనే మరొక శక్తి కాదు.

సుదర్శనం తను మొదట్లో సరళకిచ్చిన వాగ్దానాన్ని అక్షరాలా పాటించాడు. సరళకు వేరే గది—వ్రాసుకోవటానికి కావలసిన హంగులు అన్నీ అమర్చాడు. ఇంటి పనులలోగాని, ఇంటి బాధ్యతలోగాని సరళకు ప్రమేయం లేకుండా చేశాడు.

సరళ పొంగిపోయింది. ఇలాంటి భర్తను ప్రసాదించినందుకు భగవంతుడికి నమస్కరించింది

ఆ ఇంట్లోవున్న వితంతు బంధువురాలు కృష్ణవేణి సరళను రాణీలా చూసింది.

"ఆ కథలు వ్రాసింది మీరేనా?" అంటూ ఏదో దేవతాదర్శనం చేసుకుంటున్నట్లుతనను చూచే కృష్ణవేణిని చూసి గర్వంతో పొంగిపోయింది సరళ మనసు.

ఆ సాయంత్రం సుదర్శన్ నీట్‌గా తయారయి బయటికి బయల్దేరాడు.

సరళ అతనివంక చూస్తూ "నేనూ వస్తాను" అంది.

ఏదో అపూర్వ విషయం విన్నట్లు ఆశ్చర్యపోయాడు సుదర్శన్ —

"నాతో వస్తావా? కథ వ్రాసుకోవూ?"

ఆశ్చర్యం నిండిన అతని ముఖం లోకి చూస్తూ "ఇప్పుడు వ్రాయలేను" అనలేకపోయింది "ఈ సాయంసమయంలో ఇంట్లో కూర్చుని కథ వ్రాసుకోవటం కంటె మీతో కలిసి బయటకు రావటమే యిష్టమని అనలేకపోయింది.

"వ్రాసుకుంటానులెండి, కాస్సేపు తిరిగొచ్చాక వ్రాసుకోవచ్చు —" అంది అణచుకోలేక

"నో! నో! నీ టైమ్ వేస్ట్ చేసుకోవద్దు. నాతో షికారుకొచ్చే సమయంలో నువ్వో మంచి కథ వ్రాయగలవు. నాకు తెలుసు. నేనేమైనా అనుకుంటానని నువ్వు నాతో వస్తానంటున్నావు. కానీ. నేనేమీ అనుకోను అలాంటి సంకుచిత హృదయుణ్ణి కాదు — చాలా కొద్దిమందిలో

మాత్రం ఉండే ఆర్ట్ నీలో ఉంది. నువ్వది వృద్ధిచేసుకోవటమే నా ఆశయం–"

వెళ్ళిపోయాడు సుదర్శనం.

బొమ్మలా చూస్తూ నిలబడిపోయింది సరళ –

తనకు రచయితకంటె అతనితో షికారు వెళ్ళటమే ఇష్టమని అనలేకపోయింది. అలా అనగలిగే హక్కు తనే వదులుకొంది స్వయంగా –

కొన్ని కొన్ని పదాలు విచిత్రమైనవి. అవి ఎదుటి వాళ్ళని తమాషాగా కట్టేస్తాయి.

"మంచివాడు", "ధర్మపరుడు", "దానశీలి" ఇట్లాంటివి

అవతలివాడు "ఈయన చాలా మంచివాడు" అంటుంటే చచ్చినట్లు మంచితనంనిలబెట్టుకోవాలి. "కాదు, నేను చెడ్డవాణ్ణి" అనలేరు సామాన్యంగా – 'రచయిత్రి' పదం కూడా ఈ జాబితాలో చేర్చాల్సిందే! "నీకు కాలం అమూల్యం. రచనే నీకన్నింటికంటె ముఖ్యం". అంటూంటే "కాదు – రచనొక్కటే కాదు–ఇంకా నాకు చాలా కావాలి. రచనకంటె కూడా అవే ముఖ్యం" అనలిగే నోరు మూగపోతుంది.

ఉసూరుమంటూ కూర్చుని కలం పట్టుకుంది.

ఏంటో శూన్యంగా అనిపించ సాగింది.



కృష్ణారావుకి 40 ఏళ్ళు పైబడ్డా అమ్మాయిలకేసి చూడ్డం అలవాటుంది. అది ఓనాడు వాళ్ళావిడ కంట పడటం జరిగింది. వెంటనే "మీరు అమ్మాయిల్ని చూడగానే మీకు పెళ్ళయిందన్న సంగతి మర్చిపోతారు కావాల్ను" అంది. "లేదే బాబూ. అప్పుడే నువ్వు జ్ఞాపకం వచ్చే సమయం నాకూ" అని విలవిలా మొత్తుకున్నాడు కృష్ణారావు.

---

కలం సాగటంలేదు.

హాయిగా అతనితో షికారుకి వెడితే, ఏం జరిగేది?

మనసు చలించటం ప్రారంభించింది. కలం చక చక పరుగు పెట్టింది.

బజారునుంచి లేత వంకాయలు తీసుకొచ్చాడు సుదర్శనం. మువ్వం కాయ కూర వండడం సరళకు బాగా చాతనవును. తన పాక కళా ప్రావీణ్యాన్ని సుదర్శనానికి చూపించాలని ముచ్చటపడింది సరళ.

"ఈవాళ వంకాయలు నేను కూర చేస్తాను" అంది, వంకాయలు తనకు లాక్కుంటూ.

"వాట్! నువ్వు కూరవండుతావా? కూరవండడం పెద్దకష్టమా? ఎవరైనా చెయ్యగలరు. నువ్వు మాత్రమే చెయ్యగలిగింది రచన. నీ సమయాన్నంతా ఇలా వృధా చేసుకోకు. కూర కృష్ణ చేస్తుందిలే!"

"అస్తమానూ ఏం రాస్తాను? ఒక అరగంటలో కూరయిపోతుంది."

"అదేమిటీ? నువ్వు వ్రాయలేవా?"

తెల్లబోతూ అడిగాడు సుదర్శనం.

సరళకేదో గొంతుకడ్డం పడినట్లయింది.

"వ్రాయలేనని కాదు. కానీ, మీకు నా చేతులతో కూర —"

సుదర్శనం బిగ్గరగా నవ్వాడు.

"ఓస్! ఇంతేనా? నాకు నీ చేతులతో వండిన కూరకంటె నీ చేతులతో వ్రాసిన రచన బాగుంటుంది. అది అపూర్వం — కూరదేముందీ? వెళ్ళి వ్రాసుకో! అనవసరంగా టైమ్ వేస్టు చేసుకోకు."

వచ్చినట్లు సరళ వంటింట్లోంచి తన గదిలోకొచ్చేసింది. ఎందుకో బావురుమని ఏడవాలనిపించింది. ఇదెక్కడి విచిత్రమైన అవస్థ?

ఇంతకంటె తనను రాసుకోనియ్యకుండా పనులు చెప్తూ, అల్లరి చేస్తూ ఉంటే ఎంత బాగుండును? అవును. అప్పుడు చాలా చక్కగా ఉంటుంది. తను రాసుకోవాలని తహతహలాడుతూ ఉంటుంది. కానీ, అతను తనతో షికారులకూ రమ్మనీ సినిమాలకు రమ్మనీ పోరు పెడుతూ ఉంటాడు. తను రానంటుంది అతను బలవంతపెట్టి బ్రతిమాలి తీసుకుపోతుంటాడు — ఒక్క క్షణం ఊపిరి సలపకుండా ఇంటిపనులు — ఎంత బాగుంటుంది — అలా ఉంటే—?

కలం తీసుకుని గబగబ వ్రాయటం మొదలు పెట్టింది. తన కెలా ఉంటే బాగుంటుందో అలాంటి సన్నివేశాలన్నీ అందంగా ఆకారాన్ని పొందుతున్నాయి. మనసులోని ఉద్వేగంతో పాత్రలు జీవాన్ని పోసుకుంటున్నాయి. శైలిలోని ధారతో పరుగులు పెడుతోంది కథ. తనను తను మరిచిపోయి వ్రాస్తోంది సరళ.

[సశేషం]

# పొట్టి కథలు

## కారణం

గుమాస్తా ఫైల్స్ కట్టతెచ్చి మేనేజరు బల్లమీద పెట్టి - వెళ్ళబోయి ఠపీమని ఆగిపోయాడు.

"నువ్వెళ్ళచ్చు" అన్నాడు మేనేజరు తలఎత్తకుండా.

గుమాస్తా "చిత్తం" అన్నాడు కాని కదలేదు. నసుగుతూ భయపడుతూ మర్యాదిగా నిలబడ్డాడు. మేనేజరు రాస్తున్న కాగితం ఆపుచేసి తలెత్తి విసుగ్గా చూశాడు. గుమాస్తా తల వంచుకుని చేతులు నలుపుకుంటున్నాడు.

"ఏం కావాలోయ్?" అడిగాడు మేనేజర్. గుమాస్తా మాట్లాడలేదు.

"ప్రమోషనా?" అని అడిగాడు రహస్యంగా. కాదన్నాడు గుమాస్తా.

"ఇంక్రిమెంటా?"

"కాదండీ"

అర్థమైపోయినట్టు మేనేజరు గలగలా నవ్వి "అరిసీ ఇల్లు దొంగ బంగారంగానూ అప్పేనా? ఎంత? మళ్ళీ ఎప్పుడిస్తావ్?" అదికూడా కాదన్నాడు గుమాస్తా.

"అయితే లీవే అయ్యుండాలి. ఎన్నిరోజులేమిటి?"

గుమాస్తా ఏడుపు మొహం పెట్టాడు. ఇబ్బందిగా చూశాడు. కళ్ళనుంచి రెండో మూడో నీటి బొట్లు కూడా పడ్డాయి. "నన్ను తమరు అపార్థం చేసుకుంటున్నారు. లీవు కాదు" అన్నాడు. మేనేజర్‌కి అసలైన కోపం నిజంగా వచ్చింది. గభాల్న సీటులోంచి లేచి "ఏమిటి నీ ఉద్దేశం?" అని అరిచాడు.

"అమ్మయ్య ఇందాకటినించి నా పంచెకొస తమ బూట్లక్రింద చిక్కడిపోయింది" అంటూ గుమాస్తా చకచకా చక్కాపోయాడు.

—సోమిన శివరామ ప్రసాద్,
రాజమండ్రి

* * *

## పరిశీలనాశక్తి

ఒక స్కూలు ఇన్‌స్పెక్టర్ స్కూలు తనిఖీ చెయ్యడానికి వచ్చాడు. ఆయన మొదట వెళ్ళిన ఒక తరగతిని ఒక అందమైన అమ్మాయి నడుపుతోంది. ఆ ఇన్‌స్పెక్టర్ ఆ లేడీ టీచరును "ఈ

క్లాసు పిల్లల పరిశీలనాశక్తిని పరీక్షించ దలుచుకున్నాను అన్నాడు

ఆమె "సరే" నన్నది

ఇన్ అయితే ఏదీ మీరంతా కళ్లు మూసుకు నిశ్చలంగా కూర్చోండి !"

ఆ పిల్లలంతా అలాగే చేశారు ఇంతలో ఆ ఇన్‌స్పెక్టర్ లొట్ట వేయడం వంటి శబ్దం చేసి ఇప్పుడు నేనేం చేశాను ? అని అడిగాడు

ఒక చిన్నపిల్లవాడులేచి మీరు ముద్దు పెట్టుకున్నారు సార్ ! అన్నాడు

—వశిష్ఠ,
హైదరాబాద్

* * *

## రచయితలకు మనవి

కాగితానికి ఒకవైపు మాత్రమే సిరాతో విడి విడిగా తెలిసేటట్లు రాసిన కథలే పరిశీలించబడతాయి సాధ్యమైనంత వరకూ ప్రింటింగ్ లో పది పేజీలకు మించకుండా వచ్చే కథలకు ప్రాధాన్యత వుంటుంది

మేనేజరు
జ్యోతి

## ఎవరి కష్టం వారిది

కొడుకు తండ్రితో ఓ ఐదుంటే యిలా పడేయ్ నాన్నా ! ఫ్రెండ్సుతో సినిమాకి పోవాలి "

తండ్రి "పోరా వెధవా! డబ్బు సంపాదించడంలో వున్న కష్టం, ఖర్చుపెట్టే వాళ్ళకేం తెలుస్తుందీ ?"

(మర్నాడు)

తండ్రి (ప్రోగ్రెస్ కార్డు చూస్తూ), ఏరా! మార్కులిలా తగలడ్డాయెం?"

కొడుకు హుఁ! మార్కులు సంపాదించడంలో వున్న కష్టం చూసేవాళ్ళకేం తెలుస్తుందీ ?

—ఎమ్ సహాబ్‌దాసురాజు,
వాత్తేరు

* * *

## తప్పిపోయిన నష్టం

రాము - ఒరేయ్ సోమూ, నిన్న మాపక్కింటి లావుపాటాయన సైకిల్ మీదనుంచి క్రింద పడ్డాడురా !

సోము - ఇంకా నయం సైకిల్ మీదనే పడివుంటే ఒక వంద రూపాయలు నష్టపడి వుండేవాడు

—పల్లపాటి పాపారావు,
ఎన్, రామకృష్ణ,
విజయవాడ

* * *

## నెలకు తగిన తప్పు

**అడిగిన** ఏ ప్రశ్నకి ఎవరూ సమాధానం చెప్పడంలేదని కుర్రాళ్ళ మీద మేష్టారికి చాలా కోపం వచ్చింది. ఒక్కొక్కణ్ణీ పిల్చి ప్రశ్నించారు.

"ఏరా రామూ! పాఠం ఎందుకు చదవలేదు?"

"నిన్నంతా గోళీకాయ లాడుకున్నానండీ!"

"పో! వెధవా! నిన్ను రెండు రోజులు సస్పెండ్ చేస్తున్నా"

"ఏరా సత్యం! నీ కేమయింది? ఎందుకు చదవలేదు?"

"నిన్నరాత్రి సినిమాకి వెళ్లానండి!"

"ఛడవా నిన్ను వారం రోజులు సస్పెండ్ చేస్తున్నా! అరే సోమూ! అదేమిటి? ఎక్కడికి వెళ్ళిపోతున్నావు?"

"వెళ్ళొస్తాను సార్! మళ్ళీ నెల్లాళ్ళ తర్వాత కన్పిస్తాను."

—గుడిపాటి లక్ష్మీనరసింహం.

***



# సివిల్ ఇంజనీర్ ప్రేమ గీతం

భామా ! నిను చూసిన మరుక్షణమే
ప్రేమ భవనానికి ఫౌండేషన్
హృదయంలో వేసుకొన్నాను
హార్బరు చేరే షిప్పులాగ
నా చెంత చేరవే చెలీ !
మనిద్దరి మనసుల మధ్య
మమతల వంతెన కట్టుకొందాము
మన హృదయాల మధ్య ప్రేమ 'ఫ్లో'
ఎన్నటికీ కాకూడదు 'డిశ్చార్జి'
కాంక్రీటు స్ట్రక్చరులా మన హృదయానుబంధం
స్థిరంగా చిరకాలం నిలచిపోవాలి
భోగ భాగ్యాలనే రైలు పట్టాలపై
మన బ్రతుకు బండి నడిచిపోవాలి
స్వర్గసుఖానికి రోడ్లను వేసుకొందాము
మన సంతానపు ఎస్టిమేట్స్
మన ఆదాయపు ఎకనామిక్స్
ఏనాడు దాటకూడదు అగ్రిగేట్
గోడమీద సున్నంలా నా హృదయంలో
నీ రూపాన్ని ముద్రించుకొన్నాను
నీ కోసం ఎదురు చూస్తున్నాను.

— విజయసాంబ

జ్యోతి

# పెట్టె గుండె

తెరచిన పెట్టె ఖాళీగా భయంకరంగా కనిపిస్తోంది, నలుక జాపిన కాళికలా! బీరువాలో నుంచి లాగిన చీరలు ప్రక్కన కుప్పగా పడి ఉన్నాయి. అవి తీసి పెట్టెలో పడ వెయ్యటానికి తోచటంలేదు. నిర్జీవంగా ఒదిగి కూర్చున్నాను. నా మనస్సులాగే ఆ గదీ చికాకుగా ఉంది. ప్రతి వస్తువు ప్రయాణానికి సిద్ధంగా ఉంది. ఏదో శూన్యంగా పాడుపడినట్లుంది.

ఇక్కడికివచ్చి ఆరు నెలలే అయింది. ఇంతలోనే ఈ గది నాకెంతో ప్రియమైంది. ఇది నా సుఖ దుఃఖాలను పంచుకుంది. ఈ నాటితో మా బాంధవ్యం తెగింది. మళ్ళా ఈ జన్మలో ఇక్కడకు రానేమో!

అక్కకు చిన్నతనంలోనే పెళ్ళయింది. అది నాకు పెత్తల్లి కూతురు. దానికి మంచి సంబంధం వచ్చింది, బావకు చాల ఆస్తి ఉంది పెద్ద వకీలుగా పేరు సంపాదించుకున్నాడు. నిదానం, మంచితనం నిండిన స్వభావం. అయినా అక్కయ్య అదృష్టవంతురాలు కాదు. ఆమె సంతోషంగా ఒక్క ఏడాదయినా కాపరం చేయలేదు. పక్షవాతం వచ్చింది. ఒకవేపు కాలు చెయ్యి స్వాధీనం లేదు. నోటమాట లేదు. పసిపిల్లలా కాపాడవలసిన పరిస్థితి ఏర్పడింది. బావ ఆమెను ఊరూరు తిప్పాడు, వైద్యం కోసం. కాని ఆశ ఫలించలేదు.

అయినా అతను మంచివాడు. నౌకర్ల సహాయంతో ఆమెకు ఏ

ఆచంట శారదాదేవి

లోపం లేకుండా చూస్తున్నాడు. ఎలాగో కాలం గడుపుతున్నాడు. ఎప్పుడూ తన కోర్టు పనిలోనే లీనమయి ఉంటాడు. ఉదయం లేవగానే కోర్టు కాగితాలు ముందర వేసుకు కూర్చుంటాడు. అప్పుడే పార్టీలు కూడా వస్తారు. పదిగంటల వరకు వాళ్ళతోనే సరిపోతుంది. తొందరగా నాలుగు మెతుకులు రుచిచూచి కోర్టుకు వెళ్ళిపోతాడు మళ్ళా చీకటి పడి ఇంటికివస్తాడు. మళ్ళా ఏ కాగితాలో ముందర వేసుకు కూర్చుంటాడు. ఎవరితోను మాట్లాడడు. నౌకర్లు అన్నీ మౌనంగా అమర్చిపోతారు.

వచ్చిన కొత్తలో ఈ జీవితం నాకేదో వింతగా ఉండేది. ఇతను షికారుకైనా ఎప్పుడూ ఎందుకు వెళ్ళడో అనిపించేది. బావగదికి వెనకవైపు గదిలో అక్కయ్య వుంటుంది. ఆమె ప్రాణాలన్నీ బావ మీదే ఉంటాయి. అతని ఒక్కొక్క కదలిక, అలికిడి ఆమెకు చిరపరిచితమైనాయి. కోర్టుకు వెళ్ళినప్పుడు తప్ప అతని అలికిడి వినిపించకపోతే ఆమె విలవిల లాడేది. బావ ఎప్పుడో ఒక్కక్షణం అక్కయ్యను చూస్తాడు. ఆమె బాధ చూసి భరించలేడు. వెంటనే వెళ్ళిపోతూ ఉంటాడు.

ఎడారిలా ఉన్న ఈ సంసారంలోకి విధి నన్ను త్రోసింది. ఈ ఊరు చదువు కోసం వచ్చినప్పుడు మా వాళ్ళు నన్ను ఇక్కడ ఉండమన్నారు. ఇక్కడ ఎవరికీ ఏ లోపమూ ఉండదు. బావకు ఆదాయానికి లోపంలేదు. ఔదార్యానికీ లోపం లేదు.

రాగానే ఈ ఇల్లు నాకు స్వర్గంలా తోచింది చుట్టూ విశాలమైన తోట. పెద్దపెద్ద గదులు, నౌకర్లు ఆదరణ అన్నీ ఎంతో ఉత్సాహాన్నిచ్చాయి. ఇంటికి దగ్గరలోనే కాలేజి ఉండడం కూడా ఎంతో హాయి అనిపించింది. జబ్బు వచ్చిన తరువాత అక్కయ్యను నేను చూడలేదు. వచ్చిన కొత్తలో దాన్ని చూచి బాధపడుతూ తరుచు దగ్గరే ఉండేదాన్ని. కాని క్రమంగా నాకు దగ్గరకు వెళ్ళడానికే భయం వేసేది. చెయ్యగలిగిందేమీ లేక ఊరికే దాని బాధ చూస్తూ కూర్చోటం మనస్సుకు కలతగా ఉండేది. క్రమంగా వెళ్ళటం మానేశాను.

కొద్ది రోజులకే నా ఉత్సాహం నశించింది ఇక్కడికి ఎందుకు వచ్చానా అని బాధగా ఉండేది. ఎవ్వరితోను మాటాడని బావ నాకు వింతగా తోచాడు. అతనంటే విపరీతమైన జాలి కలిగింది. అతనిలో ఉత్సాహం కలిగించాలన్న కోరిక బలమైంది.

ఏదో మిషతో అతని ఎదుట పడటానికి, అతనిని పలకరించటానికి ప్రయత్నించాను. మొదట నా పిలుపుకు అతను ముభావంగానే సమాధానం చెప్పాడు. ఎవరితోను

మాట్లాడటం ఇష్టం లేనట్లుగా తనలో తాను ముడుచుకు పోయ్యేవాడు. అయినా నాలో కుతూహలం ఎక్కువవుతూనే ఉంది.

నామాత్రం అతనికోసం ఎదురు చూచేదాన్ని. అతను ఇంట్లో ఉన్నప్పుడు ఏ పత్రికో, పుస్తకమో తీసుకు వెళ్ళి ఏవేవో చెప్పమని అడిగేదాన్ని. అతను అడిగినది చెప్పి తరువాత సంక్షిప్తంగా ఊరుకునేవాడు. కాని ఏదో ఒక క్షణాన అతని వైఖరి మారింది. ఆత్రుతతో నా కోసం ఎదురు చూచేవాడు. చనువుగా అన్ని విషయాలు చెప్పేవాడు. ఎంతో సంతోషంగా ఉన్నట్లు కనిపించేవాడు.

అతను పైకి గంభీరంగా కప్పుకున్న ముసుగు తొలగిపోయి కళ్ళల్లో కాంతి తొణికిసలాడింది. అది చూడగానే నాకు సంతోషం కలిగింది. నేను క్షణం కనిపించకపోతే అతను దిక్కు తోచనట్లు ఉండేవాడు. ఒక్కొక్కసారి కోర్టు కూడా మరచిపోతున్నాడేమో అనిపించేది. అతను అంతగా నన్ను చుట్టుకోటం నాకు భయం కలిగించింది. అయినా ఏమీ అనలేక ఊరుకున్నాను.

ప్రొద్దు పొయ్యేవరకు బావతో మాట్లాడుతూ ఉండేదాన్ని. బావ చాల ఉత్సాహంగా ఉండేవాడు. ఆ క్షణాలలో అతను నాకు పసిపిల్లవాడులా కనిపించేవాడు. ఒకసారి అతని అమాయకమైన ముఖం చూచి, విపరీతమయిన జాలి ముంచుకువచ్చి ఆప్యాయంగా అతని తల నిమిరాను. ఒక్క క్షణం అన్నీ మరచిపోయి అతను నన్ను గట్టిగా కౌగలించుకున్నాడు. నేను మెల్లగా తప్పించుకున్నాను. జాలిచేత, అగాధంలోకి దిగజారుతున్నానని, ప్రశాంతంగా ఉన్న తటాకాన్ని నిర్హేతుకంగా కలోలం పెడుతున్నానని ఆ క్షణాన తెలియలేదు. నిస్పృహతో నిర్జీవంగా వున్న బావకేదో ఊరట కలిగిస్తున్నానన్న భ్రమలో ఉన్నాను.

ఆ వేళ బావ భోంచేస్తూఉంటే దగ్గరగా కూర్చున్నాను. అలా నేను ప్రక్కన ఉంటేనే గాని అతను సరిగా తినడని నా భ్రమ. అది కొంత నిజమే. అతను కోర్టుకు టైమయిందని తొందరపడుతున్నాడు. గిన్నెలో పెరుగంతా పూర్తిగా వేసుకుంటేనే గాని నేను పోనియ్యనని గట్టిగా చొక్కా పట్టుకున్నాను. అతను నవ్వాడు. నేనూ నవ్వాను. అంతలో ఏదో విసురుగా క్రింద పడ్డట్లు పెద్దగా చప్పుడైంది. ఉలిక్కిపడి వెనక్కుతిరిగి చూచాను. అక్కయ్య! స్పృహ తప్పినట్లు నిలువునా క్రింద పడి ఉంది. ముఖం వణకుతోంది. కళ్ళ వెంట నీరు కారుతోంది. నేను నిశ్చేష్టురాలనయ్యాను. అక్కయ్య ప్రక్కమీద నుంచి లేవగా ఇంతవరకు నేనెప్పుడూ చూడలేదు. తనంతట తాను లేచి గోడలు పట్టుకుని



ప్రాకుతూ రావటానికి అది ఎంత ప్రయాస పడిందో! ఎంత తీవ్రమైన మనస్సంక్షోభంచేత అది అంతటి సాహసానికి పూనుకున్నదో! ఇది ఊహించుకునేటప్పటికి నా ముఖం వెలవెలా పోయింది.

అక్కయ్యకు కదిలే శక్తిలేదు. మనోవ్యథలు చెప్పుకోగల మాట లేదు. అయినా ప్రతి మాట వింటూ ఉంటుంది. విననివి ఊహించుకుంటుంది. మనస్సు కలత చెందుతుంది. తన నిస్సహాయ స్థితిచేత 'మరింత



క్షోభపడి లోలోపల విపరీతమైన ఆలోచనలతో క్రుంగిపోతుంది

ఎన్నాళ్ళగానో అది నేను బావతో చనువుగా ఉన్నానని, బావ నాతో ఉత్సాహంగా మాట్లాడుతున్నాడని లోలోపల కుమిలి కుమిలి అసూయ చెంది ఉంటుంది చివరకు ఇవ్వాళ ఇక భరించలేక సాహసించి లేచివచ్చి ఉంటుంది భయంతో దిగులుతో నాకు ముఖమంతా చెమటలు పట్టింది ఆ క్షణాన దాన్ని లేవదియ్యాలని కూడా తోచలేదు బావ యాంత్రికంగా దాన్ని ఓదారుస్తూ లేవనెత్తటానికి ప్రయత్నించాడు ఇంతలో నౌకర్లు వచ్చి సహాయపడ్డారు తరువాత డాక్టరు వచ్చి చూచాడు విపరీతమైన మానసికమైన ఆందోళన వలన అక్కయ్య చాల బలహీనంగా ఉన్నదని రెండు రోజులు చాల విశ్రాంతిగా ఉంచాలని చెప్పాడు ఆందోళనకు ప్రత్యేకమైన కారణాలేమైనా ఉన్నాయా అని అడిగాడు బావ మాట్లాడలేదు, నేనూ మాట్లాడలేదు ఒక్కసారిగా సమస్తం పోగొట్టుకుని దిగజారి పోయిన వ్యక్తిలా బావ ముఖం నీరసించి ఉదాసీనంగా ఉంది అతను మామూలుగా కోర్టుకు వెళ్ళిపోయాడు లోపలనుంచి వెళ్ళిపోతూన్న అతని ముఖం చూచాను నాకు కళ్ళనిండా నీళ్ళు వచ్చాయి. అతను నన్ను చూడలేదు

ఆ రోజే, ఆ క్షణమే నేను ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను లేకపోతే ఇక్కడ తగుల్కొన్న బంధనాలలో నించి ఎప్పటికి విముక్తి పొందలేక ఎవరిని సంతోషపెట్టలేను నేను సంతోషంగా ఉండలేను అక్కయ్యకు బావకు ఎప్పటికైనా నేను విపరీతమైన మనోవ్యథలకే కారణమవుతాను

నాకు ఒంట్లో బాగుండలేదని కొన్నాళ్ళు చదువు మానేసి ఇంటికి వచ్చేస్తున్నానని అమ్మకు రాశాను. ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసుకున్నాను ఇంక ఈ ఊరు నాకు చాల దూరమవుతుంది ఇంక నేను

చదువలేను అయినా అమ్మ ఏమీ అనదు అదే నాకు ధైర్యం

రెండు మూడు రోజులుగా బావ కంట పడలేదు. అతను నా కోసం వెతుక్కొని రాలేదు మా ఇద్దరి మధ్య ఎత్తుగా పెరిగిన అడ్డుగోడలు స్పష్టంగా కనపడుతూనే ఉన్నాయి ఇవ్వాళ ఉదయం అతను కోర్టుకు వెళ్ళబోయేముందు ఒక్క క్షణం బావను చూచాను అతను ఎంతో ఆశతో ఆత్రుతతో నన్ను






చూడగానే నా దగ్గరకు పరుగెత్తుకు వచ్చాడు నేను ఒక్కమాటే చెప్పాను 'నేను మధ్యాహ్నం బండిలో వెళ్ళిపోతున్నాను చదువు మానేస్తున్నాను' అన్నాను కత్తితో పొడిచి ఓర్చుకోమన్నట్లున్న దామాట అది నాకు తెలుసు బావ ఆ వ్యథ మౌనంగా భరించడానికి ప్రయత్నించాడు ముఖం వాల్చుకున్నాడు అతని కనుకొలుకుల్లో కన్నీటి బిందువులు కనిపించాయి అతను ఒక్కసారిగా పదేళ్లు పెద్దవాడైనట్లు కనిపించాడు నేను చూస్తూండగానే నా కంటి యెదుటే అతని తల పూర్తిగా నెరసిపోయి, శరీరం అందవికారంగా మారినట్లనిపించింది నీరసంగా 'నేను వచ్చి స్టేషనుకు తీసుకు వెడతాను' అన్నాడు 'అక్కర్లేదు, నౌకరు వస్తాడు' అని చెప్పాను బాధతో ముఖం ముడుచుకొని వెళ్ళిపోయాడు. నాకేసి మళ్ళా తిరిగి చూడలేదు నా కళ్ళల్లో నీళ్ళు నిండాయి

అలా వెళ్ళిపోతున్న బావకేసి వెనక నుంచి చూస్తూంటే నాకు విపరీతమైన జాలి ముంచుకు వచ్చింది అతనికి నేనేదో తీరని అపకారం చేసినట్లనిపించింది నేను రాక ముందు అతను ఏదో ఒక విధంగా తన బ్రతుకు తీర్చి దిద్దుకున్నాడు సుఖమో, దుఃఖమో ఉదాసీనంగా రోజులు గడుపుతున్నాడు క్షణ కాలం ఆదరణ, ఆప్యాయత చూపి

షే నతని మనో నిగ్రహాన్ని చెదర గొట్టాను. అతను పూర్తిగా శిథిల మైనప్పుడు నిర్దాక్షిణ్యంగా వదలి నా త్రోవన నేను పోతున్నాను. ఈ ఇంట్లో చాలా రోజులుగా చీకటి అలముకున్నది. ఒక్క క్షణం బావకు వెలుగు చూపాను. ఇప్పుడు మళ్ళీ ఆ చీకట్లోనే వవలి పోతున్నాను. ఈ సారి బావ భరించలేడు. ఒక్క క్షణం మెరసిన మెరపు మరచి పోలేడు. ఈ జీవితం ఇప్పుడు అతనికి భయంకరంగా ఉంటుంది. నిశ్చలంగా ఉన్న తీగను తుఫాను వచ్చి ఊగించి నిరాశ్రయంగా వదలిపోయి నట్లున్నది.

ముందు ఏం జరుగుతుందో నేను ఊహించుకోగలను. బావను మరచి పోవడం నా కేమీ బాధకాదు. నా కాతని మీద జాలితప్ప విపరీత మైన వ్యామోహ మేమీలేదు. ఆ జాలి చేతనే అతని కేదో ఊరట కలిగించాలన్న ఊహతో, పసితనం చేత ఆతని దగ్గరకు చేరాను. అది ఇలా పరిణమించింది. నాకు జీవిత మింకా ప్రారంభ దశలోనే ఉంది. పసితనమింకా వదలలేదు. అమ్మ దగ్గరకు వెళ్ళగానే ఆ పల్లెటూరి వాతావరణంలో, ఇంటినిండా సంచడిగా వున్న బంధువులలో నేను అన్నీ మరచిపోతాను. బావనీడగానైనా నా మనసులో మిగులుతాడని నమ్మకం లేదు. ఎప్పుడో ఏ రాజకుమారుడో తరలివచ్చి నన్ను ఆనంద ధామానికి



తీసుకు పోతాడని ఉత్సాహంతో ఎదురు చూస్తూ ఉంటాను. ఆ కల ఎప్పుడో ఫలిస్తుంది.

బావ జీవితంలోకి మళ్ళా వెలుగు రాదు. అతను ఈ జన్మలో నన్ను మరచిపోడు.నాకోసం పరితపించి పరితపించి జీవితాన్ని అన్నివిధాల శిధిలం చేసుకుంటాడు. క్రమంగా కోర్టుకు కూడా వెళ్ళకపోవచ్చు! ఈ రెండు మూడు రోజుల్లోనే పరధ్యానంగా ఏ కాగితాలు చూడటంలేదు. వాకిట్లో పార్టీలు సణుగుతున్నారు, సన్నసన్నగా. అయినా అతను విని పించుకోటంలేదు.

ఒక్కక్షణం నాకు పసితనంచేత

## చందాదార్లకు మనవి

పాత చందా దారులు తిరిగి చందా సైకం పంపే టప్పుడు తమ చందా నంబరు, అడ్రసు వివరంగా వ్రాసి మాతో సహకరించ ప్రార్థన.

మేనేజరు,
"జ్యోతి"

ఏదో మహాపాపం చేశాననిపిస్తోంది. మనిషిని భౌతికంగా కొట్టిచంపటమే పాపమా! మానసికంగా క్షోభపెట్టటం, బ్రతుకు శిథిలం చెయ్యటం పాపంకాదా అనిపిస్తోంది. ఈ మహా పాపమేదో పుష్కలంగా చేశానని పిస్తోంది. ఆశ్రయమిచ్చిన అక్కయ్యకు, బావకు తీవ్రమైన మనస్సంక్షోభం కలిగించాను. వారిజీవితాల్లో కమ్ముకున్న శూన్యాన్ని మరింత ప్రస్ఫుటంగా వెక్కిరించి చూసి నా త్రోవన నేను పోతున్నాను.

అయినా నేను చెయ్యగల దేమీ లేదు. ఆ మాట చాలా స్పష్టంగా తెలుస్తోంది. ఎప్పుడో అసంభవమైనది అనుకోకుండా సంభవమై మళ్ళా బావ మనస్సులో శాంతి నెలకొంటుంది. నా మనస్సుకు ఊరట కలిగించుకోటానికి అది ఒక ఆశ.

తెరచినపెట్టె కాళికాదేవి నాలుకలా భయంకరంగా ఉంది. అది చూసి భరించలేకుండా ఉన్నాను. చీరలన్నీ తీసి గబగబ పెట్టెలో పడవేశాను. కనపడకుండా గట్టిగా మూతవేశాను. వాకిట్లో బండి ఆగింది. నౌకరు పెట్టె తీసుకు వెళ్ళాడు.

మనస్సు మభ్యపెట్టుకుని నేనూ కదలిపోయాను.

***

# ప్రేమ ద్వేషం

"అన్నయ్యా! నేను రెడీ!" అంటూ ఒచ్చింది చెల్లి.

"సినిమాకంటే నువ్వు రెడీ కాని దెప్పుడులే" అన్నాను ఎగతాళిగా.

"అక్కడికి నువ్వేక్కువ చూడనట్లు! పద పోదాం మరి" అంది. బయల్దేరాం.

కాలేజికైతే మందగమనంతో సాగే మా చెల్లి టిక్కెట్లుు పోతాయేమో అనే బెంగతో ఉరుకులు పరుగులు పెట్టించి మరీ థియేటరు చేరుస్తుంది. చెల్లితో సినిమాకు బయల్దేరితే టిక్కట్లు దొరక్కపోవడం అందుకే జరదు; ముందుగా పోవడంవల్ల క్యూలో మేం ముందుంటాం కాబట్టి. సినిమా యింకా గంటకు ప్రారంభ మవుతుందనగా థియేటరు దగ్గరుండకపోతే చెల్లికి సినిమా చూసినట్లుండదు. అందుకే అది అమ్మా వాళ్ళతో బయల్దేరదు.

మా కెదురుగా ఓ అమ్మాయి వస్తోంది. అలవాటైన కళ్ళు అంద చందాలను అంచనా వేస్తున్నాయి. అయితే ఆ అమ్మాయిని చూడగానే చెల్లి ఠక్కున ఆగింది. ఇంతలో ఆ అమ్మాయి "హల్లో! వసంతా" అంటూ పలకరించింది:

'ఇక్కెడినించి వస్తున్నావు యిప్పుడు?" అంది చెల్లి.

"రాధా వాళ్ళింటికి వెళ్ళి వస్తున్నాను నువ్వెటు బయల్దేరావు?" అంది, చెట్టంత నన్నుకాస్తా నిర్లక్ష్యం చేసేసి.

జి. నరసింహారావు

"సినిమాకి. రాంందూ! హాయిగా ఎంజాయ్ చెయ్యొచ్చు" అంటూ రిక్వెస్ట్ చేసింది చెల్లి.

"సారీ! పనుంది. ఇంకొకసారి వెళ్దాం. టాటా..." అంటూ ఆ అమ్మాయి మమ్మల్ని దాటేసింది.

అంతవరకూ వెయిట్ చేస్తున్న నన్ను చూసి 'ఇంకపద' అంది చెల్లి.

నడుస్తూ "ఎవరే ఆ అమ్మాయి?" అన్నా ఇటీజ్ బట్ నేచురల్!

అది పెంకెగా "ఎవరయితే నీ కెందుకు?" అంది. నిజమే!

నేను పెద్ద యింటరెస్టు లేనట్టు "అం అదికాదు! నీ ఫ్రెండా అని" అన్నా.

తను వెంటనే "లేకపోతే నీ ఫ్రెండా" అంది.

అర్థమవుతోంది కదా మా చెల్లి.

నేను "బాగుంది. నా ఫ్రెండయితే నీతో మాట్లాడుతుందేమిటి? అయినా ఆడపిల్లల్లో నాకు ఫ్రెండ్సున్నంత అదృష్టం గూడానా!" అన్నా.

"అయితే అది మరి తెలిసినవాడివి నీ ఫ్రెండా అని అడగడమెందుకు? బొత్తిగా ఇకానమీ ఆఫ్ వర్డ్స్ లేదు" అంది చెల్లి తనది పి. యు. సి. లో బి. పి. యల్ (లాజిక్) గ్రూపు లెండి. ఆ లాజిక్ యిలా ఉపయోగపడుతూంది

"ఆ మాత్రం తెలియక కాదు! ఆ అమ్మాయి పేరేమిటో తెలుసుకుందామని అడిగాను" అన్నాను.

"మరయితే ఆ డొంక తిరుగుడు ప్రశ్న లెందుకు? డైరెక్టుగా అడిగితే పోలా! అయినా ఆ అమ్మాయి ఊరూ, పేరూ నీ కెందుకు?" అంటూ క్రాస్-ఎగ్జామిన్ చేసింది. అందుకే నాన్నగారు దీనికి లా చెప్పిస్తానంటున్నారు కాబోలు.

"బాగుంది. పేరు తెలుసుకోవడంలో తప్పేమిటుంది? నీ ఫ్రెండు పేరు నాకు తెలియకూడదా?" అన్నా.

"నా ఫ్రెండు పేరు మధ్య నీ కెందుకు? అయినా అసలు అమ్మాయిల ఊసు నీ కెందుకు?" అంటూ నిలేసి అడిగింది.

యౌవన సహజమైన ఉత్కంఠ ఆపుకోలేక అటువంటి వివరాలు మనం కోరుతాం. అంత మాత్రంచేత అపార్థం చేసుకుని, యిలా నిలవేస్తే ఏం సమాధానం చెప్పగలం చెప్పండి.

"భేష్! పేరడిగితేనే ప్రేమించేసానంటున్నా ననుకున్నట్లుంది నువ్వు. అయినా యీ అనుమానాల జబ్బు అమ్మమ్మదగ్గర్నుంచి నువ్వెప్పుడెరువు తెచ్చుకున్నావమ్మా చిట్టితల్లీ" అంటూ ఓ చెణుకు చెణికాను.

"నువ్వు నేనలా అనుకున్నానేమో అని అనవసరంగా అనుమానం పడుతున్నావుగాని నేనలా



అనలేదే! అయినా ఆ అమ్మాయికీ నాకు టర్మ్స్ బాగులేవు. పేరు చెప్తే నవ్వ్వారుకుంటావా? కాను మేటా అంటావు. మంచి క్లోజ్ ఫ్రెండేనా అంటావు. ఇంక డొంకంతా కదపాల్సి వస్తుంది. అందుకనే పేరు చెప్పలే' అంది చెల్లి.

అదదీ సంగతి. దీనికో పెద్ద బ్యాక్ గ్రౌండ్ ఉందన్నమాట. ఇంత ఫ్లాష్ బాక్ లోకి చెల్లాయిని తీసుకు పోయి కథ చెప్పించాలి అనుకునేటంతలో థియేటరు చేరుకున్నాం.

టిక్కెట్లు తీసుకుని కూర్చున్నాక–

"ఇప్పుడు చెప్పు 'జరిగిందేమిటో అసలు!' అన్నా, ఎలక్షన్ ప్రాపగాండాలో దెబ్బలు తిన్న సహచరుడిని సావధాన పరచి, జరిగిన విషయం చెప్పమనే నాయకుడిలా.

"నే చెప్పను. అయినా ఈ మధ్య ఆడవాళ్ళ విషయాలమీద ఇంటరెస్టు పెరిగిందేమిటి నీకు?" అంది చెల్లి. ఇది రణమొండి దీన్నోట్లోంచి

యీ కథ పలికించడం వియత్నాం ప్రాబ్లెమంత ప్రాబ్లెమయిందే. కాని దీని టక్కులు మనదగ్గరా ?

"సరే, అయితే! ఈమారెప్పుడు, నా ఫ్రెండ్స్ వచ్చినపుడు మా దగ్గర కూర్చుని మా కబుర్లు వినకు. అణా లైబ్రరీనుంచి డిటెక్టివ్‌లు తెమ్మనకు. సినిమాకు నీతో రమ్మనకు. మొన్న రాధాకృష్ణగాడూ, నేను దెబ్బలాడు కుంటే 'ఏం జరిగిందని' నన్ను వేపుకు తినేసి మరీ, జవాబు చెప్పించలా! నీకయితే రొష్టె. మాకయితే ముఖ్యంనా! ఈమారు నా రూమ్‌లోకి రా. కాళ్ళు విరగ్గొడతాను' అంటూ, చిన్న అల్టిమేటం జారీ చేశాను. నాకు తెలుసు యీ దెబ్బతో అది దారికి వస్తుందని. ఎందుకంటే అది కబుర్లపోగు. ఏది లేకపోయినా బ్రతగ్గలదుగాని బాతాఖానీ, సినిమాలు, డిటెక్టివ్‌లు లేందే అది బ్రతకలేదు.

"అక్కడికి నవ్వా నీ ఫ్రెండ్స్ లేకపోతే రోజు గడవనట్టు పెద్ద పోజు కొట్టకు! బ్రహ్మాండంతే చెప్పేదాన్నిగా! అయినా దీనికి ఎడ్వర్టైజ్ మెంటు యివ్వకు మధ్య నేను చస్తాను. ముఖ్యంగా [illegible] చెప్పకు" అంది. బావంటేచాలు దీనికచచ్చేంత భయం. వాడు డబ్బా కొట్టడంలో ఫస్టు. వాడు వేసిన విట్ ఇప్పటికీ పొల్లుపోలేదంటే వింతకాదు. ఆ సబ్జెక్టులో వాడు థీసిస్ ప్రొడ్యూస్ చేస్తాడు ఇవాళో, రేపో.

క్రిందటి నెల మా కాలేజీలో పాటల పోటీలు జరిగాయి తెలుసుగా. ఇంకా అప్పటికి తను ఈ ఊరొచ్చి కొంచెం రోజులే అయినా నాకు మంచి ఫ్రెండయింది. తను మా కృష్ణశాస్త్రిగారి "మధురానగరి సమీపంలో," "మోయింపకోయ్ మురళి" పాడింది. నిజంగా బాగా పాడింది. నేను "ఎంకి పాటలు" "గుండె గొంతుకలోన కొట్లాడుతాది," "ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా" పాడాను. ప్రైజులు డిస్ట్రిబ్యూట్ చేసే అతనికి తెలుగు సాహిత్యం మీద, ముఖ్యంగా ఎంకి పాటల మీద మంచి అభిమానం వుందట. ఆయన మాట్లాడుతూ "ప్రైజు ఆ.అమ్మాయికిచ్చినా" (అంటే మా ఫ్రెండు కన్నమాట) "ఎంకిహృదయంతో పాడింది: ఎంకిలా ఆవేదనను అనుభవించి ఆలపించింది కాబట్టి వసంతకు నా అభినందనలు" అన్నారు.

దాంతో మొదలయింది. ఇంటికీ ఆడపిల్లలందరం వచ్చేస్తూంటే, వెనక బీటు కాన్‌స్టేబులు లాంటి స్థానిక రోమియో సంఘంవారు ఒకటే కాకిగోల "ఎంకీ! ఎంకీ!" అంటూ. పెంకెగా సమాధానం చెబుదామనుకున్నాగాని, అల్లరవుతుందని ఊరుకున్నాను. అయితే, తను గూడా, అబ్బాయిల లాగానే "ఎంకీ! ఎంకీ" అంటూ ఎగతాళి చేయడం ప్రారంభించింది. మా

కోతులు కూడా జతచేరి ఒకటే కోరస్ 'ఎంకీ! ఎంకీ' అంటూ.

నిజం చెప్పొద్దూ! నాకు బలే కోపం వచ్చింది అయితే కోపగించుకుంటే ఉడుక్కున్నా నంటారు. మరింత ఎగతాళి చేస్తారు స్పోర్ట్స్‌మన్ స్పిరిట్ లేదని అందువల్ల వాళ్ళెవరితోనూ మాట్లాడకుండా యింటికి వచ్చేశాను" అంటూ ఆగింది చెల్లి.

"మంచిపని చేశావ్" కూచిపూడి భాగవతంలోని మాధవిలా అన్నాను.

"నీ సర్టిఫికేట్లేం అక్కరలేదు గాని, తిన్నగా విను. ఆ రాత్రి అలా అయిపోయిందా? ఆ మర్నాటి నుంచీ కాలేజీ అంతా అబ్బ! ఒకటే గోల. 'ఎంకీ, ఎంకీ' అని. ఓ ప్రబుద్ధుడు 'ఆపలేనే ఎంకి ఈ వలపు యిసురు' అని స్వంత కవిత్వం చేర్చి పాడేశాడుగూడా. మరో రాస్కెలు 'మేకప్ మార్చాలోయ్! మెళ్ళో పూసలపేరు తల్లో పువ్వులదండ, వనకిన్నెరలా ఉండాలి' అంటూ వాడి పాండిత్య ప్రకర్షను చూపించడం ప్రారంభించేడు. దాంతో మిగతా వాళ్ళు వంతపాటు పాడుతూ, తెగ అల్లరి చేయడం ప్రారంభించేరు. వర్ది బ్రూట్స్" అంటూ చెల్లి కసి తీర్చుకుంటోంది.

అనువుగాని వేళ నోరెత్తకూడదన్న సిద్ధాంతానుసారం నోర్మూసుకున్నాను నేను.

"అబ్బాయిలంటే మరోపని లేదు కాబట్టి అంటారు. తప్పదు కాబట్టి భరిస్తాం అయినా అప్పటికే కోపం తారాపథాన్నంటుకుంది. కోపంతో బాటు ఏడుపూ వచ్చేస్తోంది. వీళ్ళకి తోడు తను. తోటి క్లాసుమేటు. మంచి ఫ్రెండు కూడా "ఎంకీ! ఎంకీ!" అంటూ నాయుడుబావ పోజులో స్వీట్‌గా అనడంతో నాకు చిర్రెత్తుకొచ్చింది అయితే ఏం చేస్తాం? అప్పటికి "గొల్లపిల్ల" అన్నా. కాని "అలా అని ఆ స్పీకర్ గారవలేదుగా" అంది తను ఎదురుదెబ్బ తీస్తూ. ఆయనెవరోగాని, అతను ప్యాస్ చేసిన కాంప్లిమెంట్ నా ప్రాణాల మీదకొచ్చింది. అప్పటికి ఊరుకున్నాను, ఎగతాళి భరిస్తూనే...

మా అబ్బాయిలు, అమ్మాయిలు మాత్రం వాళ్ళ డ్యూటీ, ఎవరో డబ్బిచ్చి చేయించినట్లు చేసుకుపోతున్నారు.

కాని ఒకసారి ఏం జరిగిందో తెలుసా?" అంది చెల్లి.

"నువ్వు చెప్తేగదా తెలిసేది" అన్నా. తెలివిగా విట్ వేస్తున్నాననే గర్వంతో.

"అతితెలివి చూపకుగాని, ఎవడో వాళ్ళ కజిన్ అట. ఆతనికి నన్ను పరిచయం చేస్తూ "ఈ అమ్మాయి పేరు ఎంకి. చాలా బాగా పాడుతుంది" అంది తను. నాకు పిచ్చ కోపం వచ్చింది. అయినా పెద్ద


రెమి
పౌడర్
Remy

మనిషి ముందున్నాడుగదా, తర్వాత వార్న్ చేద్దామని ఊరుకున్నా!

ఆయన "వాట్?" అంటూ యింకెక్కడా చోటు లేనట్లు తన ఆశ్చర్యం అంతా నా ముందే ఒలకబోసి "ఎంకి!! చాలా పిక్యూలియర్‌గా ఉందే? మీరింత మోడ్రన్‌గా ఉన్నారు. మీ పేరింత ఔట్ ఆఫ్ డేటుగా ఉందేమిటి? మీ బామ్మగారి పేరా? లేకపోతే. నో నో యూ షుడ్ ఛేంజ్ యువర్ నేమ్ ప్లీజ్" అంటూ నీలాగే అతి తెలివి చూపెడుతున్నాననుకుని పెద్దగా నవ్వాడు. తనూ గొప్పగా శ్రుతి కలిపింది.

నా కసలే కోపం జాస్తి. తెలుసుగా. అప్పటి వరకూ తమాయించుకున్నాను. నాకు కోపంవస్తే నిన్నూ, నాన్నగారినే లెక్కపెట్టను. అష్టరాల్ వీళ్ళనగా ఎంత?

పిచ్చ కోపంతో "బిహేవ్ యువర్ సెల్ఫ్! నా పేరు ఎంకి కాదు, మంగి కాదు. మీ అందరి పేర్లకన్నా నాది మోడ్రన్. అయినా మనిషన్న తర్వాత మర్యాద తెలియాలి. మాట్లాడటం తెలియాలి. వెకిలి నవ్వులు నవ్వటం కాదు. మీ తాతల్లా నేనూ నవ్వుతాను. ఛఛ.. అయినా ఇలాంటి వారితో ఫ్రెండ్‌షిప్ చెయ్యడం నాదే బుద్ధి తక్కువ. హాస్యాలకైనా హద్దూ పద్దూ ఉండాలి. అయాం సారీ ఫర్ యూ" అని నాలుగు చడామడా తిట్టేసి మరీ వచ్చేశాను. మరి తనతో ఫ్రెండ్‌షిప్ కట్ చేసుకోవాలను కున్నాను.

కాని ఆ మర్నాడు లీజర్ అవర్‌లో "సారీ పసంతా! అయ్యాం ఎక్‌స్ట్రీమ్‌లీ రీ సువ్వంత అఫెండవుతా వనుకోలేదు. సరదాగా అందామనేగాని మరే ఉద్దేశమూ లేదు, నిన్నలా పిలవడంలో" అంటూ అపాలజీస్ చెప్పుకుంది" అంటూ చెల్లి ఆగింది.

"మరింకేం. తీరిపోయింది తగ్గువు. మరిప్పుడు మళ్ళా మీ స్నేహానికేమొచ్చింది?" అన్నా.

"అందుకే నీకు తలకాయ లేదని నే ననేది పూర్తిగా వినకుండా మధ్య యీ చొప్పదంటు ప్రశ్నలెందుకు? అప్పట్నుంచీ తను చాలా రిజర్వ్‌డుగా ఉంటోంది. పలకరిస్తే మాట్లాడుతుంది. అదైనా ముక్తసరిగా తప్పించి పూర్వంలా ఫ్రీగా మాట్లాడదు. మిగతా వాళ్ళు గూడా అంతే. అంతకుముందు బలే సరదాగా వెయిటింగ్ రూమ్‌లో మేం తెగ గోల చేసేవాళ్ళం. ఇప్పుడు వాళ్ళంతా ఒకటి. నే నొక్కర్తినే ఒకటి. వాళ్ళతో కలిసి ఏదైనా సరదాగా మాట్లాడటానికి ప్రయత్నం చేస్తే, వాళ్ళా టాపిక్ మార్చి వేస్తారు ఏమర్రా అని నిలదీసి అడిగితే: "నువ్వు వేగంగా అఫెండయిపోతావు బాబూ! ఎందుకొచ్చిన గొడవ" అంటారు. నాతో సరదాగా తిరగకుండా, నాతో

పూర్వంలా మాట్లాడకుండా పోతే నా కెలా ఉంటుంది చెప్పు? తను చాలా మంచిది. తెలివైంది. నాకు మంచి ఫ్రెండుగూడా. ఏదో పొర పాటున అన్నానే అనుకో, అంత మాత్రంచేత మరీ అంతదూరం చేసెయ్యాలా! ఇప్పుడే చూశావు కదా! సినిమాకు రమ్మంటే, పనుంది అంది. అదే ఏ రాధో, రమణో అడిగితే తప్పకుండా వచ్చేస్తుంది. తనకి నా మీద అవేళ అలా అన్నానని కోపం అన్నయ్యా! నే నప్పటికీ చెప్పా, జరిగిన పొరపాటు మరిచి పోదాం అని. అలాగే అంది. కాని యింకా రిజర్వుడుగానే వుంటోంది నా కెలా గుంటుంది చెప్పు, మంచి ఫ్రెండుపోతే" అంది చెల్లి. ఇంకా ఏంచెప్పునోగాని లైట్లారిపోయాయి. టైటిల్సు వేస్తున్నారు. చీకట్లో చెల్లి కళ్ళు చెమ్మగిలడం గమనించ గలిగేను.

చెల్లిది అదోరకం స్వభావం. ఎక్కువగా అభిమానిస్తుంది. అయితే ఆ అభిమానం మన కర్థంకాదు. ఉడుకుమోత్తనం కొంచెం ఎక్కువ కావటంవల్ల, నోరు పారేసుకోవడం అలవాటువల్ల, ఏదో అనేసింది. దాంతో వాళ్ళు, దీన్ని కాస్తా ఒంటి పిల్లి రాకాసిని చేసేసి, దూరంగా ఉంచసాగారు. అసలే ఇది సోషల్ బర్డ్. అందులోనూ అభిమానించే హృదయం. చస్తే అలా ఉండలేదు. ఉండలేక పోతుంది. దాని కోపం తాటాకుల మంటలా క్షణికం. అందువల్ల కుడితిలో పడ్డ ఎలకలా గిలగిల కొట్టుకుంటూంది. ఆ అమ్మాయి తనను చేరనీయక పోవడంతో, పైకి ద్వేషిస్తూంది. ప్రేమా - ద్వేషాల సంఘర్షణ సమయంలోనే నేను ప్రశ్నలు వేస్తే పెంకెగా సమాధానం చెప్పింది.

అందువలనే "ప్రేమా, ద్వేషమూ, హృదయమున్న చోట ఉంటూ" యని స్వామీజీ చెప్పారు.

ప్రేమా—దేషాలకు మధ్య 'వన్-వన్-కరెస్పాండెన్సు' ఉందేమో తెలీదుగాని, ఈ రెండు ఒకదాన్నొకటి అంటిపెట్టుకు తిరుగుతుంటాయి.

ఈ విషయంపై ఎవరైనా రీసెర్చి చేస్తే బాగుండిపోను.

***



# ఇది ఎవరి కథ?

ఇచ్ఛాపురపు జగన్నాథ రావు

సాయంత్రం ఐదు గంటల సమయం.

సెక్రటేరియట్ నుంచి క్రమక్రమంగా అందరూ యిళ్ళకు బయల్దేరుతూ బస్సుల కోసం తొందర పడుతున్నారు.

కొంతమంది టేబుల్స్ సర్దుతున్నారు. కొంతమంది యింకా ఆలస్యం చేస్తున్న స్నేహితుల్ని త్వరగా బయల్దేరమని హెచ్చరిస్తున్నారు పని ముగియని ఆఫీసర్లూ వాళ్ళూ గుమాస్తాలవైపు యీర్ష్యగా చూస్తూ ఫైళ్ళు తెముస్తున్నారు.

ఒక యువకుడు మట్టుకు ఇదేమీ చెయ్యడంలేదు.

పన్నెండవ అంతస్తు మెట్ల మీద అలసిపోయినట్లు కొంచం సేపాగి, మళ్ళీ మీదకు వెళ్ళడానికి మెట్లెక్కడం ప్రారంభించాడు భారంగా. క్రమంగా అతను పధ్నాలుగో అంతస్తు కూడా ఎక్కి మీదకు వెళ్ళిపోయాడు.



కొంచెం మాసిపోయిన రంగు పంట్లాం—చిరిగిన తెల్ల బుష్ షర్టు—కొద్దిగా అరిగిన అకు చెప్పులూ—మెల్లెక్కిన అలసటతోటీ, కలకత్తా వేసవి కలిగించే చిరాకుతోనూ, చెరిగిపోయిన క్రాఫుతోనూ అతను జీవితంమీద చాలా విరక్తి కలిగిన వాడిలా కనుపిస్తున్నాడు.

భవనం మీదకు రాగానే ఒక గొప్పకార్యంసాధించినట్లు నిటారుగా నిలబడి చుట్టూ చూసేడు

షుహూరు కలకత్తా అంతా తన పాదాలక్రింద కనుపిస్తోంది.

నెమ్మదిగా తూర్పువేపు అంచువాకా నడిచి అక్కడున్న రెయిలింగ్ పట్టుకుని నిలబడ్డాడు.

రెండో, మూడో నిమిషాలు అలాగే నిలబడ్డాడు.

ఏదో చప్పుడైనట్లనిపించి వెనక్కి తిరిగా డతను.

అతనికి ఆరూ, ఏడూ అడుగుల వెనుక ఆమె నిలబడి వుంది.

క్షణమాత్రం అతను గాభరా పడ్డాడు.

ఆమెకి పాతికేళ్ళకన్నా ఉండవు. చక్కటి రూపం.

ఆమె అతనివేపే తేరిపార చూస్తూంది.

అతను కళ్ళు మళ్ళించుకునేసరికి రెండు నిమిషాలు గడిచిపోయాయి. మళ్ళీ ఇటు తిరిగి క్రిందని బొమ్మల్లా కనుపిస్తున్న కార్లనీ, మనుషుల్నీ చూడటం సాగించే డతను.

"ఆక్కణ్ణించి గెంతుదామని చూస్తున్నారా?" ఆమె కంఠస్వరం కూడా రూపుకి తగినట్లుగానే వుంది—తియ్యగా.

కొద్దిక్షణాల అనంతరం అతను నెమ్మదిగా వెనక్కి తిరిగి "అవును... కొంచెం సేపట్లో ఆ పనే చేస్తాను. మీరు ఒక్క అడుగు ముందుకు వేశారా, ఆ పని ఈ క్షణంలోనే చేస్తాను" అన్నాడు.

అతని చేతులు రెయిలింగ్ మీద బిగుసుకున్నాయి.

"తప్పకుండా మీ యిష్టం వచ్చినట్టే చేయండి. కాని—ఒక్కమాటు మట్టుకు చెప్పదల్చుకున్నాను" ఒక్కసారి ఆగి మళ్ళీ అన్నదామె—

"ఈ సెక్రటేరియట్ బిల్డింగ్ ఆత్మహత్యలకి ఎంత మంచిదని పేరు పడినా, మీరున్న వేపు గెంతితే ఏమీ లాభం లేదు. కావాలంటే కిందకి చూడండి. దిగువ అంతస్తులో బాల్కనీ ప్రొజెక్షన్ ఉంది." అతను రెయిలింగ్ గట్టిగా పట్టుకుని కొంచెం ముందుకు వొంగి చూసి తనలో అనుకున్నాడు — "ఆమె చెప్పింది నిజమే!"

మళ్ళీ వెనక్కి వచ్చేసరికి అతనికి ఇంకొంచెం చెమట పట్టింది.

"ఉత్తరం వేపు వెళ్తే ఏ సందేహమూ లేకుండా ఆత్మహత్య చేసు

కోవచ్చు. మీరున్న దగ్గరనుంచే ఉరకాలంటే ఎవరైనా మిమ్మల్ని గట్టిగా నెట్టాలి. నేనే ఆ సహాయం చేద్దునుగానీ – ఆ ప్రమాదం జరిగినప్పటినుంచీ నాకు ఈ తూర్పువేపు చాలా భయం పుట్టుకొస్తూంది' అన్నదామె ఉన్నచోటే నిలబడి.

అతను మళ్ళీ వెనక్కి తిరిగి ఆమె ముఖంలోకి చూసేడు.

ఆమె చాలా సీరియస్‌గా కనిపించింది.

'ఏ ప్రమాదం?' కొంచెం కుతూహలం చూపుతూ ప్రశ్నించేడతను.

'క్రిందటి మార్చిలో – నేనూ సరిగ్గా మీరు నిలబడ్డ దగ్గరనుంచే ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించాను. ఓ పావుగంట ఆలోచించి మరీ ఉరికాను. కాని ఏం లాభం? ఆ క్రింద బాల్కనీలో దుబ్బున పడ్డాను. అక్కడ నిద్రపోతున్న దర్వాను తన నిద్రని పాడుచేసినందుకు దెబ్బలాడేడు. ఒంటికి బాగా దెబ్బలు తగిలాయి ఎముకలు విరగలేదనుకోండి కానీ ఆపుకోలేనంత ఏడుపొచ్చేసింది. చివరకి బ్లౌజులో పెట్టుకున్న పెన్ను కూడా విరిగిపోయింది! ఎలాగో ప్రాణాలతో బయటపడి ఇంకెప్పుడూ సెక్రటేరియట్ తూర్పు భాగం నుంచి ఉరికి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించకూడదని ఒట్టు పెట్టుకున్నాను.'

అప్పటిదాకా గడ్డకట్టుకుపోయిన అతని ముఖంలో చిన్న నవ్వు ముందర మెరిసి – క్రమంగా పెద్దదై శబ్దంతో బయటకు వచ్చింది.

'చూడండి – ఈ కథలతో నా మనసు మారుద్దామని ప్రయత్నిస్తున్నారేమో ఏం లాభంలేదు! రెండు కాళ్ళూ కిందని తన్నిపెట్టి గట్టిగా గెంతితే రోడ్డుమధ్యలో పడతాను కొంచెం అదృష్టముంటే అప్పటికి ఏ లారీ అయినా సిద్ధంగా వుంటుంది. మీ రేవుద్దేశంతో ప్రయత్నిస్తున్నారో నాకుతెలియదు. కానీ చాలా కృతజ్ఞుడిని దయచేసి వెళ్ళిపొండి' అన్నాడతను.

'మీ కభ్యంతరం వుంటే వెళ్ళిపోతాను. కాని ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటుంటే చూడటం నాకు బలే సందా! ఇక కొద్ది నిమిషాల్లో మీ రెలాగూ వురుకుతారు కాబట్టి దయచేసి నన్ను వుండనివ్వండి. ప్లీజ్ ..'

అతను బాధగా, ఆశ్చర్యంగా ఆమె వంక చూసేడు.

'చూడండి. ఇదేమీ చూసే విచిత్రమూ కాదు, నవ్వుకునే వినోదమూ కాదు నా భార్య నిన్నరాత్రి ఒక డ్రైవర్‌తో లేచిపోయింది! వారం రోజుల క్రిందట నన్ను ఉద్యోగంనుంచి డిస్మిస్ చేశారు!! ఎవడిదో పర్స్ కొట్టేశానని పొద్దుటినుంచీ పోలీసులు నా కోసం వెదుకుతున్నారు!!!

నేను పడని బాధలులేవు. నేను చెయ్యని పాపాలూలేవు.

బ్రతికే ధైర్యం లేకపోయినా చచ్చేందుకు కావలసిన పిరికితనం నాలో వుంది మీరేదో కష్టకథ చెప్పి నా జీవితంలో మిగిలి వున్న చివరి ఘడియలు పాడుచేయకండి అస్తమిస్తున్న ఆ సూర్యుణ్ని చూస్తూ ఆయనతో పాటే నేనూ అస్తమిస్తాను. నన్ను ప్రశాంతంగా వదిలేసి మీరు వెళ్ళిపొండి" అన్నాడతను.

ఆ మాటల్లో - అతని కంఠం కొంచెం గాద్గదికమైనట్లు అనిపించింది.

ఆమె చిరునవ్వు నవ్వింది. "మీరు నా మాటలు నమ్మకపోవడంలో ఆశ్చర్యంలేదు నన్ను ప్రేమించిన వాడిని నా చేతులతో నాశనం చేశాను! ఎన్నో అబద్ధాలాడుతూ, ఆత్మగౌరవం వదిలి నీచంగా శరీరం అమ్ముకున్నాను మీలాగే, నేను పడని బాధా లేదు-చెయ్యని పాపమూ లేదు" అంది ఆమె బాధగా.

"మరైతే మీరు మళ్ళీ ఏదో విధంగా ఎందుకని చావలేదు ?"


# ఉదరాంతకి

చంటి పిల్లల సమస్త అనాసలు, లివర్ అండ్ స్ప్లీను వ్యాధులు నివారించి ఆరోగ్యవంతులుగా చేయును.

# అమృతసంజీవినీమాత్రలు

గర్భిణీ స్త్రీలకు కలుగు సమస్త వ్యాధులను పోగొట్టి తల్లికి, గర్భస్థ శిశువునకు బలము కలిగించి సుఖప్రసవము, సత్సంతానము కలుగజేయును.

## శ్రీ భుజంగరాడ్వైద్యశాల

ప్రొప్రయిటర్సు 'భిషక్‌శిరోమణి' పొన్నాడ పేరయ్య అండ్ సన్సు

తాళ్ళరేవు, తూర్పుగోదావరిజిల్లా.

"చెప్తాను. కాని, మీ కభ్యంతరం లేకపోతే కొంచెం మీరిటు వచ్చి కూర్చోండి. నేనూ కూర్చుని చెప్తాను. కాళ్ళు పీకుతున్నాయి" అతనొక నిమిషం ఆలోచించి "ఆల్ రైట్! కాని నన్నాపడానికి కేవిధమైన ప్రయత్నమూ చెయ్యనని ముందర వాగ్దానం చెయ్యండి" అన్నాడు.

"తప్పకుండా మిమ్మల్ని చావకుండా ఆపుదామనే ఉద్దేశం నాకే కోశానా లేదు సరిగదా, ఆ అంచుదాకా రాకుండా ఇంకే సహాయమైనా చేస్తాను. రండి, కూర్చోండి"

అతనామెకి రెండడుగుల దూరంగా వచ్చి కూర్చున్నాడు.

ఆమె కూడా కూర్చుంది.

"మీరు చావడం ఎందుకు మానేశారో ఇప్పుడు చెప్పండి."

"చెప్తాను మీకో సిగరెట్ కావాలా?" అడిగిందామె.

"మీరు ... సిగరెట్లు ... కాలుస్తారా?"

ఆమె చేతిలో బ్యాగ్ తెరిచి సిగరెట్ ప్యాకెట్టూ అగ్గిపెట్టే తీసి యిచ్చింది సమాధానం చెప్పకుండా.

అతను సిగరెట్ వెలిగించాడు.

"ఆ రోజు... నేను నిజంగా చచ్చిపోదామనే ప్రయత్నం చేశాను. కాని ఇంటికి వెళ్ళేసరికి అమ్మ



నా దెబ్బలు చూసి ఎంతో దుఃఖించింది ఏదో ప్రమాదంలో దెబ్బలు తగిలాయని చెప్పేను ఆమె నిజమే అనుకుంది ఆమె కార్చిన కన్నీటిలో నా అర్జనమీద వున్న ఆశ కన్న చాలా ఎక్కువ వుందని నాకు బోధపడింది అదీకాక నాకు దేవుడి మీదా కర్మమీదా నమ్మకం చాలా ఎక్కువ నేను చేసిన పాపాలు—సులభంగా చచ్చిపోతే—పరిహారం కాదని తెలుసుకున్నాను అనుదినమూ ఈ నరకకూపం వంటి మహాపట్నంలో నరకంలాటి మా ఇంట్లో జీవిస్తూ బాధపడుతూ మాత్రమే ఇలాటి పాపాలు పరిహారమౌతాయి నా ఒట్టులూ వంగి చూసి మీరేమీ మోసపోకండి ఎనాడో చేసిన పాపాలకి ముట్టిన ప్రతిఫలాల్లో ఎవరకి మిగిలినవి ఇవే మీరు చాలా అదృష్టవంతులు కనీసం ఈ జన్మలో ఇక మీకు బాధలుండవు

అతను సిగరెట్ పొగ ఆకాశంలోకి నెమ్మదిగా వదలి ఒకమాట చెప్పండి. మీ రీ సమయంలో ఇక్కడి కెందుకు వచ్చారు ?"

"మంచి ప్రశ్న అడిగారు. ఏనాడు నేను ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించానో ఆనాటినుంచీ మళ్ళీ నేనే విధమయిన పాపకార్యాలూ చెయ్యలేదు. ఇవాళ మళ్ళీ డబ్బు కోసం పాత పద్ధతులు ప్రారంభించాలని మనస్సు పీకసాగింది. ఇక్కడకు వచ్చి కిందటిసారి జరిగినదంతా జ్ఞాపకం తెచ్చుకుంటే తప్ప నా మనస్సుకి శక్తి కలగ దనిపించింది అందుకని వచ్చాను

అతను సిగరెట్ కాల్చడం పూర్తి చేసి సిగరెట్ పీక కాలికింద నొక్కిసి ఏదో నిశ్చయానికి వచ్చినట్లు ఆమె వంక తిరిగాడు

మీరు చెప్పినదాంట్లో కొంత నిజం వుంది చచ్చి సాధించేదేముంది ? మీరు రావడంవల్ల నా ప్లానంతా పాడైపోయింది నాకు వెంటనే చావాలని లేదు అన్నాడతను

చూడండీ నే నున్నానని మీరు మొహమాటపడొద్దు మీరు చెప్తే నేను మాట్లాడకుండా వుంటాను ఇంకొక రెండు నిమిషాల్లో సూర్యుడు అస్తమిస్తాడు మీ రేం చేసినా సరేకానీ నా మీద మాత్రం పూచీ వెయ్యొద్దు

అతను లేచి నిలబడి చుట్టూ చూశాడు

ఆమె కూడా నిలబడింది.

"చూడండి ... మీ రేవుద్దేశంతో యిక్కడికి వొచ్చినా నా ప్రాణం రక్షించారు. నాకూ దైవంలోనూ కర్మ మీదా నమ్మకముంది మీరు చెప్పింది నిజం ! పాపాలకి ఫలితం అనుభవించి చచ్చిపోతే ఫరవాలేదు. కానీ లేకపోతే ఈ సంచయం వెనువెంట వస్తూనే వుంటుంది. అదీ కాక, మిమ్మల్ని చూసేక ఎంత దుర

దృష్టం, ఎంత నికృష్టతా అనుభ వించినా మళ్ళీ జీవితంలో మంచి రోజులే వస్తాయన్న నమ్మకం కలిగింది. చాలా ధన్యవాదాలు. పదండి క్రిందకు పోదాం" అతని కళ్ళనుండి ఒకటో రెండో అశ్రుబిందువులు నెమ్మదిగా కిందకి జారేయి.

ఆమె బరువుగా నిట్టూర్చింది.

పదకొండవ అంతస్తులో రెండు నిమిషాలాగి వాళ్ళిద్దరూ లిఫ్టులో కిందకి వచ్చారు.

అప్పుడే ట్రామ్ వస్తూంది. అతను త్వరత్వరగా ఆమెకు నమస్కారం చేసి పరుగెత్తుకెళ్ళి ట్రామ్ ఎక్కి వెళ్ళిపోయాడు. ఆమె తొందరగా పది అడుగులు నడిచి అక్కడ పార్క్ చేసివున్న ఒక కారు తలుపు తెరచి లోపల కూర్చుంది. అప్పటికే లోపల వున్న ఆమె భర్త 'ఇరవై నిమిషాలనుంచీ చూస్తున్నాను. నా సిగరెట్లు కూడా దగ్గరుంచుకుని ఏం చేస్తున్నావ్?' అన్నాడు. అతనికి సిగరెట్ పాకెట్ ఇస్తూ బయల్దేరమని డ్రైవర్‌కి చెప్పి 'ఒక చిత్రమైన కథ జరిగిందండీ' అని జరిగినదంతా చెప్పడం ప్రారంభించింది.

* * *

అతను బాలీగంజ్‌లో ట్రామ్ దిగగానే ఒక స్నేహితుడు కనిపించాడు. "రా బ్రదర్, కాఫీ యిస్తాను. ఇందాకా సెక్రటేరియట్ టాప్ ఫ్లోర్ మీదకి వెడితే ఒక విచిత్రమైన కథ నిజంగా జరిగింది. నీకు చెప్పాలి" అని అతన్ని హోటల్‌కి లాక్కెళ్ళాడు.

***

---

సీతాకాలంలో, మంచి చలిరాత్రిలో కాలవలో దూకబోతున్న ఒక మనిషిని, దారినపోతున్న మరోమనిషి గట్టిగా పట్టుకొని ఇలా అన్నాడు—

"ఇప్పుడు నువ్వుగనక కాలవలో దూకితే, నిన్ను కాపాడటానికి నేనుదూకాలి. నిన్ను కాపాడి బయటికి వచ్చిన తరువాత, ఏ యాంబులెన్సో వచ్చేవరకూ మనమీ చలిలో జాగరణచేయాలి. రాత్రంతా చలిలో వుండటంవల్ల మనిద్దరికీ ఏ న్యూమోనియాయో వచ్చి చచ్చిపోవొచ్చు. నన్నుగూడా నీతోబాటు చంపేబదులు హాయిగా ఇంటికిపోయి వురేసుకో గూడదూ?"

— ప్రసాద్ వి. నాగేంద్ర

# మెత్తని దొంగ

## బలివాడ కాంతారావు

ఉమాపతి పేరుకు తగ్గ మనిషని నిరూపించుకున్నాడు. దుష్టులపై పరమశివుడు మూడో నేత్రం విప్పి భస్మం చేసినట్టే తను తన కలాన్ని త్రిప్పి నేరస్థుల్ని కఠినంగా శిక్షించి వేస్తున్నాడు. జుడీషియల్ మేజిస్ట్రేట్ గా వుండి, ఇల్లు, కోర్టు తప్పించి ఒక స్నేహం, విశ్రాంతి యెరుగని ఉమాపతి చివరకు రెండు నెలలు సెలవు తీసుకున్నాడు. లాయర్లు, కోర్టుపక్షులు, ఉద్యోగులు, సాక్షులు, నేరస్థులు తనకు చుట్టూ యినుప గజాలై యున్నాట్టూ తననే ఒక బందీని చేశారు. సెలవు అనే ఇంద్రజాలంతో ఈ జైలునుండి తప్పించుకుని తన మేనమామ వున్న పల్లెటూరికి ఏకాంతంగా ప్రయాణం కట్టాడు. భార్యను ఇద్దరి పిల్లలను రాజమండ్రి మామగారింటికి పంపించి వేశాడు.

ఈ పల్లెలో ఈ రెండు నెలలు హాయిగా గడపగలనని ఆ వాతావరణం చూసి నిర్ధారించుకున్నాడు. మేనమామ గ్రామపెద్ద వయసులో తనకంటె పదేళ్ళు పెద్ద. నలుగురు పిల్లల తండ్రైనా ఇంకా ఎక్కడా ఒక పండు వెంట్రుక లేదు. తన పెద తండ్రి కూడా ఈ వూరిలోనే వున్నాడు. అతను తన వ్యవసాయం, ఎనమండుగురి పిల్లల ప్రాభవం తప్పించి యింకెవరి జోలికి పోడు. వీళ్ళ ఇద్దరి చుట్టం తను.

ప్రొద్దు గ్రుంకి తూరుపు ఆకాశాన్ని నలుపు చేసినా ఆ నల్లని బొగ్గు గనినుంచి వజ్రాలు మెరుస్తున్నట్లు అక్కడక్కడ చుక్కలు పొడిచాయి. ఆ సమయంలో ఉమాపతి ఒక ఆడది ఆదేపనిగా తలచి తలచి యేడవడం విన్నాడు. ఓక్షణం కారణం అడుగకూడదని నిర్ధారించుకున్నా ఆ యేడుపుతో బాటు ఒక మగవాని మాటలు వినరాగానే ఆ రోదనకు కారణాన్ని మేనమామను అడిగాడు.

"అదా — ఒక మెత్తని దొంగ. మొగుడు విడాకు లివ్వడానికి రెడీగా వున్నాడు. తెచ్చి కన్నారింట్లో బలవంతాన ఈ వేళ



సాయంత్రమే దిగబెట్టాడు కా ఐం చెప్పుకున్నేమ కమ ?"

"ఆ మొగ గొంతుక యెవరిది?"

"వాడో మెత్తని గొంగ. ఎప్పుడూ నిషామీద వుంటాడు. ఇదొకర్తే కూతురు. పెళ్ళాం పోయి పదేళ్ళు దాటింది."

ఆ తండ్రి అన్నమాటలు విన్నాడు కాబట్టి దీని లోతుల్లోనికిపోతే, ఒక కేసు యిక్కడా మెదడులో అల్లుకు పోతుందని యింకేమీ అడగలేదు

అలవాటుపడిన మెదడు ఆ రాత్రి ఆలోచించకుండా వూరుకోలేదు ఆడవాళ్ళ నెందరినో బోనెక్కించి వాళ్ళ సాక్ష్యాన్ని ఇదివరకు రాసుకున్నాడు. ఆడదాని శీలానికి సంబంధించిన కేసుల వందలకొద్దీ తను పరీక్షించి తీర్పు చెప్పాక యిప్పుడు ఆడవాళ్ళంటే తనకో హేగు భావం యేర్పడింది. ఆడా మగా తన యెదరగా బొంకారు. ఆడది బొంకితే గోడ, మగాడు బొంకితే తడికేనన్న సామెతతో తనూ యేకీభవిస్తాడు.

ఆ యేడిసిన ఆడది యెలాంటిదో నన్న వూహ తనకు తెలియకుండానే నిద్ర వచ్చేసింది ఆ మరుసటి రోజు ఈ యింద ఉమాపతి పెదనాన్న దగ్గరకు ఒక యువకుడు వచ్చి ప్రాధేయపడుతున్నాడు. వాడికి రావలసిన అప్పును పొందలేక పోవడానికి కారణం వాడికి ఆస్తిపాస్తు లేమీ లేవు వాడికున్న ఆస్తి అంతా వాడి

భుజబలమే. గట్టిగావున్న కాళ్ళు చేతులతో గడించినది తన పొట్టకే సరిపోయేటప్పుడు వాడు అప్పు యెలా తీర్చగలడు?

'అంత బ్రతిమాలుతున్నాడు, మంచివాడిలా వున్నాడు కొంతలో కొంతైనా ఈయలేకపోయారా?' అక్కడేవున్న ఉమాపతి వాడు వెళ్ళాక పెదతండ్రితో అనగానే—

'వాడా! ఒక మెత్తని దొంగ. పొరుగూర్లో ఒక యెర్రగా బుర్రగా వున్న దానితో పొత్తు కుదుర్చుకుని... ఉన్న పెళ్ళానికి విడాకులివ్వడానికి సాహసిస్తున్నాడు. విడాకులివ్వాలంటే దాని తండ్రికి డబ్బివ్వాలి. ఆ పాపం ఈ అప్పిచ్చి నన్నొడిగట్టుకోమంటావా?'

ఆ ముందురోజు రాత్రి ఆ ఆడది యెందుకేడ్చిందో ఉమాపతికి అర్థమైంది. ఒక గ్రీకు వీరునిలా వున్న ఈ వ్యక్తివేపు పదేపదే చూడాలని తనకేమనసు పుడుతోంది. అలాంటప్పుడు ఆ తాళి కట్టించుకున్న ఆడది యెందుకు విడాకులకు ఒప్పుకుంటుంది?

ఉమాపతి రోజులా ఒంటిగా యేటిగట్టు వెంబడే సాయంత్రం నడిచాడు. కొంతదూరం పోయాక యేటి ఒడ్డునే వున్న జీడితోటలను దాటి సరుగుడు తోటల్లో పడ్డాడు. తోటలో నిల్చుని ఆకాశం వేపు చూస్తుంటే, చెట్లు చెదరిన తెల్లమేఘాలను అందుకున్నట్లేవున్నాయి. చిలకలు గుంపులుగా చెట్లపై యెగురుతూ అరుస్తున్నాయి. తోట బైటకు వస్తే ఇసుక పాన్పు యెదుట ప్రత్యక్షమైంది. ఆ పరుపు మీద హాయిగా దొర్లుతూ వినీలాకాశం క్రింద వేదనలేని బ్రతుకును చవి చూస్తున్నాడు.'

దగ్గరగా నాలుగు తాటిచెట్లు చతురస్రాకారంలో వుండి ఆ నాలుగు చెట్లనూ స్తంభాలుగా చేసి ఒక పాకను యెవరో కట్టారు. వర్షం పడినా యెండమండినా అందులో తల దాచుకోవచ్చు.

హెడన్సా


మూల వ్యాధులకు
ప్రతిచోట దొరుకును
DZ.982A TEL

ఇదివరలానే ఈ రోజూ ఉమాపతి ఒంటిగా ఆ ఇసుకమీద హాయిగా దొర్లుతున్నాడు రకరకాల పిట్టల కోలాహలం, గాలిలో సంగీతం వింటూ విశ్రాంతి తీసుకుంటున్నాడు. చప్పున అల్లంత దూరంలో ఒంటిగా వున్న జీడి చెట్టునించి యెండు పుల్లలు క్రిందికి పడుతున్నాయి. ఆ విరిచే తీరు, క్రిందికి విసిరేటప్పుడు కలిగే చప్పుడు లయతప్పని మద్దెల వాయింపులా వుంది. చప్పున ఒక యౌవని చెట్టుపైనించి క్రిందికి గెంతడం చూశాడు. గెంతిన ఆ ఆడది తన వునికిని గుర్తించకుండా జాకెట్టు దాయని యౌవనాన్ని ప్రకృతి అందంలో భాగమన్నట్లు వదలి, పుల్లలేరుకుంటోంది ఈ ప్రకృతి అందంలో లేని పూరింపేదో ఈమె అందంలో వుంది ప్రకృతి లాలింపు విశ్రమింపజేస్తున్న నరాలొక్కసారి లాగిన కళ్లాలై పరుగెత్తుతున్న పందెపు గుర్రంలా అయిపోయాడు. ఆ క్షణాల్లో తను న్యాయమూర్తి అన్న తలపే రాలేదు లేచి ఆమె దగ్గరగా వెళ్ళాడు ఆమె అతనిని చూడగానే చీరతో ఒళ్ళు కప్పుకుని పుల్లల బుట్ట నెత్తిన బెట్టుకుని గబగబ కదలిపోయింది

అక్కడ యెంతసేపో ఒంటరిగా వుండలేకపోయాడు కదలి మళ్ళీ తను రోజూ చేరుకునే టైమ్ కన్నా ముందుగానే మేనమామ ఇంటికి వెళ్ళాడు వెళ్ళేసరికి గ్రీకు వీరుడు ఉమాపతి మేనమామతో అప్పటికి యేం విన్నవించుకున్నాడో అతను "అలా త్రోవలోనికిరా" అనటం ఉమాపతి విన్నాడు. అక్కడి గందరగోళంలో జోక్యం చేసుకోకుండా పెదనాన్న ఇంటివేపు వస్తే ఇక్కడ సిమ్మయ్య ప్రాధేయపడ్తూ,

"తమరు అప్పిస్తే నా కూతురు బతుకు గంగలో కలుస్తాది. నా కూతురు సిక్కు ఆడు వదుల్చుకోవాలంటే నాలుగు వందలేనా, ఆడు తిన్న బంగారానికి, పెళ్ళి ఖర్చులకి ఇచ్చుకోవాలి. ఎక్కడనించి తెస్తాడు? అదా — ఆడ్ని తప్ప ఇంకొకడిని కన్నెత్తి సూడనంటోంది."

"నీ కూతురి తప్పు లేకుండా వదిలేస్తాడ ?" అందుకున్నాడు ఉమాపతి అనుకోకుండా.

"తమరు గద్దెమీదుండి తీర్పు సెప్పిన మారాజులు. ఇనండి నా మనవి. నా కూతురు కాపరానికి యెళ్ళి మూడు ఏంటులైనాది. దాని కడుపు పండలేదంటే అదప్పుడే ముసలైనాదా? ముదుగైనాదా? అది నలుగిరిలో కలివిడిగా వుంటాది. ఇష్టంలేకపోతే యిలవైన వజ్రాన్ని గాజుపెంకు అంటారు మా అల్లుడు లాంటోళ్ళు"

ఉమాపతి వచ్చిన వారం రోజులకే మేనమామ, పెదతండ్రి రెండు వేపులా పరోక్షంగా కాసు, తన మనసులో ఒకరిపై ఇంకొకరికి వున్న ఈర్ష్యను పైకి పొక్కకుండా

లోలోనే పండించుకుంటున్నారని పోల్చుకున్నాము.

నెల రోజులలో మేనమామ తలుచుకున్నది చేశాడు. అతని గురించి తను చాలా తెలుసుకున్నాడు. నాలుగు రకాల చేతి వ్రాతలతో డాక్యుమెంట్లు రాయగల నేర్పరి ఈ మేనమామ మధుసూదనం. రెండు చేతులూ రెండు కాళ్ళూ పెన్నునుపటి రాయగలడు. అతనివద్ద ఎంత పంచాంగాలు జ్యోతిష్కునివద్ద దొరికినట్లు, ఇంకా వైయేళ్ళ పాత తెల్ల కాగితాలు, ఖాళీ స్టా వేజలూ దొరుకుతాయట!

ఇలాంటి మధుసూదనం యెల్లప్పుడూ జగడమాడే భార్యను పొందాడు ఎందుకు భార్యాభర్తలు జగడం ఆడుకుంటారో తనకు అంతు చిక్కలేదు ఎవరూ చెప్పరు. ఎవరి దగ్గరకూ తీర్పుకు వెళ్ళరు. బయటపడితే ఈ కేసును తప్పక విచారించాలన్న భ్రాంతితో ఉన్న ఉమా




పతికి అలాంటి అవకాశం నెల దాటినా దొరకలేదు.

ఈలోగా తను రోజూ ఒంటరిగా షికారు తన నిర్ణీత స్థానానికి వెడుతున్నాడు. ఇన్నాళ్ళూ యెదురు చూస్తూ వున్నాడు. వయసులో ఉప్పొంగిన వూహాలు కొట్టులో కూర్చునే వయసూ వ్యాపకం చంపుకున్నాడు. కానీ అవి, మట్టిలో దాగున్న దుప నీరు పడ్డాక మొక్క మొలచినట్లు ఇప్పుడు ఈ యవ్వనిని యేకాంతంగా చూడగానే మొలిచాయి. భార్య చక్కని దేహాన్ని, చలిలో వెచ్చదనం మగాడికి ప్రసాదించగల శరీర పు సంపు లామెకు లేవు. అవ్వను పట్టుకుని వసంత మాడినంత అధ్వాన్నంగా లేకపోయినా, ఇప్పుడిప్పుడే వసంతం ఆడడానికి వయసుకత్తెను కనుగొన్నట్లు భ్రాంతి జెంది యెల్ల వేళల లోను ఆమె గురించే ఆలోచిస్తున్నాడు. తను చూస్తుండగానే పదిమంది పెద్దలు చేరి విడాకుల పత్రం రాయించేశారు. గ్రీకు వీరునికి డబ్బెక్కడిదీ?

"మామా నువ్వు గాని డబ్బిచ్చావా?" అడిగాడు ఉమాపతి.

"అంత తెలివి తక్కువ వాడిని కాదు."

"అయితే ఎక్కడినించి వచ్చింది?"

"ఆ గాథ అంతా వింటావా?"

"చెప్పు."

"వీళ్ళు ముగ్గురు అన్నదమ్ములు. వీడు చిన్నప్పుడే ఈ వూరు పెంపకానికి యే రాతా గీతా లేకండా వచ్చేశాడు. వీడి పెద్దమ్మ వీడిని పెంచి పెళ్ళిచేసి, చచ్చింది. ఒక సెంటు భూమిగాని, నగదుగాని లేదు. పెళ్ళాం పోకులాడి. కిలాడి. ఇక్కడా అక్కడా గడ్డి నములుతుందని విన్నాను. పైకి పతివ్రతలా కనిపిస్తుందిలే. కాని మెత్త మెత్తగా అన్ని పనులూ చేసేస్తుంది. దానికి తోడు వయస్సు తెచ్చిన ఒంపులు యెక్కడా చెక్కు చెదరేదు. వాడికి కాలంలో పడిన విత్తనం లా కాలంలో పుట్టిన కొడుకు కావాలి. దీనితో తెగతెంపులు చేసుకోడానికి కావలసిన డబ్బు వీడిదగ్గర లేదు. పెద్ద మనుషులను తీసుకు వెళ్ళి నా వంతు నాకివ్వండని అన్నదమ్ముల దగ్గరకు వెళ్ళాడు. ఆరు మైళ్ళ దూరంలో వున్న వాళ్ళు ఇక్కడికి వినిపించినట్లు లేదని పొమ్మన్నారు. అప్పుడు వాడికి నేనే గతయ్యాను. ఆ వూరు కరణాన్ని పట్టుకున్నాను. మేం ఒక సెటిల్‌మెంట్‌కు వచ్చాం. కరణం చేతిలో వాళ్ళున్నారు. మేం పాపర్‌దావా వేస్తున్నామని నోటీసు ఇచ్చాం. వాళ్ళు ఆ నోటీసును ఆ కరణం దగ్గరకే తీసుకువెళ్ళారు. అతను వాళ్ళ ప్రక్కన వున్నట్లేవుండి చివరకు జడిపించగానే ఒక సెటిల్‌మెంట్‌కు వచ్చేశారు. ఆ డబ్బు విడాకుల ఖర్చులివ్వగా వాడు పెళ్ళి చేసుకోడానికి సరిపోతుంది."

సిమ్మయ్య తప్పత్రాగి చాలా రాత్రివరకూ నానా తిట్లూ తిట్టు న్నాడు. ఆ తిట్లమధ్య కూతురికి ఒక దేవుడిలాటోడికి తెచ్చి కట్టబెట్టా నని హామీ ఇస్తున్నాడు. కూతురు కడుపు పండించేవాడు మొగుడుగా రాణ సికి వుంటే, ఈ మీసాల్లే నోడి గురించి యెందు కేడుస్తావని కూతుర్ని ఓదారుస్తున్నాడు. ఇలాంటి ఓదార్పులు రెండు రాత్రిళ్ళు విన్నాడు. మూడో రోజునుంచీ రాత్రింబగళ్ళు వింటున్నాడు

విడాకులిచ్చిన వారం నాడు గ్రీకు వీరుడు పెళ్ళి ప్రయత్నంలో వున్నాడు. తన జిత్తులమారి తనంతో ఆస్తిలో భాగాన్ని సంపాదించి




యిచ్చిన కట్నం తపసంతు వందా రూపాయలు తీసుకుపోయాడు. ఈ పూరి పెద్ద యెంత తిన్నాడో బయట పడలేదు. కానీ యింట్లో భార్యా భర్తలకి హోరాహోరీ పైకిపొక్కని పోరాటం సాగుతోంది. ఇంట్లో వున్న ఉమాపతి అవకాశం కోసం కాసుకుని కూర్చున్నాడు. చివరకు ఓర్చలేని మగాడు ఒక్కసారి విజృంభించి పెళ్ళాం మీద "నన్ను భర్తనని జడిపించక – భర్తే చావు" అని అరచి వీధిలోనికి పోయాడు. దగ్గరనేవున్న ఉమాపతి మెల్లగా మేనమామ భార్య దగ్గరగా వెళ్ళి "ఎందుకంత పెద్ద మాటలు మామయ్య నోట వస్తున్నాయ్?"

ఆమె ఆవేశంతో తల కొట్టుకుంటూ–

"నా ఖర్మ ... ఖర్మ"

"జగడానికి కారణం వినకూడదా?"

"మీరైనా కాస్త బుద్ధి చెప్పండి. రేపో నేడో కూతురి బిడ్డను యెత్తుకోబోతున్నా ఈ పాడు బుద్ధు లింకా వదలకపోతే యెలా?"

"మామయ్యలో పాడుబుద్ధులా?"

"అది కాదన్నాదని పంతంపట్టి దాని విడాకులు రాయించారు. ఇలాంటి పాపాలు పదిచేస్తే చివరకు అడుక్కుతినమండీ?"

ఉమాపతికి అంతా అర్థమైపోయింది. ఆ అది అన్న ఆడదానిని

నానా రూపాలతో వూహించు కుంటున్నాడుగానీ ఈ నాటికీ ఆమె ముఖం చూడలేదు. తన సెలవులు ఆఖరౌతున్నాయి. ఆమెను చూడాలని తనకు మనసున్నా, తను అడిగి చూడగలిగినా, చూడగలిగే అవకాశాలు కలిగినా, ఆమెను చూడకండా వుండటానికే నిర్ధారించుకున్నాడు. రేపు బయలుదేరి వెళ్ళిపోతాడనగా మామూలుగా ఈ వేళ సాయంత్రం ఏకాంతంగా షికారుకు వెళ్తున్నాడు. ఏటి ఒడ్డున వున్నప్పుడే ఓ కోరా మేళం వినిపించింది. కనుక్కునే అవసరం లేకండానే తాగుడు మైకంలో వున్న సిమ్మయ్య అగపడి ఉమాపతిని ఆపి,

"ఆ యెదవ పెళ్ళి సేసుకుంటున్నాడు."

"నీ కూతురికెప్పుడు పెళ్ళి చేస్తావ్?"

"పెళ్లా? డబ్బుండాలా?"

"వాడు పెళ్ళికి డబ్బిచ్చాడుగా!"

సిమ్మయ్య పకపకా నవ్వుతూ "ఆ డబ్బా..? పెళ్లికి సరిపడ్డ డబ్బా అది..? యెదవడబ్బు. నా తాగుడికే సాల్లేదు" అనుకుంటూ వీధిలోనికి వెళ్ళిపోయాడు.

ఉమాపతి తలవంచుకుని మళ్ళీ ముందుకు సాగాడు. ఓడితోటలు, సరుగుడు తోటలుదాటి ఇసుక పాన్పుపై కూర్చున్నాడు. ఈ సిమ్మయ్య కూతురి కేసే తన దగ్గ




రకు తీర్పుకు వస్తే ఈ నిజాలు బయటపడవు ఈ కాకులు కోర్టుకురారు అనుకున్నాడు.

ఆకసంలో కదులుతున్న మేఘం నించి గబగబ వాన జల్లు కురవగానే లేచి ఆ టిచెట్లకు కట్టిన పాక లోనికి వెళ్ళాడు. వర్షం కొద్ది క్షణాల్లో మాయమై పోయింది. చల్లనిగాలి వీస్తుంటే మౌనంగా ఆ పాకలో ముకుళించి కూర్చుని యిదివరకు తను చూసిన చెట్టు వేపు చూస్తూ ఆ అందాన్ని ఊహిస్తూ నరాలను పొంగించుకుంటున్నాడు. ఇంతలో దివినుండి భువికి అమాంతంగా దిగిన గంధర్వాంగనలా తన ఊహలోని కాంత ఆ చెట్టు క్రిందికి రావటం కనిపించింది. అది ఊహ కాదు. నిజమని నిర్ధారించుకోడానికి కొంత సమయం పట్టింది. ఆమెను

తను చూడగలదు అక్కడినించి ఆమె తనను చూడలేదు అతని శరీరమంతా అగ్నిజ్వాలలు మండుతు పోతున్నాయి చుస్తూ చూశాడు ఆమె తప్పించి యింకెవ్వరూ లేరు అరుస్తున్న పిట్టలు అగపడలేదు ఆకులైనా ఉల్లల్లాడలేదు అంతా భయంకర నిశ్శబ్దం

ఆమె బుట్టతో తెచ్చిన పరుగుడు తొక్కను అగ్గిపుల్ల వెలిగించి ముట్టించింది బహుశః చలి కాచుకోడానికేమోనని అనుకున్నాడు. ఆమె అందం యెక్కడ యెగిరి ప్రకృతిలో కలిసిపోతుందేమోనన్నట్లు చీరతో ఒళ్ళంతా కప్పుకుంది మండుతున్న మంట మీద మరికాస్త తొక్కు వేసింది మంటలు చెట్టుకు తగిలేటట్లు లేచాయి

ఆత్రుతతో కంటి రెప్ప వెయ్యని ఉమాపతి గుడిసెనుండి ఒక్క గెంతు వేసి, ఆమెను గట్టిగా బాహువుల్లో బంధించి, కుడి కాలితో ఆమె ముట్టించుకున్న చీరకొంగు మంటను ఇసుకత్రోసి ఆర్పుతున్నాడు ఆమె అతని బాహుబంధాలనించి విడిపించుకోడానికి గింజుకుంటున్నా ఆ చలిలో ఆ వెచ్చని కౌగిలిని వదలించుకునే అమాయకుడు కాలేదు కాస్సేపటికి పెనుగులాటతో ఇద్దరూ మంటకు దూరంగా దొర్లుతున్నారు

చివరికి ఆమె అతని చేతిపై ఒక కాటు వేసింది ఐనా అతని భల్లూకపు పట్టునించి విడిపించుకునేసరికి ఆమె శరీరమంతా పూర్తిగా నలిగిపోయింది

ఆమె అలసిపోయి బుస కొట్టోంది ఆ బుస మాటలురాక యేడుపుగా మారింది పరుగుడు తొక్కుమంట ఆరిపోయింది గానీ ఇంకా ఉమాపతి కాం జ్వాల చల్లారలేదు ఆమె యేడుస్తూనే —

"నన్ను సావనియ్య నేను సచ్చాక - యేం చేసినా చూడొచ్చానా ?"

"ఎందుకు చస్తున్నావ్ ?" ఎలాగో వణుకుతూ అడిగాడు

"ఆకిని తప్పించి కల్లోనైనా ఇంకో మొగాడ్ని కోరలేదు. అనుమానించాడు అవమానం సేసినాడు ఈ యేళ ఇంకోదాన్ని పెళ్ళాడుతున్నాడు నన్ను ఈ అగ్గిలో వురకనీ"

* * *

తిరిగి వచ్చిన ఉమాపతి వేసిన శిక్షల్లో అంత కాఠిన్యం కనిపించటం లేదని ఆ కోర్టుతో సంబంధంవున్న వాళ్ళంతా అనుకున్నారు

***

# ప్రముఖుల




"ప్యారడైస్‌లాస్ట్" వ్రాసి గొప్ప కీర్తిని సంపాదించుకున్న మిల్టన్ చిన్నప్పటినుండి చమత్కారంగా మాట్లాడేవారట. వారు 9-10 ఏళ్ళ వయసులో ఉన్నప్పుడువారు చదువుకునే పాఠశాలకు ఒక గొప్ప చర్చిడిగ్నిటరీ వచ్చాడు. ఆయన బడిలోని ప్రతి తరగతులను పరీక్షిస్తూ చివరకు మిల్టన్ ఉన్న తరగతికి వచ్చాడు. పిల్లలను పరీక్షించాలని వారు ప్రశ్న లడిగారు. ఎవరూ సరియైన సమాధానాలు చెప్పలేక పోయారు. మిల్టన్ ఒక్కడే సరియైన సమాధానాలు చెప్పాడు. అతని జవాబులు విన్న చర్చి డిగ్నిటరీ ఆశ్చర్యపోయాడు. మిల్టన్‌ను ఎలాగైనా చీకాకు పరచాలని చివరకు ఒక ప్రశ్న ఇలా అడిగాడు -

'అబ్బాయీ! భగవంతుడెక్కడ ఉన్నాడో తెలుపుతావా? దీనికి సరియైన సమాధానం చెపితే ఒక యాపిల్ ఇస్తాను.'

మిల్టన్ తొట్రుపాటు పడక నిదానంగా ఇలా అన్నాడు-

'సర్! భగవంతుడు లేనిదెక్కడో చూపిస్తే మీకు రెండు యాపిల్స్ ఇస్తాను' అని.



— సి. నాగేశ్వరరావు —



శామ్యూల్ మార్స్ ప్రసిద్ధిపొందిన టెలిగ్రాఫ్ నిర్మాత ఇతడు మొదట చిత్రకారుడు ఒకసారి అతడు ఒక మరణిస్తున్న మనిషి చిత్రాన్ని చిత్రించాడు. దానిని తన మిత్రుడైన డాక్టరు దగ్గరకు తీసుకుని వెళ్ళి ఆ చిత్రాన్ని చూపించి అతని అభిప్రాయ మడిగాడు. ఆ డాక్టరు నిదానంగా, ధ్యానంతో దానిని పరిశీలించిన తరువాత ఇలా అన్నాడు—

"ప్చ్. మలేరియా."



షౌకత్ థాన్వీ ప్రసిద్ధి పొందిన ఉర్దూ కవి. ఒకసారి వారు ఒక కవి సమ్మేళనములో పాల్గొన్నారు. పొడుగాటి గడ్డంతో నల్లగా వున్న 'భుజంగ అన్వరీ సాబరీదేవ్' తమ ఘజల్‌ను వినిపించేటప్పుడు ఒక ఫొటోగ్రాఫర్ అతని ఫొటో తీయడానికి ఉద్యుక్తుడయ్యాడు.

సాబరీదేవ్ బందీ,ఘజల్ పాడటం విడిచిపెట్టి ఇలా అన్నాడు "నా ఫొటో తీసుకుని ఏం చేస్తారు?" అని.

షౌకత్ థాన్వీ వెంటనే ఇలా అన్నారు "పిల్లల్ని భయపెట్టడానికి ఇది పనికొస్తుంది.



ఐన్‌స్టీన్ జేబులో మూడు కళ్ళజోడులు ఉండటం చూసి ఒకమిత్రుడు కారణ మడిగాడు. ఐన్‌స్టీన్ దానికి సమాధానంగా ఈ జవాబిచ్చాడు. "ఒకటి దూరపు చూపు చూడడానికి రెండవది దగ్గరి వస్తువులను చూడడానికి. మూడవది ఈ రెండు కళ్ళజోడులను వెదకడానికి. ***

# ఆదర్శమైన పొరుగు

పార్వతి అలసిపోయింది. దాన్లో ఆశ్చర్యంలేదు. అది మామూలే! కాని మామూలుగాని ఒక రకం స్తబ్దత ఆవరించింది పార్వతి మనస్సుని కృష్ణమూర్తికి పరస్తుతి ఎక్కువయినకొద్దీ పార్వతికి ఆత్మనింద ఎక్కువవుతుంది. ఈ మధ్య ఇదే జరుగుతోంది. భర్తనీ పిల్లలనీ అపరిమితంగా ప్రేమించింది. 'దాని ఫలితమేనా ఇది? ... అనుకుంటూ దారి కడ్డుగా పడివున్న కుర్రకుర్చీ, సైకిలు, కాగితాలు, పెన్సిళ్ళు, పాత గుడ్డలు ... అన్నీ ఒకటొకటే తీసి వాటి వాటి స్థానంలో పెట్టింది పార్వతి. కాస్సేపు అమ్మదగ్గర కూర్చుని రావాలి అనుకుంది. 'ఈ ఇంట్లో వాళ్ళు నన్నేం అనుకుంటున్నారో – అతి నేర్పుగా వంటచేసి తమ సదుపాయాలు చూసే మర మనిషి అనుకుంటున్నారేమో' అని వింతపడింది.

వీధి తలుపు గడియవేసి తాళం వేసింది. మెట్లుదిగి గేటు దాటింది. వీధిలోకి వస్తూనే పక్కింటికేసి ఒకసారి చూసింది. అలా ఎప్పుడు చూసినా పార్వతి మనసు కించపడుతుంది. చక్కని చిన్నతోట పెంచింది పక్కింటి సుభద్రగారు. బారులు తీరిన పూలమొక్కలు చక్కగా పూసి ఎంతో అందంగా ఉన్నాయి. ఎప్పుడూ కృష్ణమూర్తి అంటూ ఉంటాడు. అదదే అయినా తోట చూడు ఎంత అందంగా ఉంటుందో' అని. శని ఆది వారాలలో తోటలో ఎండిన పూవులు కోసిపారేసే సుభద్రగారి నేర్పు పార్వతికి తెలియనిదికాదు. వారం పొడుగునా తోటవాడు పని చేస్తాడు అని కృష్ణమూర్తికి చెప్పాలనుకుని ఊరుకుంది పార్వతి.

——— కె. రామలక్ష్మి ———

పార్వతి కా తోట పని బాధే లేదు. పెరట్లో పువ్వుల మొక్క నేదీ తలెత్తదు. ఒకవేళ ఏదైనా మొక్క వచ్చినా దాని వేళ్ళు ఎలా ఉన్నాయో పీకి చూసి తీరతాడు నానిగాడు. రోజూ వాడి కదేపని. పక్కింటి సుభద్రగారికి పెళ్ళి అయిందో లేదో తెలియదు ఒంటరిగానే ఉంటుంది. ఏపి ఉద్యోగం చేస్తున్నట్టు కూడా లేదు. కాని బయటికి వెళ్ళి వస్తూనే ఉంటుంది

పక్కింటి తోటకేసి చూసి మనసులోనే ఉసూరుమన్నా, పార్వతి బస్సుస్టాండు దగ్గిరికి వచ్చేసరికి మామూలు స్థితికి వచ్చింది. బస్సు కోసం సుభద్రగారు కూడా నిలబడి వుంది. అక్కడ అప్సర్సలా నిలబడిన సుభద్రగారిని చూసి 'కొంచెం మంచి చీర కట్టుకుని ఉండవలసింది నేను కూడా' అనుకుంది పార్వతి

"ఏమిటీ మీరూ బయలుదేరారు?" ఆశ్చర్యంగా అడిగింది సుభద్రగారు.

"అమ్మ ఇంటికని" నెమ్మదిగా అంది పార్వతి.

"నేనలా బాలమందిర్‌లో పిల్లల్ని చూసివద్దాం అని బయలుదేరాను. అబ్బ! ఎంత ముద్దొస్తుంటారండీ" అంది సుభధ్రగారు

"పిల్లలంటే అంత ఇష్టమైతే తన కుటుంబమే విస్తరించుకోవచ్చుగా" అనుకుంది పార్వతి.

"మిమ్మల్ని చూస్తూంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇంట్లో క్షణం విశ్రాంతి ఉండదనుకుంటాను" సానుభూతి ప్రకటించింది.

"ఉండకేం ఉంటూనే ఉంటుంది. అయినా విశ్రాంతి ఏం చేసుకుంటాను?" అంది పార్వతి.

"అదేమిటి సంఘసేవ చేయవచ్చుగా" నవ్వుతూ అంది సుభద్రగారు.

పార్వతి ఆ క్షణంలో తన భర్తని పిల్లలని జ్ఞాపకం తెచ్చుకుంది. ఒక్క క్షణం తను లేకపోతే ఇల్లు తల్లకిందులై పోతుంది ఎక్కడ పని అక్కడే ఆగిపోతుంది అంతేకాదు. అందరూ తనమీద విరుచుకుపడతారు! తనకి తెలియకుండానే పార్వతి నిట్టూర్చింది.

సుభద్రగారు మాట కలపకపోతే అలాగే తన ఆలోచనలలో పడిపోయేదే పార్వతి.

"రేపురాత్రి మీరు, మీ ఆయనా మా ఇంటికి భోజనానికి రావాలి" అంది సుభద్రగారు.

"ఏమిటి విశేషం?" నవ్వుతూ అడిగింది పార్వతి.

"ఏదైనా విశేషం లేకుంటే రారా? సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేద్దాం" అంది సుభద్రగారు.

"చెప్తాను" అంది పార్వతి.

"చెప్పడంకాదు. రావడమే



అదిగో వచ్చేది నా బస్సే' అంటూ బస్సుకోసం ముందుకి సాగింది సుభద్రగారు. ఆవిడకి అందరూ దారి విడిచారు. సుఖంగా బస్సు ఎక్కేసింది.

పార్వతి క్లాస్సేపు తల్లితో కబుర్లు చెప్పి బాబీని స్కూలునుంచి తీసుకుని ఇంటికి వచ్చేసింది. ఆ రాత్రి భోజనాలు అయిపోయాయి. కృష్ణమూర్తి సిగరెట్ కాలుస్తూ పేపరు చూసకుంటున్నాడు మధ్యలో పార్వతి తమలపాకులు చిలకలు చుట్టి నోటికి అందిస్తోంది.

'రేపు రాత్రి మన, ఎక్కడికి వెడుతున్నామో ఊహించు చూద్దాం' అంది కృష్ణమూర్తితో.

'వెడుతున్నామా? ఎక్కడికి? నాకు క్లబ్బులో బ్రిడ్జి ఉంది.'

'అయ్యో అలా అంటే ఎలా? వస్తామని చెప్పానే' చిన్నబుచ్చుకుంటూ అంది పార్వతి.

'ఏమిటీ గొడవ? గత పదేళ్ళలో ఒక్కరోజుకూడా నువ్వు అయ్యో అనడం వినలేదు నేను' అన్నాడు కృష్ణమూర్తి.

'టైము లేక పోయింది! పిల్లల్ని కనడానికీ పెంచడానికీ సరిపోయింది. అంచేత నీ క్లబ్బు కార్యక్రమాల వివరాలు తెలుసుకో లేక పోయాను!' వ్యంగ్యంగా అంది పార్వతి. సిగరెట్ క్రిందపారేసి భార్యకేసి వింతగా చూశాడు కృష్ణమూర్తి. 'ఇప్పుడేమైంది? ఇద్దరూ స్కూల్‌కి వెళ్ళిపోతున్నారుగా?' అనునయంగా అన్నాడు.

'బాబిగాడు సరిగ్గా మూడు గంటలు ఉంటాడు స్కూల్లో. మూడున్నర అయేసరికి నానిగాడు వస్తాడు. వాళ్ళ గోల భరించడానికి ఒక రోజుకి వారం రోజుల శక్తి కావాలి' అంది పార్వతి.

కృష్ణమూర్తి సన్నగా నవ్వుకున్నాడు. నానిగాడు నా పోలిక. వాడి ఘనత వినడానికి ప్రేక్షకులు కావాలి. నువ్వు వాడి ముఖ్య అతిథివి' అన్నాడు.

'పోనీలే ఎక్కడికి వెళ్ళాలని... చెప్పు' అడిగాడు.

'పక్కింటి సుభద్రగారు భోజనానికి పిలిచారు' సగం ఉత్సాహం చచ్చిపోగా అంది పార్వతి.

'ఆ—నైన్ గాల్!' అన్నాడు కృష్ణమూర్తి.

'గాల్. నా ముఖం. నిరభ్యంతరంగా నా వయస్సు వుంటుంది ఆ పిల్లగారికి!' అంది ఘాటుగా.

'పాపం. ఒకర్తెకే ఏం తోచడం లేదు కాబోలు. అలాగే వెడదాం' అన్నాడు పేపరులో తలదూర్చేస్తూ.

దగ్గరలో ఏం దొరికితే అది ఆ క్షణంలో కృష్ణమూర్తిమీదికి విసరా

అన్నంత కోపం వచ్చింది పార్వతికి. గట్టిగా అరవాలనిపించింది. కాని అదేం చేయలేదు. 'అంత తోచకుండా లేదు లే. కాలక్షేపానికి సంఘసేవలాంటిది చేస్తూ ఉంటుందట. మరినీ కబుర్లు మాటు?' అడిగింది పార్వతి. "ఆ బురంపుణాను లే. ఇంకో పార్ట్‌నర్‌ని చూసుకుంటాడు" అన్నాడు కృష్ణమూర్తి. "ఈ రోజు బస్సులో కనిపించింది" అన్నాడు. "రేపు రాత్రికి కొత్తచీర కొని వుంటుంది?" హేళనగా అంది పార్వతి. "మంచి చలాకీ అయిన వ్యక్తి. ఎంత జాగ్రత్తగా డ్రస్ చేసుకుంటుందో చూశావా?" సీరియస్‌గానే అన్నాడు కృష్ణమూర్తి. దాంతో వచ్చింది అసలు చిక్కు.

ఎదుటి స్త్రీని అంత పొగిడితే ఎంత భార్య అయితేమటుకు ఎంత కాలం భరిస్తుంది? విందుకు వెళ్ళినప్పుడు ఎలాగైనా సరే సుభద్ర గారిని తలదన్నాలని నిశ్చయించుకొంది పార్వతి.

రాత్రి పిల్లలకి ఇట్టే నిద్రపట్టేసింది–పార్వతి లాలిపాటతో.

పార్వతి మెదడు పరిపరి విధాల ఆలోచనలు చేస్తూంది. తనూ ఏమైనా చేస్తే తప్పించి లాభంలేదు అనుకుంది. పెట్లో డబ్బుంది. కాని దాని కెంతో అవసరం వుంది. కుర్రాళ్ళకి గుడ్డలు కుట్టించాలి. నానిగాడికి బూట్లు కొనాలి. మధ్యలో పుట్టిన రోజులు వస్తాయి. డాక్టరు అవసరాలు వస్తాయి... కాని పార్వతి చెవుల్లో కృష్ణమూర్తి మాటలే మార్మోగుతున్నాయి. 'ఎంత జాగ్రత్తగా డ్రస్సు చేసుకుంటుందో చూశావా?' అన్న అతని మాట ములుకులా పార్వతి హృదయాన్ని తొలిచింది. 'ఖర్చులు ఉండనీ. వాటి గొడవెందుకు?' అని నిశ్చయించుకుంది. 'తెల్లవారనీ' అనుకుని తృప్తిగా నిద్రపోయింది.

మరునాటి ఉదయం పెందరాడే లేచింది పార్వతి. చాలా సింపుల్‌గా చేసి అయిందనిపించింది వంట.

'ఏమిటీ ఒకటే హడావిడిగా ఉన్నావు?' వేళాకోళంచేస్తూ భార్య బుగ్గమీద చిటికె వేశాడు కృష్ణమూర్తి.

"నేను బజారుకి వెడుతున్నాను" క్లుప్తంగా సమాధానం చెప్పింది పార్వతి.

భర్త ఆఫీసుకీ, పిల్లలు స్కూల్‌కీ వెళ్ళారు పదిగంటలకల్లా వీధితలుపు తాళం వేసింది పార్వతి. తిన్నగా "వర్ణాలి"కి వెళ్ళింది. చక్కని జరీ చీర కొంది. కొనుక్కి బస్సు ఎక్కింది. చక్కని సవరం కొంది. ఎన్నాళ్ళనుంచో ఉందా కోరిక – పొడుగ్గా వాలు జడ వేసుకోవాలని. కాని ధైర్యం చేయలేక పోయింది కాని ఈ రోజుకి – కావలసిన తెగింపు వచ్చింది.

సాయంత్రం పిల్లలు ఇంటికి వచ్చాక వాళ్ళకి భోజనాలు సిద్ధం చేసింది. నూకాలుని వాళ్ళకి సాయం వుండమంది. నూకాలు ఉట్టినే కూర్చోదు. చక్కగా మల్లెలు, దవనం కలిపి దండ కట్టింది పార్వతికోసం. అందంగా తల దువ్వి వాలుజడ వెనకని మాలపెట్టుకుంది. కొత్త చీర కట్టి తగిన పొట్టిచేతుల రవికె తొడిగింది. కళ్ళకు కాటుక దిద్దింది. అందంగా తయారై కృష్ణమూర్తి కోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

తండ్రి కారు చప్పుడు కాగానే వీధిలోకి పరుగెత్తారు నానిగాడూ బాబిగాడూ. 'న్నారూ, అమ్మ కొత్తమ్మ' అన్నాడు బాబిగాడు. 'ఔనునాన్నా బ్యూటీఫుల్ గా ఉంది' అన్నాడు నానిగాడు. 'అలా గా చూద్దాం' అంటూ లోపలికి వచ్చాడు కృష్ణమూర్తి. కుర్రవాళ్ళు ఆటలో పడిపోయారు. పార్వతి పడగ్గదిలో అద్దంముందు కూర్చుని చూసుకుంటోంది. 'పార్వతీ' అంటూ లోపలికి అడుగుపెట్టి అలాగే నిలబడిపోయాడు కృష్ణమూర్తి. పోకిరీ కుర్రవాడిలాగా ఒక ఈలవేసి భార్య దగ్గరకి వచ్చాడు.


ఐటెక్స్

సౌందర్యానికి సహాయకారులు



★ ఐటెక్స్ కాటుక
పసిపిల్లలకు కూడా చాలా మంచిది

★ ఐటెక్స్ బిందీ
కంటికింపైన రంగులలో లభించును.

★ ఐటెక్స్ కుంకుం పేస్టు




అరవింద్ లేబొరేటరీస్,
పి. బి. 1415 — మద్రాసు — 17.

పార్వతి ఎంత అందంగా తయారైందో మనసులో అంత బాధపడుతోంది. కృష్ణమూర్తి ఈ పొగడ్తతో కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. నీరు కమ్మిన కళ్ళతో కృష్ణమూర్తికేసి చూసింది భార్యని చేతులలోకి తీసుకుని గుండెలకదుముకున్నాడు కృష్ణమూర్తి. ఎప్పుడూ నిశ్చలంగా నిజాన్ని చాటిచెప్పే ఆమె కళ్ళలోకి సమాధానం కోసమో అన్నట్టు చూశాడు.

దృష్టి పక్కకి మళ్ళించుకుంటూ అంది పార్వతి "నువ్వు అస్తమానూ అంటూనే ఉన్నావు. ఎంత అందంగా డ్రెస్ చేసుకుందో అంటూ ... నే భరించలేక పోయానుకాబోలు... ఈవేళ ఒళ్ళు తెలియలేదు..." నవ్వుకుంటూ నిజం చెప్పేసింది పార్వతి.

"పార్వతీ నవ్వెంత అందంగా ఉన్నావోయ్" పెదవులపై మృదువుగా ముద్దుపెట్టుకున్నాడు.

"ఉన్న డబ్బంతా ఖర్చుచేశాను" అంది పార్వతి నీరసంగా.

"మంచిపని చేశావు. నేనూ కొంత ఖర్చుచేసి – ఈ చీరకి కాదు – నీకుతగ్గ ఓ నెక్లెస్ తెచ్చాను" జేబులోంచి పల్చని పెట్టెతీశాడు కృష్ణమూర్తి.

"ఎందుకలా చేశావు?" అంటూనే అతని గుండెల్లో తలదాచుకుంది పార్వతి.

"అందులో స్వార్థం లేకపోలేదు... అయితే ఒక సంగతి..." ఆగాడు కృష్ణమూర్తి.

"ఏమిటి?" ఆత్రంగా అతని ముఖంలోకి చూసింది పార్వతి.

"ఈ రాత్రికి సుభద్ర గారిని మరుగున పడేయడం అయితే నీ చిన్నజడ నువ్వు వేసేసుకుంటావా?"

"పెద్దజడ ఆడవాళ్ళకి అందం అంటారుగా" వస్తున్న నవ్వు ఆపుకొంటూ అంది పార్వతి.

"గొర్రె తోకలా ఉన్నా నాకు నీ పొట్టిజడే ఇష్టం."

భార్య మెడలో తెచ్చిన నెక్లెస్ పెడుతూ తెల్లని కంఠాన్ని ముద్దు పెట్టుకున్నాడు కృష్ణమూర్తి. "నా కళ్ళకి నువ్వెలా వున్నా అందంగా వుంటావు పార్వతీ ఈ సంగతి ఎప్పుడేనా చెప్పానా?" అడిగాడు.

"చెప్తే ఇంత గొడవే వచ్చేది కాదు" అంది కృష్ణమూర్తి కళ్ళలోకి చూస్తూ.

"అదీ మనమంచికే వచ్చింది" భార్యని ఇవతలికి నడిపిస్తూ అన్నాడు కృష్ణమూర్తి.

అప్పుడే బాగా చీకటిపడింది.

పోయిన ఆత్మవిశ్వాసం తిరిగి రావడంతో హుందాగా భర్త వెంట పక్కింటికి నడిచింది పార్వతి.

***

# రచయితల వింత అలవాట్లు



రచయితలు చాలా చిత్రమైన వ్యక్తులు. వీరు ఇంత మంచి రచనలు ఎలా చేయగలిగారా, వీరికి ఇంత మంచి, మంచి 'ఐడియా'లు ఎలా వస్తాయా? అని మనలో చాలా మందికి అనిపించడం సహజం. కాని ఈ రచయితల జీవితచరిత్రలు చదువుతుంటే వారు ఎంత సరస్వతీ కటాక్ష సంపన్నులైనప్పటికి, 'ఇన్స్పిరేషన్' (ఆవేశం) కొరకు, ఐడియాల కొరకు వారు ఎటువంటి బాధలు పడేవారో, ఎలాంటి అలవాట్లు-చేసుకున్నారో మనకి తెలుస్తుంది. వారికి అలవాటైన వాతావరణం లేకపోతే వారి నోటివెంట మాటకూడా రాదు.

ఆంగ్ల రచయితలు 'మూడ్' తెచ్చుకోనడానికి చేసుకున్న అలవాట్లు, పడ్డ శ్రమలు చూస్తుంటే చాలా ఆశ్చర్యంగాను, మరీ వింతగాను వుంటాయి. పత్రికా విలేఖరిగా పనిచేసే రోజుల్లో చర్చిల్ ప్రతిరోజూ ఉదయం తన గదిలో తలుపు బిడాయించుకు కూర్చుని మూడువేల మాటలు వ్రాసే దాకా పైకి వచ్చేవాడు కాదుట. 'ఉత్సాహానికి, ఉత్తేజానికి 'టీ' త్రాగండి' అంటారు ప్రకటనవారులు. అందు




కోసమని పీపాలకొద్దీ 'టీ' సేవించి రచనావేశాన్ని ఆకట్టుకొనే వాడట ఎడ్గార్ వాలెస్.

నోబిల్ బహుమానం పొందిన ఎర్నెస్ట్ హెమింగ్వే వ్రాయడానికి కూర్చునే ముందర లెక్కగా ఇరవై పెన్సిళ్ళని సూదిగా చెక్కేవాడట. అప్పటికి కాని ఆయనకి 'మూడ్' వచ్చేది కాదుట. నల్లమందు తింటే మందగొడితనం వస్తుందంటారు. కాని నల్లమందు తిని ఇన్స్పిరేషన్ తెచ్చుకునే వారట కాలరిడ్జ్, డీక్వెన్సీలు!

— ఆదుర్తి రామప్రసాద్ —

పరిసరాల్లో చెడువాసన వేస్తుంటే అక్కడ ఎవ్వరూ పని చెయ్యలేరు. కాని జర్మన్ కవి – షిల్లర్ తన ముక్కుకి గాఢంగా చెడువాసన వేస్తుంటే తన మెదడు బాగా పని చేస్తుందని నమ్మి తన డ్రాయరులో ఎప్పుడూ కుళ్ళినయాపిల్ పండ్లని దాచుకునేవాడుట. పాపం! ఆ వాసన భరించలేక ఇంట్లోవాళ్ళంతా వేరేచోట వుండేవారుట. ఇంగ్లీషు కవి షెల్లీ అదేపనిగా రొట్టెలు తిని ఇన్‌స్పిరేషన్ తెచ్చుకునేవాడుట. అతనికి పాపం ఇన్‌స్పిరేషన్‌తోపాటు అజీర్ణవ్యాధి కూడా పట్టుకుందట!

•

పిల్లి అపశకునం. పిల్లి అరిస్తే చిరాకు పడతారు చాలామంది. కాని ఆంగ్లభాషలో మొట్టమొదటి డిక్షనరీ తయారుచేసినడాక్టర్ జాన్సన్‌కి తన పెంపుడు పిల్లి టేబిల్ మీద కూర్చుని తన చెవిలో అదే పనిగా అరుస్తుంటే ఎక్కువ వేగంగా పని చేయగలిగేవాడట! దానికి విరుద్ధంగా పిల్లి అరిస్తే తన మూడ్ చెడిపోయిందని పని మానేసి కూర్చునేవాడట న్యూటన్. మూడ్ కొరకు ఇంటివాసాలు లెక్కపెట్టేవాడుట జి. కె. చెస్టర్‌టన్.



ఒకసారి తన ఆస్థానకవి అల్లసాని పెద్దన్నని కవిత్వం రాయమని కృష్ణదేవరాయలు తానై స్వయంగా కోరితే అతడు పద్య రూపంలో చెప్పిన సమాధానం ఇది: ఊరికే కృతుల్ రచించమంటే మావశమా? దానికి ఎన్ని కావాలి – నిరుపహతి స్థలము, రమణీ ప్రియదూతిక తెచ్చి ఇచ్చు కప్పురవిడెము, ఆత్మకింపైన భోజనము, ఉయ్యాల మంచం, ఒప్పు తప్పులరయు రసజ్ఞులు, ఊహ తెలిసి కోగల పాఠకులు ఇంకెన్నో కావాలి. లేకపోతే లాభంలేదు అని చెప్పాడట ఆంధ్ర కవితా పితామహుడు. పాఠకుల మనస్సుకు హత్తుకునేట్టుగా ఆయన మనుచరిత్ర వ్రాసినప్పుడు బహుశా ఇవన్నీ వుండే ఉంటాయనుకుంటాను.

శ్రీనాధుడికి ఇంత పట్టింపులేదు. ఎక్కడైనా కంటికింపైన స్త్రీ కనబడితే చాలు ఆయనలో కవిత్వం పుట్టుకొచ్చేది. 'స్త్రీ' యే శ్రీనాధుడి ఇన్‌స్పిరేషన్. కాని అతని బావగారికి మటుకు శ్రీరామ విగ్రహం ఎదురుగా లేకపోతే ఘంటం నడిచేది కాదుట. మరి ఆయన నోట భాగవతాన్ని పలికించింది ఆ రామభద్రుడే గదా! ***

సైకిలు జీవితాంతం
ఉపయోగపడుతుంది
హెర్క్యులిస్ మీ సొత్తుకు
మంచి విలువైనది

విశిష్టమైన రకము, మితమైన
వెలతో హెర్క్యులిస్ బైసికిళ్ళలో
ఆదర్శమైనది. ఎంతమాత్రము
ఆశ్చర్యము లేదు. ప్రపంచమంతటా
135 దేశాలలో ఎక్కువగా
అందరూ వాడేదే ఇది.
సౌత్ ఈస్ట్ ఏషియాలో మద్రాసు
నందు మంచి సాధన సదుపాయాలు
కలిగిన పెద్ద సైకిల్ ఫ్యాక్టరీలో
అంతర్జాతీయపు అర్హతలకు
అనుగుణ్యంగా
తయారుచేయబడింది.
హెర్క్యులిస్ ప్రపంచంలో పెద్ద
సైకిళ్ళ ఉత్పత్తిదారులైన ట్యూబ్
ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్,
యు.కె. వారి సౌజన్యంతో
అచ్చితముగా నిర్మింపబడినది.

® హెర్క్యులిస్

ఒక్క సైకిలే కాదు
జీవితకాలపు నేస్తము



హెర్క్యులిస్ కోరాటు.
"హెర్క్యులిస్‌మీద పెట్టుబడి పెట్టినందుకు ఎంతో సంతోషము. దగ్గరి పెద్ద ఊరు ఎంత దూరమైనా ప్రతిరోజు వెళ్ళి వస్తూంటాను. నా హెర్క్యులిస్ నా జీవితంలో ఒక భాగము."



వెల, విశిష్టత, బలిష్టత, మన్నిక అందము-అన్నిటి లోను హెర్క్యులిస్ సొమ్ముకు మంచి విలువైనది.

® ది హెర్క్యులిస్ సైకిల్ మరియు మోటార్ కంపెనీ లిమిటెడ్ యు కె వారి రిజిష్టర్ ట్రేడ్ మార్కులు ఇండియాలో తయారి, టిఐ సైకిల్స్ ఆఫ్ ఇండియా, అంబత్తూరు, మద్రాసు-53 ప్రొప్రైటర్లు ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ మద్రాసు-1 ఉపయోగించుటకు రిజిస్టరు చేయింపబడిరి. చిన్ని మొత్తముల సేకరణలలో ఆదా చేయండి tic h 3824ఈ.

# సముద్రాలకు పాటు పోట్లు

అమావాస్యకూ పూర్ణిమకూ సముద్రం పొంగుతుందని మన కందరకూ తెలుసు. ఆ రోజులలో చంద్రుడు భూమికి దగ్గరగా వస్తాడనీ అప్పుడు చంద్రాకర్షణ అధికమై సముద్రం పొంగుతుందనీ కొందరు అనుకుంటూ వుంటారు. కాని అది నిజంకాదు. చంద్రుడు భూమిచుట్టూ ఇంచుమించు వృత్తాకార కక్ష్య లోనే తిరుగుతున్నాడు. కనుక, భూ చంద్రుల మధ్యదూరంలో అట్టే మార్పులు వుండవు. పైగా సముద్రాలకు ప్రతిరోజూ పోటు పాట్లు వుంటాయి. చంద్రుడు ప్రతిరోజూ భూమికి దగ్గరగా వచ్చి మళ్ళీ దూరమై పోతున్నాడనలేముకదా! ఇంతకీ సముద్రాలకు ఈ పోటు పాట్లు ఎందువల్ల కలుగుతున్నాయి?

గిన్నె కదులుతున్నప్పుడు గిన్నె లోని నీళ్ళు అటూ ఇటూ ఊగిసలాడినట్లే భూమి తిరుగుతూ ఉండడం చేత సముద్రాలకు పాటు పోట్లు వస్తున్నాయనీ, భూమి తిరుగుతోందనడానికి ఇదొక నిదర్శనం అనీ గెలీలియో చెప్పినట్లు ఎక్కడో చదివిన జ్ఞాపకం. కాని ఈ వాదంకూడా సరియైనది కాదు. వీటికి సూర్యచంద్రుల ఆకర్షణలే కారణం. ఈ విషయం సరిగ్గా అర్థం కావాలంటే మరి కాస్త జాగ్రత్తగా పరిశీలించాలి.

గోళాకారంలో ఉన్న భూమి మీద చుట్టూ సముద్రం వున్నదనుకుందాం. చంద్రుడు, సూర్యుడు మొదలైన అల్లరిపెట్టే వస్తువులేవీ చుట్టుపక్కల లేకపోతే ఈ సముద్రం కూడా సరిగ్గా గోళాకారంలోనే వుంటుంది. అంటే నీటిమట్టం ఎక్కడ చూచినా కేంద్రానికి సమానదూరంలోనే వుంటుంది. దగ్గరలో సూర్యచంద్రులు వుండడంచేత సముద్రం



గోళాకారంలో వుండక, కాస్త మారుతుంది. ఈ మార్పు ఏ విధంగా జరిగేదీ ఇక్కడి బొమ్మలో వివరంగా చూపబడింది. ఇందులో భూమి చుట్టూ గీతలతో నల్లగా ఉన్నది సముద్రం మధ్యలో ఉన్న గుండ్రని భాగం ఘనపదార్థం.

న్యూటన్ చెప్పిన గురుత్వాకర్షణ సిద్ధాంతం ప్రకారం చంద్రుడు (లేక సూర్యుడు) భూమిని, దాని చుట్టూ ఉన్న నీటిపొరనూ ఆకర్షిస్తాడు. దగ్గరగా ఉన్న వస్తువుల మీద ఈ ఆకర్షణశక్తి అధికంగానూ, దూరంగా వున్న వస్తువుల మీద తక్కువగానూ ఉంటుంది. చంద్రుడు తనకు దగ్గరగా సరిగ్గా "క్రింద" ఉన్న నీటి పొరను (బొమ్మలో "క" దగ్గర) అత్యధికంగా ఆకర్షిస్తాడు. ఈ నీటిపొర భూమిని గట్టిగా అంటి పెట్టుకునికాక "వదులుగా" ఉండడం చేత "క" దగ్గర సముద్రపు మట్టం మిగిలినచోట్ల కన్న పైకి లేస్తుంది. దీనినే మనం "పోటు" అంటాం.

చంద్రుడికి దూరంగా ఉన్న "ట", "డ" అనే చోట్ల ఆకర్షణ తక్కువగా ఉంటుంది. కనుక అక్కడ నీటిమట్టం మిగిలిన చోట్లకన్న తక్కువ. అదే "పాటు"

దీనిలో మరో చమత్కారం కూడా ఉంది. సరిగ్గా చంద్రునికి "క్రింద" ఉన్న "క" దగ్గరేకాక, భూమిమీద దానికి సరిగ్గా అవతలి వైపున ఉన్న "గ" దగ్గర కూడా సముద్రపు మట్టం పెరుగుతుంది! అన్నిటికన్న దూరంలో వున్న "గ" దగ్గర ఆకర్షణ అత్యంత స్వల్పంగా ఉండి, అక్కడ నీటిమట్టం అన్నింటికన్న తక్కువగా వుండాలని అనుకుంటాం. కాని, ఇది నిజం కాదు. ఈ సంగతి మొదటిసారిగా విన్నవారికి చాలా ఆశ్చర్యంగా ఉంటుంది.

వస్తువులు దూరమైనకొద్దీ ఆకర్షణ తగ్గిపోతుందని జ్ఞాపకం పెట్టుకుంటే ఈ పాటుపోటు సులభంగా అర్థం అవుతాయి. బొమ్మలో "గ, జ, మ, చ, క" అనే బిందువుల దగ్గర చంద్రాకర్షణ ఒకదానికన్న ఒకటి అధికతరంగా వుంటుంది కనుక, "క" దగ్గర నీటిమట్టం "చ" నుంచి దూరమై చంద్రునివైపు జరుగుతుంది. కనుక "క" దగ్గర పోటు వస్తుంది.

"చ, మ, జ" ల దగ్గర ఆకర్షణశక్తులు ఒకదానికన్న ఒకటి తక్కువగా ఉన్నప్పటికీ, గుండ్రంగా చూపించిన భూమి అంతా ఒకే ఒక ఘనపదార్థం కనుక ఈ భాగం అంతా "గ" దగ్గర నీటిపొరను అక్కడే వదిలిపెట్టి చంద్రునివైపు జరుగుతుంది. అందువల్ల "గ—జ"ల మధ్య దూరం పెరుగుతుంది. అంటే "గ" దగ్గర నీటిమట్టం పెరిగినట్లే కదా!

మొత్తం మీద చంద్రాకర్షణవల్ల భూమిని ఆవరించి ఉన్న నీటి పొర ఎడా పెడా సాగదీయబడుతుంది. చంద్రుడు లేకపోతే గోళాకారంలో

ఉండగల సముద్రం ఇప్పుడు దోసకాయ ఆకారంలోకి మారుతుంది.

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ వుండడంచేత భూమిమీద "చ" అనే బిందువు ఆరు గంటల తరువాత "త" అనే చోటికి వస్తుంది. అంటే పోటులోనుంచి పాటులోకి వస్తుంది. మరో ఆరుగంటల తరువాత "జ" దగ్గరకు వస్తుంది. అక్కడ మళ్ళీ పోటు తగులుతుంది. తరువాత మరో ఆరు గంటలకు "ద" దగ్గరకు వచ్చినప్పుడు పాటు. ఈ విధంగా భూమిమీద ప్రతి చోటా రోజుకి రెండుసార్లు సముద్రానికి పోటు, రెండుసార్లు పాటు వస్తాయి.

సరిగ్గా ఇదే విధంగా సూర్యాకర్షణవల్ల కూడా సముద్రానికి పోటు పాట్లు వస్తూ వుంటాయి. సూర్యుడు చంద్రునికన్న చాలా రెట్లు పెద్దవాడైనప్పటికీ, చంద్రునికన్న బహు దూరాన వుండడంచేత సూర్యాకర్షణ వల్ల ఏర్పడే సముద్రపు పొంగు చంద్రునివల్ల ఏర్పడే పొంగు కన్న

## పూర్ణిమ




## అమావాస్య






బాగా తక్కువ (సుమారు 5/11 వ వంతు మాత్రమే)

ఇకపోతే పూర్ణిమకూ, అమావాస్యకూ సముద్రం అధికంగా పొంగడానికి కారణం ఏమిటి? ఈ రెండు సమయాలలోనూ సూర్యుడు, చంద్రుడు, భూమి ఇంచుమించు ఒకే సరళరేఖలో వుంటాయి. కనుక, సూర్య చంద్రులు కల్పించిన పొంగులు ఒకదాని కొకటి దోహదం చేసుకుంటాయి. కనుక, అప్పుడు సముద్రాలకు పోటు పాట్లు అధికం.

---

**అనావృష్టికి**
**గురియైన**
**మనదేశ ప్రజలకు**
**తోడ్పడండి**

విరాళాలను
నగదురూపంలో కానీ
వస్తురూపంలో కానీ
ప్రధాన మంత్రి
కరువు సహాయకనిధి
క్యాబినెట్ సెక్రటేరియట్,
రాష్ట్రపతి భవన్,
న్యూ ఢిల్లీ–4 కు పంపండి.

**DA 66/F 1**

ఇక, అర్ధ చంద్రుడు కనిపించే సమయంలో సూర్యుడు, చంద్రుడు, భూమి ఒక సమకోణ త్రిభుజంలో వుంటాయి. కనుక, సూర్య చంద్రుల వల్ల ఏర్పడే పోటుపాట్లు ఒకదాని కొకటి వ్యతిరేకదిశలలో ఉంటాయి. అందుచేత ఆ సమయంలో సముద్రపు పొంగు మిగిలిన అన్ని రోజులలో కన్న తక్కువగా ఉంటుంది. (పూర్ణిమ, అమావాస్యల నాటి పొంగులో సుమారు మూడవ వంతు ఉంటుంది.)

'ప్రతి పర్వ రసోదయమ్' అన్న కాళిదాసు శ్లోకానికి ఇదిగో ఇంత వ్యాఖ్యానం అవసరం.

డాక్టర్ మహీధర నళినీమోహన్

***

---

సార్! పెసరట్ ఊడి రావటం లేదుట
మిమ్మల్నే పెనం కాడికి వచ్చెయ్యమన్నా





# కిశోర ప్రాయం

## విజయలక్ష్మి రామకృష్ణన్

(ఉన్నవ విజయలక్ష్మి)

[గత సంచిక తరువాయి]

'కాదు మోహినీ, స్టేషన్ దగ్గర వున్నదే హిందూ కాలేజి, దాంట్లో ఇంగ్లీషు లెక్చరర్. వాళ్ళ నాన్నగారు నటేశయ్యర్ మామయ్యకు స్నేహితులు. అంటే వాళ్ళ ఫామిలీ ఫ్రెండ్సన్నమాట. బాగా పుస్తకాలు చదువుతాడు. మంచి పుస్తకాలు ఎప్పుడన్నా నాకు పంపిస్తుంటాడు చదవడానికి. అతన్ని నువ్వు చూడాలి మోహినీ, తమిళం మాట్లాడే వాళ్ళను చూస్తే, వాళ్ళ వూరు వెళ్ళి వచ్చి నట్లుంటుంది. జీనియస్ అనుకో. యూనివర్సిటీలో బోలెడు ప్రైజులు తెచ్చుకున్నాడు. గోల్డు మెడలిస్టు మామయ్యకు అతనంటే మహా యిష్టం బావకు మాత్రం అతన్ని చూస్తే గిట్టదు నే నెప్పుడైనా ఓ పావుగంట టాపిక్ మార్చకుండా మాట్లాడితే 'బాలకృష్ణన్ చాదస్తం బాగా అంటింది. ఇట్లా తయారయ్యావంటే జనం నీ కంపెనీ

**సీరియల్**

కావాలనుకోరు సరికదా నిన్నెట్లా తప్పించుకోవాలా అని చూస్తారు" అంటాడు. ఓసారి ఒళ్ళుమండి నేను "ఔను తెలివైనవాళ్ళ కంపెనీ అందరూ భరించలేరు" అన్నాను. బావ ఆశ్చర్యంగా ముఖంపెట్టి "ఊఁ ఎడ్మిరేషన్ చాలవరకూ వచ్చిందే!" అని చెప్పాడు. 'వాద నెందుకని ఊరుకున్నాను నేను" అన్నది అనంత. మోహిని పత్రికలు చూస్తుండిపోయింది. అనంత బాలకృష్ణన్ పంపిన 'ఓల్డు మాన్ అండ్ ది సీ' చదవడం మొదలెట్టింది. ఆ మధ్య ఎప్పుడో హెమింగ్వే ప్రశక్తి రాగా 'నేను ఒక్కటి కూడా చదవలేదు' అని చెప్పింది అనంత. అది గురుపెట్టుకుని పుస్తకంపంపాడు బాలకృష్ణన్. మూడయేసరికి టీకి రమ్మని పిలిచింది జానకి. చన్నీళ్ళతో ముఖాలు కడుక్కొని టీ త్రాగడానికి వెళ్ళారు అనంత, మోహిని. జానకి బల్ల దగ్గర నిలబడి టీ కలుపుతున్నది. "అత్తయ్యా, టీ అందరికీ కలిపేశారా?" అనడిగింది అనంత కంగారుగా.

"లేదే. మీ మామయ్యకు, నాకు కలిపాను. మీరు కలుపుకు త్రాగండి. మోహినికి ఇంకొకరు కలిపిన టీ నచ్చదుగా" అంది జానకి. చిన్న ట్రేలో రెండు కప్పులు పెట్టుకుని భర్త గదిలోకి వెళ్ళింది జానకి.

"మోహినీ నాకు అలవాటులేదు టీ కలవడం, నువ్వే, కలుపు" అన్నది అనంత కెటిల్ మోహిని ముందుకు జరుపుతూ. వాళ్ళిద్దరూ టీ త్రాగుతుండగా జానకవచ్చి "అనంతా ఈ సాయంత్రం మీ రిద్దరు జడ్జీగారింటికి బొమ్మల పేరంటానికి వెళ్ళిరండి" అన్నది.

"నువ్వు రావా అత్తయ్యా."

"ఉహు! నాకు వీలుకాదులే. మీరు వెళ్ళిరండి, కారు వచ్చిందిగా ప్రొద్దున" అంది జానకి

"ఇక్కడ సంక్రాంతి గదా బొమ్మలు పెట్టారా?" అనడిగింది మోహిని

"ఆ జడ్జీగారు దక్షిణాదివాళ్ళు-వాళ్ళకు దసరా అలవాటుట. వాళ్ళింట్లో కొలువు చక్కగా వుంటుంది. ఆరింటికి వెళ్దాం" అన్నది అనంత.

సాయంత్రం అనంతకు సంగీతం మేష్టారు వచ్చారు. పాఠం పూర్తి అయ్యేసరికి ఆరయింది. గబగబా గదిలోకి వచ్చింది ముస్తాబు పూర్తి చేసుకున్న మోహినిని చూసి, "పాశ్చాత్యులు ప్రపంచంలో అందమైన చిత్రం ఇప్పటికీ 'మోనా, దే నంటూరట. నన్నెవరైనా అమ్మాయిల్లో అడిగితే 'మోహినీ' అంటాను" అంది. మోహిని చిన్నగా నవ్వింది. "మోహినీ నా కేదైనా చీర సెలక్టు చేసిపెట్టు" అని తన బీరువా తాళాలిచ్చింది అనంత. తాళాలు తీసుకోకుండానే "నాదేదైనా చీర కట్టుకుంటావా అనంతా, నా దగ్గర చక్కటి మబ్బురంగు

సిల్కు చీర ఒకటుంది. అది కట్టు కుంటావా ?" అంది మోహిని.

'నేనెంత మంచి చీర కట్టుకున్నా, నీ ప్రక్కన దిష్టిబొమ్మలా గే వుంటాను" అంటూ బీరువా తెరిచి ఒక చీర, జాకెట్టూ తీసుకుంది అనంత.

"అట్లా మాట్లాడితే నాకు బాగుం టుందనుకుంటావా అనంతా" అంది మోహిని, నిజంగా బాధపడుతూ. మోహిని ముఖంచూసి అనంత తెల్ల బోయింది. "మోనీ, ఛ వూరికే అన్నాను, సీరియస్‌గా తీసు కున్నావు ? సరే నీ చీరే కట్టు కుంటాను యివ్వు" అంది అనంత.

"నీకు యిష్టం లేకపోతే వద్దులే అనంతా. తీసుకున్నావుగా నీ చీర కట్టుకో అదే" అన్నది మోహిని.

"ఉహుఁ బ్రతిమాలించుకుగాని యివ్వవా ఏం? తాళం యివ్వు నేను తీసుకుంటాను" అన్నది అనంత.

మోహిని ముఖం ప్రఫుల్లమైంది. పెట్టెతీసి, చీరతీసి అనంత భుజం మీద వేసి, "ఈ రంగు నిజంగా బాగుంటుంది నీకు కట్టుకో" అంది.

జానక్కి చెప్పడానికి వెళ్ళా రిద్దరూ. జానకి స్టోరు రూమ్‌లో వుంది. సాయంత్రం వంటకు కావలసి వవి వంట మనిషికి తీసిస్తున్నది.

"తయారైనారా బాగున్నారు, వెళ్ళిరండి. మరీ ఎక్కువసేపు వుండ కండి" అన్నది జానకి. వాళ్ళు వెళ్ళాక "ఎప్పుడూ అక్కచీరైనా కట్టుకోని అనంత యివాళ మోహిని చీర కట్టుకుంది. వాళ్ళిద్దరికీ బాగా కుదిరింది జత" అనుకుంది జానకి.

జడ్జీగారింట్లో బొమ్మల కొలువు సుందరంగా తీర్చిపెట్టారు. పై మెట్టున రాధాకృష్ణ ప్రతిమలు, ఆ క్రింద వరస దశావతారాలు, తక్కిన మెట్లన్ని కృష్ణ లీలలు, బాలక్రీడలు, గోపికా వస్త్రాపహరణం, రాస నృత్యం, రుక్మిణీ హరణం, నరకా సుర సంహారం, కురుపాండవయుద్ధం, గీతాబోధ అన్నీ పొందికగా అమర్చి వున్నాయి. జడ్జిగారి భార్య వచ్చి, పలుకరించి "పాట చెప్పండి" అన్నది. తమిళ గృహిణులు గడుసు వాళ్ళు. పేరంటానికి వచ్చిన వాళ్ళు పాట పాడితేనేకాని, తాంబూల మిచ్చి పంపరు. అనంత "మానస సంచరరే" పాడింది. మోహిని "తాయై యశోదా" పాడింది. జడ్జి గారి భార్యకు అరవపాట వినగానే ప్రాణం లేచివచ్చింది. మోహినిచేత మరి రెండు అరవ పాటలు పాడించు కుని తాంబూలాలిచ్చింది.

రాత్రి భోజనాల దగ్గర "ఈ ఏడాది జడ్జి గారింట్లో కొలువు ఎట్లా వుంది" అనడిగింది జానకి.

"కృష్ణ లీలలన్నీ పెట్టారత్తయ్యా" అంది మోహిని.

"నిరుడు అన్నీ శివుడి బొమ్మలే పెట్టారు కదు అనంతా" అంది జానకి.

"ఔను, ఈ ఏడాదికన్నా నిరుటి కొలువు యింకా బాగుంది. ఈశ్వరుని తపస్సు, పార్వతి నాట్యం, కామ దహనం, పార్వతి చేతిలో పండు కొరకు పిల్లలిద్దరు పోట్లాడుకోడం, కుమారుడు అలిగి వెళ్ళిపోవడం –

"పళని కథ కదా" అంది మోహిని

నటరాజ, శివకామ సుందరులు, మీనాక్షీ కళ్యాణం, భస్మాసుర సంహారం, హర నాగాహినీ ప్రణయం, చాల చాల పెట్టారు" అన్నది అనంత.

"అదొక చిత్రమైన కథ. అప్పుడే పుట్టాడుట, హరికేశవులకు అయ్యప్పన్! కేరళ రాష్ట్రంలో ఆ దేవుడంటే గొప్ప నమ్మకం. ఆ దేవునికి అంత మహత్మ్యం ఎట్లా వచ్చిందో తెలుసునా అనంతా, ఆ దేవుడికి స్త్రీల వాసన పడదట. అయ్యప్పన్ గుడి శబరిమలైలో వుంది. ఆ గుడికి ఆడవాళ్ళను వెళ్ళనివ్వరు" అన్నాడు నారాయణరావు. అందరూ నవ్వారు.

"శివ విష్ణువులు ఒకే ప్రతిమలో వున్న గుడి మన రాష్ట్రంలో కూడ ఎక్కడో వుంది గదా" అంది జానకి.

"ఔను "ర్యాలి" అనే ఊళ్ళో వుందంటారు, మనం చూడలేదు" అన్నాడు నారాయణరావు.

"స్థిరంగా ఒక చోటవుండే వుద్యోగాలు కావు ప్రతి రెండు మూడేళ్ళకు ట్రాన్స్ఫరవుతుంటారు అయినా అంత ఓపిగ్గా ఆ బొమ్మలన్ని జాగ్రత్తగా మోసికెళ్తారు. ముచ్చటగా ఏటేట కొలువు పెడ్తారు. వాళ్ళ ఓపిక, ఉత్సాహం చెప్పుకోవాలి" అన్నది జానకి.

"ఓపిక సంగతి సరేనత్తయ్యా, ఎంత ఏరిఏరి ఎన్ని చోట్ల కొన్నారో ఆ బొమ్మలన్ని!" అన్నది అనంత.

భోజనాలయ్యాక నారాయణరావు అనంతను పిలిచి కాలేజి సంగతులు, పాఠాల సంగతులు అడిగాడు కాసేపు. మోహిని అనంత గదిలో పుస్తకాలు షెల్ఫ్లోంచి ఒక్కొక్కటి తీసి చూస్తోంది.

"ఏమిటి పుస్తకాలు చూస్తున్నావా? మామయ్య ఎంతకీ తెమిల్చారు కాదు మాటలు" అంది అనంత. మోహిని వెనక్కి తిరిగి చూసింది చేతిలో పుస్తకం క్రింద బడింది. ఆ పుస్తకం మధ్యలోంచి ఒక కాయితం బైట కొచ్చింది దాన్ని తీసి అనంతకిస్తూ "ఉత్తరమా? పుస్తకాల్లో ఉత్తరాలు పెట్టుకోడం మంచిదికాదు అనంతా" అన్నది మోహిని. అనంత కాగితం అందుకుని చూసి పకపక నవ్వి "మోనీ, ఈ వుత్తరం చూడు నువ్వు. యిది, నా రెండేళ్ళ కాలేజి జీవితంలో నాకు వచ్చిన పాతిక ముప్ఫయి ప్రేమలేఖల్లో ఒకటి" అన్నది. మోహిని కుతూహలంగా చదివింది. ఆ ఉత్తరాన్ని ముగిస్తూ "ఊఁ ఏం చేశావు నువ్వు, రిపోర్టు చేసావా మీ ప్రిన్సిపాల్ కు" అనడిగింది. "వ్రాసేవాళ్ళకి బుద్ధి లేక పోతే

రిపోర్టు చేసేవాళ్ళకైనా బుద్ధి వుండద్దా' అన్నది అనంత.

'అయితే ఏమి చెయ్యాలా, వూరుకున్నావ్?' అన్నది విస్మయంగా మోహిని.



'ఊరుకోక! అదొక తమాషా! వ్రాసేవాళ్ళకు, చదువుకునే వాళ్లకు కూడ: ఊసుపోని అబ్బాయిలు వ్రాసే యిలాంటి ఉత్తరాలు మాకు మంచి కాలక్షేపానికి పనికివస్తాయి. ఆ మధ్య ఎక్కడో చదివాను. అమెరికాలో ప్రొఫెషనల్సు వుంటారట. డబ్బు తీసుకుని ప్రేమలేఖలు వ్రాసిస్తారట. కాని మొదలేడు, మొదటి మూడు నాలుగు ఉత్తరాలకు కొంప మునిగిపోయినట్లు ఏడుస్తారు అమ్మాయిలు. భయపడతారు. నేనూ అంతే! తర్వాత మెల్లిగా అలవాటు పడిపోతారు ఈ ఉత్తరాలకు.

ఇంకో తమాషా ఏమిటంటే ఈ ఉత్తరాలకు రహస్యం వుండదు అమ్మాయిలపేర కాలేజి అడ్రసుకు వచ్చిన లోకల్ పోస్టు ఉత్తరాన్ని ఎవరు పడితేవాళ్ళు చింపి చదివేస్తారు. నలుగురుచేరి ఆ అడ్రసీని వెదికి కాసేపు ఉత్తరంలోని కొటేషన్సులో ఏడిపించి ఆ తర్వాత ఉత్తరం యిస్తారు. మరునాటికి మళ్ళీ ఆ విషయం ఎవరూ ఎత్తరు. వచ్చిన చిక్కంతా, ఈ ఉత్తరాలు ఇంట్లో వాళ్ళ కళ్ళబడితేనే! కొందరిళ్ళల్లో వుంటారు మోహినీ వాళ్ళు మనుష్యులు కారు, రాక్షసులు. ఎవరో అబ్బాయి వ్రాసిన ఉత్తరాన్ని చూసి, ఆ అమ్మాయిని నిలబెట్టి సంజాయిషీలడిగి నానాకూతలు కూస్తారట! మూడు వంతులు ఆ అబ్బాయి ఎవరో కూడ ఆ అమ్మాయికి తెలిసి వుండదు. ఆ అమ్మాయిలు, తండ్రులు, అన్నయ్యలు చేసే ఈ అత్యాచారాన్ని ఎట్లా సహిస్తారో, సహిస్తూ కూడ కాలేజిలకు వచ్చి ఎందుకు చదువుతారో నాకర్థం కాదు. అంతా చదువుమీద శ్రద్ధంటే నేను నమ్మను ఏదీ మామయ్యను నన్నట్లా నిలబెట్టి అడగమను, పుస్తకాలు విసరి గిరవాటేసి మళ్ళీ కాలేజిముఖం చూస్తానేమో!" అంది పెద్ద హీరోయిన్‌లాగ అనంత. "ఇంకో విచిత్ర మేమంటే మోహినీ, ఆ అమ్మాయిలు కాలేజికి వచ్చి "ఈ వెధవలు యిట్లా ఉత్తరాలు వ్రాస్తారు. మా యింట్లోవాళ్ళు మా ప్రాణాలు తీస్తారు" అని సణుగుతారు ప్రాణాలుపోయేది ఉత్తరాలు వ్రాసే అబ్బాయిలవల్ల కాదు, అవి చూసి దౌర్జన్యంచెసే యింట్లో వాళ్ళ వల్ల అని వాళ్ళకు తెలును. అయినా వాళ్ళ మనసుకు యింట్లో వాళ్ళు మంచివాళ్ళు, బైటవాళ్ళు వెధవలూనూ చిత్రంకాదూ!" అన్నది అనంత.

"ఛీ, అట్లా మాట్లాడకు నాకు బాగా లేదు. సరే పడుకుందామా నిద్ర రావడం లేదూ" అన్నది మోహిని.

మరునాడు ప్రొద్దుట కాఫీలు త్రాగుతుండగా బాలకృష్ణన్ ప్యూను ఒక పుస్తకం పట్టుకొచ్చి అనంత కిచ్చాడు. "ఏమి మంచిపుస్తకమబ్బా" అనుకుంటూ చూసింది. మొన్ననే కదా యిది చదివి పంపాను. మళ్ళా పంపాడేం అనుకుని సందేహంగా పేజీలు త్రిప్పింది. మధ్యలో ఒక కవరు, అనంత పేరు వ్రాసి అంటించి వున్న కవరు కనబడింది. మహా ఆశ్చర్యపడి పోయింది అనంత. రాత్రి మోహినితో జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది. ఏమి జరగనట్టు కాఫీ త్రాగాక తన గదిలోకి వెళ్ళి తలుపు గడియపెట్టి మంచం మీద కూర్చుని కవరు చింపింది. "బాలకృష్ణన్ తన కింతవరకు ఎప్పుడు ఉత్తరం వ్రాయలేదే, ఇదేమి టిప్పుడు" అనుకుంటూ.

డియర్ అనంతా,

మీకో సంగతి చాల రోజుల నుంచి చెప్పాలనుకుంటున్నాను. చెప్పనే లేదు. ఈ రోజు చెప్పి తీరాలి. పరిస్థితి అట్లా వచ్చింది. మీ యింట్లో మాట్లాడ్డం వీలుపడదు. నలుగురిలోనూ చెప్పేమాట కాదది. ఇన్నాళ్ళ స్నేహాన్ని పురస్కరించుకుని అడుగుతున్నాను. సాయంత్రం వేరే ఎక్కడైనా మిమ్మల్ని కలుసుకోవాలనుంది. ఎక్కడికి రమ్మంటారో తెలియచెయ్యండి.

భవదీయ
బాలకృష్ణన్.

"బాలూకు పిచ్చెక్కిందా ఏం? ఇంట్లోకాక ఎక్కడో కలుసుకోవడమేమిటి? ఏమి రహస్యం అది" అనుకుంది అనంత. కాయితంతీసి బదులు వ్రాసింది.

బాలకృష్ణన్ గారికి,

తప్పకరండి సాయంత్రం. మామయ్య ఫోంచేసి బెజవాడ వెళ్ళారు పనిమీద. రాత్రికి గాని రారు. నిర్భయంగా మా యింట్లోనే మాట్లాడుకోవచ్చు. మామయ్య వుండరుకనుక. ఆయన మీతో సోది వేస్తారనే భయం అక్కరలేదు. ఎక్కడో కలుసుకునే మాట నాకు బాగాలేదు. ఇంటికే రండి.

అనంత.

జాబు కవరులో పెట్టి అంటించి పుస్తకంలోనే పెట్టి వచ్చిన మనిషికిచ్చి బాలకృష్ణన్‌కు పంపింది.

ఆ సాయంత్రం బాలకృష్ణన్ వచ్చేవరకు, పరధ్యానంగా, చికాకుగా గడిచింది అనంతకు. బాలకృష్ణన్ నాలుగింటికి వచ్చాడు. రాగానే జానకిని వెతుక్కుంటూ వెళ్ళి పలుకరించాడు. కాసేపటికి "బాలకృష్ణన్ మీరు పంపిన పుస్తకాలు చదివాను, రండి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుందాం మీతో బోలెడంత మాట్లాడాలి" అన్నది అనంత. "కాస్త కాఫీ అయినా తీసుకోనీ అతన్ని" అన్నది జానకి. "వద్దండీ తీసుకువచ్చాను" అన్నాడు బాలకృష్ణన్. "ఎక్కడ పెట్టావు" అన్నది జానకి. "ఏమిటి" అన్నాడు బాలకృష్ణన్ అర్థంకాక. "అదేనయ్యా కాఫీ తీసుకు వచ్చానంటివే ఎక్కడ పెట్టావని అడుగుతున్నా" అన్నది జానకి. అంతా నవ్వారు. అనంతా, బాలకృష్ణన్ డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళారు. జానకి సాయంత్రం కూరకు చిక్కుడు కాయలు తుంపి గిన్నెలో వేస్తోంది. మోహిని జానకికి దగ్గరగా పీటవేసుకు కూర్చుని మేనత్తకు సాయం చేస్తోంది.

"కూర్చోండి బాలకృష్ణన్, చెప్పండి ఆ సంగతేమిటో, ప్రొద్దుట నుంచి ఒకే తొందరగావుంది నాకు" అన్నది అనంత.

బాలకృష్ణన్ ఒకసారిగా మారిపోయాడు చాల సీరియస్‌గా

అనంత ముఖంలోకి చూస్తూ "చాలా రోజుల నుంచి మీకీ విషయం చెప్పుదామనుకున్నాను అనంతా, పడనే లేదు ఇవాళ యిహ తప్పదు. మా మేనమామ నాకో సంబంధం మాట్లాడాడట నాన్నకు, ఉత్తరం వ్రాసాడు ఆ అమ్మాయిని చూడ్డానికి మా అమ్మ తంజావూరు ప్రయాణమైంది నన్ను కూడ రమ్మంటున్నది"

బాలకృష్ణన్‌ను మాట పూర్తి చెయ్యనీయలేదు అనంత "ఇదా సంగతి! రహస్య మేమిటిది? టముకు వేసి మరీ చెప్పాలికాని! కంగ్రాచ్యులేషన్స్ అత్తయ్యకు చెప్పి వస్తానండి అత్తయ్యా అత్తయ్యా" అంటూ పరిగెత్తింది అనంత






బాలకృష్ణన్ నిర్ఘాంతపోయాడు- "ఆగండి అనంతా ఆగండి అనంతా మిమ్మల్నే" అంటూ అరిచాడు. అనంత వినిపించుకోలేదు. జానకి దగ్గర కెళ్ళి "అత్తయ్యా బాలకృష్ణన్ పెళ్ళిట. ఆ అమ్మాయిని చూడ్డానికి వెళ్తున్నారట" అని చెప్పింది జానకి 'నిజం, నాకు చెప్పనేలేదే' అన్నది. "రా, అత్తయ్యా నేను చెప్పానుగా, రా, చిక్కుడుకాయలకు ముంచుకుపోదు, రా" అంటూ లేవదీసింది జానకిని

బాలకృష్ణన్ నుదురు చేత్తో పట్టుకు సోఫాలో కూలబడ్డాడు. మనసు కట్టిన మేడలన్నీ కూలిపోయాయి అతనికి "ఏమోయి బాలాకృష్ణా పెళ్ళికూతురును చూడ్డానికి వెళ్తున్నారట సంతోషం స్వంతంలోనా, బైట సంబంధమా? ఏమిటోయ్ పేకాటలో ఓడిపోయిన వాడిలా అట్లా వున్నావ్" అన్నది జానకి ఆశ్చర్యంగా

నిజం, జానకి నిజం వూహించింది జీవితం పేకాటలాంటిదే అదృష్టానికి గ్యారంటీ లేదు దాంట్లో! బాలకృష్ణన్ పాలిపోయిన ముఖం దాచుకోలేక పోయాడు "మా మేనమామ భార్యకు బంధువులు వాళ్ళు. ఆయనగారి ప్రయోజకత్వం యిది" అన్నాడు

"ఎప్పుడు ప్రయాణం" అనడిగింది జానకి

"ఎల్లుండి ప్రొద్దుట కాబోలు"

"ఔను శనివుష్నస్సు అన్నిటికీ మంచిది" అన్నది జానకి

"వెళ్తానండీ" అంటూ లేచాడు బాలకృష్ణన్

"ఉండుండు కాస్త తీపి తిని వెళ్దువుగానీ" అంటూ జానకి లోపలికి వెళ్ళి మిఠాయి తీసుకొచ్చింది. బాలకృష్ణన్ బలవంతంగా ఒకటితిని "వస్తానంటూ" వెళ్ళిపోయాడు తర్వాత గుర్తుకు వచ్చింది అనంతకు "చాల రోజుల నుంచి చెప్పాలనుకుంటున్న సంగతేమిటో చెప్పలేదే" అనుకుంది కాని తర్వాత అంగంటకల్లా ఆ సంగతి మర్చిపోయింది

బాలకృష్ణన్‌కు ఆరాత్రి ఎంతకీ నిద్రపట్టలేదు సాయంత్రం వరకు అతడు వూహించింది ఒకటి, తర్వాత జరిగింది మరొకటి!

"అనంతా, నీ కోసం పెట్టిపుట్టిన భాగ్యశాలి ఎవరో! నేను మాత్రం కాదు!" అనుకున్నాడు హృదయంలో మంట! తాను దగా పడ్డాడు ఇతరులవల్ల మోసపోయిన వారు ఎదుటి వాళ్ళను నిందించి కసి తీర్చుకోవచ్చు కాని అతనికా దారి కూడ లేదు కేవలం భ్రమలో బ్రతికాడు అన్నాళ్ళూ! ఆలోచన పట్టలేక ఓ కాయితం తీసుకుని ఉత్తరం వ్రాసాడు. కవరులో పెట్టాడు. అడ్రసు వ్రాయబోయి ఆగాడు. "ఎవరిని సెంటిమెంటల్‌గా బాధపెట్టడం మంచిది కాదు, అందులో ఆడవాళ్ళను! అనంతను బాధ పెట్టడం నా వల్ల కాదు. ఈ ఉత్తరం ఆమె ఎప్పటికీ చూడకూడదు" అనుకున్నాడు చింపబోయాడు కాని చింపలేకపోయాడు అడ్రసు వ్రాయని ఆ కవరుమీద లక్కతో సీలువేసి తన బట్టల పెట్టెలో పెట్టి నిద్ర కొరిగాడు అతడికి మిగిలిన రాత్రి ఎట్లా గడిచింది ఎవరికీ పట్టలేదు. శనివారం తెల్లవారు ఝామున అతని తల్లి తంజావూరుకు బయలుదేరింది "నీకు నచ్చిన అమ్మాయి నాకు నచ్చదా అమ్మా, నువ్వు చూస్తే చాలు" అని తప్పించుకున్నాడు కొడుకు.

ఆ తర్వాత రెండు రోజులకు చెల్లెల్ని తీసికెళ్ళడానికి కృష్ణమోహన్ వచ్చాడు. వదులు

---

* ఒక అందమయిన అమ్మాయిని పరీక్షచేసి డాక్టరిలా అన్నాడు.

"శ్రీమతి సుధగారూ! మీకో శుభవార్త"

'నాకింకా పెళ్ళికాలేదండీ'

"అయితే చెడ్డవా

పైజమా, గోధుమరంగు సిల్కు లాల్చీలో మధుర మోహనంగా తోచాడు అనంత మనస్సుకు. కొన్ని క్షణాలు మ్రాన్పడిపోయి అతన్నే చూస్తుండిపోయింది. కృష్ణమోహన్ తెల్లబోయి అటు తిరిగేసరికి అనంతకు ఒళ్ళు తెలిసింది. 'మేము వెళ్ళివస్తాం మామయ్యా' అన్నాడు కృష్ణమోహన్. 'అప్పుడే వెళ్ళడమేమిటోయ్. రేపు మా అనంత పుట్టిన రోజు. రేపువుండి ఎల్లుండి వెళ్ళండి. ఏమే అనంతా మర్చిపోయావా నీవు' అన్నాడు నారాయణరావు. పుట్టినరోజు సంగతి నిజంగానే మర్చిపోయింది అనంత. కృష్ణమోహన్ ఏటూ చెప్పలేక యిరుకున బడ్డాడు. మోహిని సంతోషంగా 'వుందాం అన్నయ్యా, ఎల్లుండి వెళ్దాం' అన్నది. దాంతో ప్రయాణం ఆగిపోయింది. మోహిని అన్నను పిలిచి 'మరేమయినా బహుమతి కొనుక్కురా అనంతకు' అన్నది. 'నాకేం తెలుసు సెలక్షన్' అన్నాడు చిరాగ్గా! 'ఎప్పుడూ తెలీదంటే ఎట్లా కుదురుతుంది వెళ్ళి చూడు. మంచిది పట్టుకురా' అన్నది చెల్లెలు.

'ఎవరెవరిని పిలుస్తావో, ఏం చెయ్యమంటావో యివాళ సాయంత్రం లోపల చెప్పు' అన్నది జానకి అనంతతో.

'పుట్టినరోజుకు ఏం చేస్తారు మీరు' అనడిగింది మోహిని

'ఏమీ చెయ్యం మోహినీ. స్నేహితులను నలుగురిని పిలుచుకుని సరదాగా కలిసి భోంచెయ్యడమే. కేకులూ, కాండిల్సూ ఏమీ అలవాటు లేవు. అత్తయ్య మాత్రం గోపాలస్వామి గుళ్ళో అర్చన చేయిస్తుంది' అన్నది అనంత.

కృష్ణమోహన్‌కు ఈ వుండిపోవడం యిబ్బందిగా వుంది. చెల్లెలి మీద విసుక్కున్నాడు. ఎన్ని పనుల మీద ఎక్కడికెళ్ళినా, రాత్రి ఏవేళకైనా గుంటూరులో తన యింట్లో తన పక్కమీద పడుకుంటేనే హాయి అతనికి. ఎక్కడికి వెళ్తే అక్కడే అతుక్కుపోయే రకం అతని చెల్లెలు. బజారెళ్ళాడు కాని ఏమి కొనాలో తెలియలేదు. దంతంతో చేసిన రాధాకృష్ణ ప్రతిమ తెచ్చి చెల్లెలికిచ్చాడు. ముద్దులు మూటగట్టే ఆ బొమ్మను చూసి మురిసిపోయింది మోహిని. 'భలేగా తెచ్చావు. ఏమీ తెలీదంటావే మరి' అన్నది అన్నతో. మర్నాడు జానకి అనంతతోపాటు మోహినిక్కూడ క్రొత్త చీర యిచ్చింది కట్టుకోడానికి. అనంత క్లాస్‌మేట్స్ ఆరుగురు వచ్చారు. మోహన్‌కు తోడుగా వుంటాడని బాలకృష్ణన్‌కు కూడా కబురు పంపాడు నారాయణరావు. అందరు కలసి మాటల్లోపడి భోజనాలు గంటున్నరకుగాని తెమలనిచ్చారు కాదు. బాలకృష్ణన్ 'సాత్రే' కథలు తెచ్చిచ్చాడు.

అనంత స్నేహితులు జేమ్సుబాండ్, పెర్రీమాసన్ నవలలు తెచ్చారు ఆ యిద్దరి గురించే మాట్లాడారు. నారాయణరావునవ్వి 'ఒకప్పుడు రచయిత సృష్టించిన పాత్రలు రచయితనే డామినేట్ చేస్తాయి. ఆ పుస్తకాల గురించి వాళ్ళుమాట్లాడు తున్నారా, రచయితల పేర్లు తలవనైనా లేదు' అన్నాడు బాలకృష్ణన్‌తో. రాధాకృష్ణులబొమ్మ మోహాని యిచ్చింది. 'ఎవరు తెచ్చారి ది అనడిగాడు నారాయణరావు. "అన్నయ్య" అన్నది మోహిని. నారాయణరావు ముఖం చిట్లించాడు. అంత హడావుడి లోనూ అనంత ధ్యాసంతా కృష్ణ మోహాన్ మీదే వుంది. తనకు తెలీకుండానే అతన్ని పూరికే చూడ్డం మొదలు పెట్టింది. ఒళ్ళు తెలిసి మళ్ళీ సర్దుకుని. కబుర్లలో పడటం—యిట్లాగ గడిచిందామెకు. "ఏమిటిట్లా అయ్యాను నేను, నాకేమి దయ్యం పట్టలేదు కద!" అనుకుంది. బాలకృష్ణన్ రాగానే అనంతను అభినందించి పుస్తకం యివ్వడం తప్పించి మళ్ళీ మాట్లాడలేదామెతో. కాని ఆ విషయం ఎవరూ గురించలేదు అనంత కంత కన్నా పట్టలేదు స్నేహితులు బల వంతం చెయ్యగా అనంత, మోహిని చెరికాసేపు వీణ వాయించారు. అపర సరస్వతిలా వీణ వాయించిన మోహినిని చూసి "నయమే చదువు అంటకపోయినా సంగీతం బాగానే వచ్చింది పిల్లకు' అనుకున్నాడు నారాయణరావు వచ్చిన వాళ్ళంతా వెళ్ళాక నారాయణరావు అనంతను పిలిచి మరి నా బహుమతి తీసుకో పూ" అన్నాడు. "ఇవ్వు మామయ్యా" అంది అనంత. నారాయణరావు డ్రాయరు తెరిచి అందులోంచి, చిన్నపిల్లలువాడుకునే డ్రాయింగు పుస్తకం తీసి ఇచ్చాడు అనంతకు. అనంత ఆశ్చర్యంగా పుసకం విప్పి చూసింది. అన్ని పేజీ లోనూ పెన్సిల్‌తో గీసినబొమ్మలు. నారాయణరావుకు కార్టూన్స్ గీసే అలవాటుంది. ఆ విధంగా గీసిన బొమ్మలే అవి. ఒక పేజీలో ఒక్క మ్మాయి గౌను వేసుకుని కాన్వకేషన్‌లో డిగ్రీ తీసుకునే బొమ్మ. ఇంకోటి లేబరేటరీలో పనిచేసే అమ్మాయి ఇంకోటి రాత్రి ఒక గంట చూపించే టైమ్ పీస్. వెలిగే టేబుల్ లైటు బల్లనిండా పుస్తకాలు, మెమచి తెరిచిన పుస్తకంమీదనె నిద్రపోయే అమ్మాయి, ఇంకోటి ఒక పెద్ద సభలో స్టేజిమీద మైకు ముందు నిలబడి మాట్లాడే అమ్మాయి, ఇంకోటి నిండోలగములో ఒకమ్మాయికి ఎవరో వృద్ధుడు మెడల్ తగిలిస్తున్నాడామె దునులకు. జనం చప్పట్లు కొడుతున్నారు. చివరి పేజీలో ఆ అమ్మాయి మెడనిండా పూలదండలతో, ముఖంలో విజయ గర్వంతో నిలబడివుంది. అనంత పుస్తకమంతా చూస్తుంటే నారాయణరావు అనంతవంకే చూస్తున్నాడు పుస్తకం ముగించేసరికి-వీడో

# సొగసైన కురులు



రీటా

ఒత్తుగా, అందంగా జుట్టును పెంచుతుంది

ఒకరి శిరోజ సౌందర్యంచూచి మరొకరు ఇక ఎంతమాత్రం అసూయపడవలసిన అవసరం లేదు. రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి.




వీటో కంపెనీ,
మద్రాసు 1


బరువు మోస్తున్నట్లు అనిపించింది అనంతకు నెమ్మదిగా కళ్ళెత్తి "మామయ్యా" అన్నది నారాయణరావు అనంత వీపుతట్టి ఆమె చెవిలో చెప్పినట్లుగా "అవన్నీ నా కలలు అనంతా నా డ్రీమ్స్" అన్నాడు అనంత తెప్పరిల్లి "మీ కలలు నిజమవుతాయి మామయ్యా, నిజంగా నిజమవుతాయి, నన్ను నమ్మతారా" అన్నది.

నారాయణరావు "నీ శక్తిసామర్ధ్యాలు నాకు తెలుసు అనంతా అందుకే నీమీద అన్ని ఆశలు పెంచుకున్నాను" అన్నాడు. అనంత పుస్తకం ఎవరికీ చూపలేదు. తన బీరువాలో పెట్టి తాళం వేసింది. ఆ మర్నాడు కృష్ణమోహన్ చెల్లెల్ని తీసుకుని వెళ్ళిపోయాడు. మళ్ళీ తన కాలేజి, చదువు గొడవలో పడిపోయింది అనంత. ఆరు నెల్లకు మళ్ళీ పరీక్షలు రావడం, తర్వాత కాలేజి మూయడం కూడా జరిగింది. వాసు ఆ సంవత్సరం యం. ఏ, లా రెండు పరీక్షలు వ్రాసి సెలవులకు యింటికి వచ్చాడు.

ఆ మధ్యాహ్నం భోజనాలయ్యాక మధ్యహాల్లో జానకి, వాసు అనంత కూర్చుని మాట్లాడుకుంటున్నారు నారాయణరావు గదిలో పడుకుని పేపరు చూస్తున్నాడు. చెప్పుల చప్పుడువిని వాకిట్లోకి వచ్చింది అనంత "అత్తయ్యా—నాన్న, అక్కయ్య వస్తున్నా"

రంది జానకి గూడ బెటుకు వచ్చింది వసంత భుజంమీద చెయ్యేస్తూ "ఎప్పుడొచ్చావు మద్రాసునుంచి, ఉత్తరమే వ్రాయలేదే" అని "కాళ్ళు కడుక్కోండి అన్నయ్యా" అన్నది జానకి రాఘవరావును చూస్తు. "భోంచేసే వచ్చామమ్మాయ్" అన్నాడాయన. వసంత పర్సు చెల్లెలి చేతికిస్తూ "లోపల పెట్టు" అన్నది. "పరీక్షలెట్లా వ్రాశావ్ బాగా వ్రాసావా?" అనడిగింది అనంత. "ఆఁ బాగానే వ్రాశా"నంది వసంత వాసు నాలుగయిదేళ్ళ తర్వాత వసంతను చూచాడు రెప్ప ఆర్పకుండా చూచాడామెను. తెల్లగా పొడుగ్గా, సన్నగా వుంది వసంత. కుచ్చెళ్ళు క్రింది జీరాడుతూ కట్టిన చీరలో, పొట్టి చేతుల బాక్ బటన్స్ బ్లౌజుతో, చెవులను కప్పుతూ మెడ కన్పించేలాగ పైకి చుట్టిన జుట్టుతో, అద్దంలాగ మెరిసే మెడలో ఒక వరస ముత్యాల దండతో, అందమైన మోడల్‌గా వుంది వసంత. చామనచాయకు కాస్త మించిన రంగులో, పొడుగు పొట్టికాని ఎత్తులో, ముఖానపడే ముంగురులతో, రెండు పొట్టి జడలతో, ముద్దు వచ్చే మేకపిల్లలాగున్న అనంతను చూచి వాసు "మద్రాసు మద్రాసే, బందరు బందరే!" అనుకున్నాడు. వసంతకు ఏదో సంబంధం వచ్చిందట. పెళ్ళికొడుకు 'ఎరోనాటిక్స్ ఇంజనీరట' బెంగుళూరులో క్రొత్తగా వుద్యోగమయిందట పిల్లను చూసుకోడానికి బందరు రమ్మని కబురుపెట్టి, కూతురును బందరు తీసుకు వచ్చాడు రాఘవరావు. జానకి సంతోషించింది నిజంగానే పెళ్ళివాళ్ళకు స్వాగతం చెప్పేటట్టు సిద్ధమైనది. ఇల్లు దులిపి కడిగించింది. తలుపులకు, కిటికీలకు తెరలు మార్చింది. ఆ మర్నాడు ఒంటిరిగా వచ్చిన పెళ్ళికొడుకును చూసి ఆశ్చర్యపోయారు

[సశేషం]



# లింకన్ - చిత్రమైన



ప్రెసిడెంట్ కెనెడీ హత్య జరిగిన తర్వాత, ఆయనకు అబ్రహాం లింకన్‌కు గల పోలికలెన్నో - ఎవరు కని పెట్టారో గాని - ప్రచారంలోకిరావడం ప్రారంభించాయి కొన్ని చూడండి —

కెనెడీ, లింకన్ లిద్దరూ నీగ్రోల పౌరస్వత్వాలకోసం ఎంతో కృషిచేశారు. లింకన్ 1860 లో ప్రెసిడెంట్‌గా ఎన్నికైనాడు సరిగా నూరేళ్ల తర్వాత 1960 లో కెనడీ ఎన్నికైనాడు వారిద్దరు తుపాకిగుళ్ళు తలకు తగిలి మరణించారు హత్యసమయంలో వారి భార్యలు భర్తలప్రక్కనే వున్నారు లింకన్ హంతకుడు జాన్‌విల్క్స్‌బూత్ పేరులో వలెనే కెనెడీ హంతకుడు లీహార్వేఆస్వాల్డ్ పేరులోకూడా 15 ఇంగ్లిషు అక్షరాలున్నాయి. లింకన్ పేరులో వలెనే కెనెడీ పేరులో కూడా ఏడు ఇంగ్లిషు అక్షరాలున్నాయి.

లింకన్, కెనెడీలతర్వాత ప్రెసిడెంట్లుగా వచ్చినవారి

# కెనెడీ
# కొన్ని పోలికలు



ద్దరిపేర్లు జాన్సనే. ఇద్దరూ సెనెటర్లుగా పనిచేసినవారే. ఇద్దరు దక్షిణ రాష్ట్రాలకు చెందిన డెమొక్రాట్లే. ఒకరి పేరు యాండ్రూ జాన్సన్, మరొకరిపేరు లిండన్ జాన్సన్ (ప్రస్తుతం ప్రెసిడెంట్) వీరిద్దరి పేర్లలోను చెరి పదమూడు ఇంగ్లీషు అక్షరాలున్నాయి. యాండ్రూ జాన్సన్ 1808 లోను, లిండన్ జాన్సన్ సరిగా నూరేళ్ళ తర్వాత 1908 లోను జన్మించారు.

లింకన్ హంతకుడు జాన్ విల్క్స్ బూత్ 1839 లోను, కెనెడీ హంతకుడు లీహార్వే అస్వాల్డ్ సరిగా నూరేళ్ళ పిదప 1939 లోను పుట్టారు. లింకన్‌కు కెనెడీ అనే సెక్రటరీ వుండేవాడు. అతడు లింకన్‌ను హత్య రోజు రాత్రి ఫోర్డ్స్ థియేటరుకు వెళ్ళవద్దని వారించడానికి యత్నించాడు. ప్రెసిడెంట్ కెనెడీ వద్ద లింకన్ అనే సెక్రటరీ వుండేవాడు. అతడు కూడా కెనెడీని డలస్ నగరానికి వెళ్ళకుండా ఆపడానికి యత్నించాడు. బూత్ లింకన్‌ను ఒక థియేటరులో తుపాకితో కాల్చి వెంటనే ఒక షాపులోకి పారిపోయాడు. అస్వాల్డ్ కెనెడీని ఒక షాపులో నుంచి తుపాకితో కాల్చి ఒక థియేటరులోకి పారిపోయాడు.

పోలికలిక్కడితో ఆగిపోతాయి. లింకన్ తర్వాత ప్రెసిడెంట్ అయిన యాండ్రూ జాన్సన్‌ను ఎన్నికలలో జి అనే ఇంగ్లీషు అక్షరంతో ప్రారంభమయ్యే పేరుగల రిపబ్లికన్ జనరల్ - గ్రాంట్ - ఓడించాడు. కాని కెనెడీ తర్వాత ప్రెసిడెంట్ అయిన లిండన్ జాన్సన్ ఎన్నికలలో జి అనే అక్షరంతో ప్రారంభమయ్యే పేరుగల రిపబ్లికన్ జనరల్‌ను - గోల్డ్ వాటర్‌ను ఓడించి ప్రెసిడెంట్ అయ్యాడు. (గోల్డ్‌వాటర్ విమానదళంలో మేజర్ జనరల్.)

# కూలివాడైన మహారాజు

పూర్వం పోలెండును పరిపాలించిన ఒక మహారాజు కథ ఇది. నీతికథలా కనిపిస్తుంది గాని, నిజంగా జరిగిందనే పోలెండు చరిత్ర తెలుపుతున్నది.

ఆ మహారాజు ఒకనాడు వేటకువెళ్ళి ఉన్నట్టుండి మాయమై పోయాడు. మంత్రులందరు కట్టుకట్టుకుని చాలరోజులు రాజ్యమంతా అన్వేషించారు చివరికి ఒక పట్టణంలో ఆయన కనిపించాడు. అయితే మహారాజు కూలివానివలె మాసిన, చిరిగిన దుస్తులు ధరించి వున్నాడు. బజారులో వారివి, వీరివి సామానులు మోస్తూ, కూలి డబ్బులు సంపాదించుకుంటున్నాడు.

పోలికలన్నీ రాజుగారివే.కాని మంత్రులు తమకళ్ళను తామే నమ్మలేక పోయారు. తమరాజుగారు కూలిపనులు ఎందుకు చేస్తున్నారు? చివరికి ఆయన మాటలు, చేష్టలు అన్నీచూసి రాజుగారేనని నిర్ధారణ చేసుకొని సమీపించారు.

"మహారాజా! తాము ఇంత నీచవృత్తిని ఎందుకు స్వీకరించారు? రాజ్యాన్ని వదలిపెట్టి, ఈ బరువులు మోస్తూ కూలి డబ్బులు సంపాదించుకోవలసిన అవసరం మీకేంకలిగింది? " అని వారు వాపోయారు.

రాజుగారిలా అన్నారు: " మంత్రులారా! నేను వదలిపెట్టి వచ్చిన బరువు ముందు ఈ బరువులొక లెక్కకాదు. రాజ్యభారం మోయడం కంటె ఈ సామానులు మోయడమే తేలిక!

అయితే ఇలాగే వుండిపోవాలని మీనిశ్చయమా? "

రాజుగారు చిరునవ్వు నవ్వి ఇలా అన్నాడు: "నేను రాజ్యం చేసిన నాళ్ళు ఎన్నడూ నిద్రపోనంత హాయిగా రెండు వారాలనుంచి నిద్రపోతున్నాను. మొదటిసారిగా జీవితం అంటే ఏమిటో తెలుసుకున్నాను ఇప్పుడు నిజంగా నాకు నేను మహారాజును. పొండి. మీ ఇష్టం వచ్చిన వాడిని రాజుగా ఎన్నుకోండి. నేను మళ్ళీ ఆ సింహాసనం మీద కూర్చో దలచ లేదు. నాకీజీవితమే హాయిగావుంది. "

ఇలా అని మళ్ళీ ఎవరిదో సామాను నెత్తిపై పెట్టుకుని రాజుగారు తనదారిన తాను పోయాడు. ఆయన తన రాజధానిలో తిరిగి ఒక్కసారైనా అడుగు పెట్టలేదు.

# ఫిలిం ప్రముఖుల దృష్టిలో ఫిలిం జర్నలిజం

## సినిమా

ఆంధ్ర ఫిలిం జర్నలిస్టు సంఘం రజతోత్సవం ఏప్రిల్ నాల్గవ తేదీ రాత్రి మద్రాసు వాణీ మహల్‌లో జరిగింది. అలనాటి ఫిలిం పత్రికా రచయితలు సముద్రాల రాఘవాచార్య, కమలాకర కామేశ్వరరావు, ముద్దాలి సత్యనారాయణశర్మ, కొడవటిగంటి కుటుంబరావు, అలనాటి ఫిలిం దర్శకులు హెచ్. వి. బాబు, సి. పుల్లయ్య, పి. పుల్లయ్య, అలనాటి ఫిలిం హీరోలు ఆరణి సత్యనారాయణ, కె రఘురామయ్య, అలనాటి ఫిలిం హీరోయిన్‌లు సురభి కమల, ఋష్యేంద్రమణి, అలనాటి ఫిలిం స్టూడియో నిర్మాత సిడమర్తి సూరయ్య వంటి పెద్దలు, ప్రభుత్వపు అవార్డులు, అంతర్జాతీయ ఉత్సవ ప్రదర్శనార్హత సంపాదించిన ఫిల్ములకు సంబంధించిన డి. మధుసూదనరావు, ఏ. వి. సుబ్బారావు, వి. మధుసూదనరావు, సి. ఎస్. రావు, నాగేశ్వరరావు, గుమ్మడి, రామినీడు మొదలైనవారు స్వయంగా రజతోత్సవ సందర్భ గౌరవ పత్రాలు స్వీకరించారు.

మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి టి. రామప్రసాదరావు అధ్యక్షత వహించారు మద్రాసు హైకోర్టులో మరొక న్యాయమూర్తి ఎన్. కృష్ణస్వామి రెడ్డి గౌరవ పత్రాలు అందజేశారు.

సమకాలిక సమాజాన్ని చైతన్యవంతం జేసే చిత్రాలు కూడా తీయవలసిందని న్యాయమూర్తులు తమ తమ ప్రసంగాలలో ఉద్బోధించారు.

ఫిలిం రంగానికి చెందిన కొందరు ప్రముఖులు ఆనాటి సభలో ఫిలిం పరిశ్రమకు, ఫిలిం జర్నలిజంకు కల సంబంధం గురించి తమ తమ ప్రసంగాలలో ప్రసావించారు మరి కొందరు సందేశాలలో తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వాటిలోని ముఖ్యాంశాలను దిగువ క్రోడీకరిస్తున్నాము :

### "పద్మశ్రీ" నాగయ్య

నటుడు పైకిరావడానికి పత్రికలు ఎంతో దోహదం చేస్తాయి. నటునికి అవి మార్గదర్శకాలు. ఒక ప్రముఖ పత్రిక – ఆంధ్రపత్రిక – ఫిలిం బాలెట్ నిర్వహించి నన్ను ఉత్తమ నటునిగా ఎన్నుకొని నాకిచ్చిన ప్రోత్సాహం

వల్లనే నేటింతటి నటుణ్ణి కాగలిగాను.

## అక్కినేని నాగేశ్వరరావు

ఫిలిం పరిశ్రమాభ్యున్నతికి పత్రికలు ఎంతో సేవ చేసాయి. నేను ఆత్మనమ్మకం కలవాళ్ళలో ఒకణ్ణి. నటీనటులకు పత్రికా విమర్శలు మార్గదర్శకాలు. శాసన సభలలో ప్రతిపక్షం ఎంత అవసరమో సినిమా శాసన సభలో పత్రికలు అంత అవసరం.



శ్రీ ఎస్. వి. ఆర్. ఫిలిమ్స్ "చదరంగం" లో జమున

మానవ సమాజ సర్వతోముఖ వికాసానికి దోహదం చేసే ఆధునిక సాధనాలలో సినిమా ప్రథమస్థానం ఆక్రమిస్తోంది. ఈ సత్యాన్ని బాహ్య ప్రపంచానికి పదేపదే చాటి చెప్పే వాళ్ళు ఫిల్మ పత్రికా రచయితలు.

## సి. ఎస్. రావు

మా తండ్రిగారు సి. పుల్లయ్యగారి తరపున మాట్లాడుతున్నాను. నా స్వానుభవం ఒక్కటి చెప్పదలచాను. నేను 'ప్రచండభైరవి' తీసినప్పుడు పత్రికలు కొన్ని ఘాటు విమర్శలు చేశాయి. వాటితో నేను వేల్లొకున్నాను. 'ఫలితం "కంచుకోట" అని సగర్వంగా చెబుతున్నాను.

## ఘంటసాల

ఫిలిం విమర్శలు నిర్మాణాత్మకంగా వుండాలి. వినాశకరంగా వుండరాదు. మన మందరం ఒకే కుటుంబానికి చెందిన వాళ్ళం. మా వినాశం మీరు కోరవద్దు.

## సావిత్రి

తల నెరసిన పెద్దలతోపాటు నా వంటి చిన్నదాన్ని కూడా జర్నలిజం గుర్తించడం ఆనందదాయకం.

## పి. చెంగయ్య

పాతికేళ్ళకు పైగా సినిమా రథ చక్రాలక్రింద నలిగి ఆరోగ్యం, ఆర్థిక బలం లేక మిగిలివున్న వారిని



పద్మశ్రీ పిక్చర్సువారి "ప్రాణమిత్రులు" చిత్రంలో
ప్రాణమిత్రులుగా నాగేశ్వరరావు, జగ్గయ్య

జమలకు జ్ఞాపకం చెయ్యడంతో జర్నలిం సార్థకమైంది

ఎస్. వి. రంగారావు

ఫిలిం జర్నలిజంకు ఉజ్వల భవిష్యత్తు వుంది.

## కొత్త సినీకథకుడు
## జి. వి. జి.

సినిమా పత్రిక ఎడిట్ చేస్తూ డిటెక్టివ్ కథలకు పేరొందిన జానపద చిత్రకథకుడిగా పరిచయమైన జి. వి. జి. పూర్తి పేరు శ్రీ గడియారం వెంకట గోపాలకృష్ణ శర్మ. 1932 జనవరి 16 వ తేదీన బెంగుళూరులో జన్మించారు సూళ్ళూరుపేటలోను, బెంగుళూరులోను విద్యాభ్యాసం జరిగింది.

అప్పటికింకా హైదరాబాద్‌లో రేడియో దక్కన్ రేడియోగా వుంది. మంచి కంఠం, ఎలా కావాలంటే అలా పలుకగల నేర్పు, కొంచెం చమవైనా ఘనమైన కలం కల జి. వి. జి. దక్కన్ రేడియోలో అనౌన్సరుగాను, స్క్రిప్టు రైటర్‌గాను చేరారు.

కలం, కంఠం, కళవైపు కన్ను

వేయించాము జి. వి. జీ.కి. నాటకకళ పై ఆసక్తి కలిగింది తర్వాత మెట్టు సినిమా. వేదాంతం రాఘవయ్య గారు మద్రాసులో 'దేవదాసు' తీస్తున్నారు.

అప్పటికే పత్రికా రచయితగా, రేడియో కళాకారుడుగా పరిచితుడై చక్కటి కనుముక్కు తీరున్న జి. వి. జి.ని 'దేవదాసు'లో మహేంద్ర భూమికకు తీసుకొన్నారు. న్యూ థియేటర్స్ 'దేవదాసు'లో దర్శకుడు బారువా స్వయంగా ఆ భూమికను ధరించారు అంటే జి. వి. జి. కి ఆ పాత్రను ఇవ్వడంలో గల విశేషం స్ఫురిస్తుంది.

ఒక సినిమా అయ్యాక జి. వి. జి. మద్రాసులోనే వుండిపోయారు. జర్నలిజంను వృత్తిగా తీసుకొనవలసి వచ్చింది. 'డిటెక్టివ్' పత్రిక ఆయన్ను అంకులో స్తిమితపరచింది; స్థిరపరచింది.

ఇప్పటికీ రేడియోలో నాటకాలు వేస్తూ వుంటారు. సినిమాలో చిల్లర మల్లర పాత్రలు హుషారు పుడితే వేస్తారు. నవలలు వ్రాశారు. సినిమా తారల జీవిత గ్రంథాలు వ్రాశారు. ఫోటోగ్రాఫర్ అయ్యారు. 'ఒక సినిమా పత్రిక'కు అసోసియేట్ ఎడిటర్ ఇప్పుడు 'భువనసుందరికథ' కథకుడు.

## "భువనసుందరి కథ"

పరకాయ ప్రవేశ విద్యవల్ల పాత శరీరంలో కొత్త ఆత్మచేరి స్వార్థం పెంచుకొంటే వచ్చే తిప్పలను శ్రీ దేవీ ప్రొడక్షన్స్‌వారి 'భువనసుందరి కథ' వినోదాత్మకంగా చిత్రించింది.

కాంచనపురం రాకుమార్తె భువనసుందరిని (కృష్ణకుమారి) విచిత్రపురం రాకుమారుడు చంద్రసేనుడు (రామారావు) ప్రేమించాడు. అయితే ఆ రాకుమార్తెనే ఆ రాజ్యం (కాంచనపురం) రాజగురువు (ధూళిపాళ) కుమారుడు దేవదత్తుడు (సత్యనారాయణ) మోహించి, దౌర్జన్యం జరిపి, తండ్రిచేతనే భువనేశ్వరీ పీఠ మరణశిక్షకు గురై, తండ్రి మాయోపాయంచేతనే బ్రతికి బైటపడి దొంగబ్రతుకు సాగిస్తున్నాడు. చంద్రసేనుని కొత్త వాహనం ఎగిరే పల్లకిని దేవదత్తుడు అపహరించి, రాకుమార్తెను బలాత్కారం చేశాడు. ఇంతలో రాజభటులు రాగా అతడు పరారీ అయ్యాడు. దేవదత్తుడు తనను బలాత్కారం చేశాడని రాకుమార్తె చెబుతుంది. కాని ఎవరూ నమ్మరు. రాజగురువుచే మరణశిక్ష విధించబడిన దేవదత్తుడు బ్రతికి వుండటమనేది కల్ల అని ప్రజలనుంచి రాజు మిక్కిలినేని) వరకు అందరూ నొక్కి చెప్పారు. రాకుమార్తెకి పిచ్చి ఎక్కిందని రాజ



'సాక్షి' చిత్రాన్ని 20 రోజుల వ్యవధిలో సారథ్యం వహించి నిర్వహించిన బాపూ - ఆ చిత్రం నాయకుడు (కృష్ణ) నాయకి (విజయనిర్మల) కి సూచనలిస్తున్నారు.

---

గురువు ప్రకటించి భూతవైద్యం ప్రారంభించాడు.

చిత్ర పరిస్థితులలో ఆమె కూడా పిచ్చిదానిగా నటించక తప్పలేదు. రాకుమారిని సమీపించడానికి రాజభటులనుంచి రజకుడు తిప్పయ్య వరకు అందరూ అదిరిపోతున్నారు. బెదిరిపోతున్నారు.

వివాహానికిపూర్వమే చంద్రసేనుడు భువనసుందరిని ప్రేమించి నందువల్ల శిక్షితుడైనాడు; రాజప్రాసాదంలో తిరిగి కాలు పెట్టలేదు ; రాకుమారిని తిరిగి చూడలేదు.

రాజప్రసాదంలోకి వెళ్ళగలిగిందీ, రాకుమారిని చూడగలిగిందీ రజకుడు తిప్పడు.

ఒకానొక సందర్భంలో తిప్పడు (ఉదయ్‌కుమార్, రాకుమారుడు తారసపడతారు.

ఒక యక్ష కన్యకు (జయశ్రీ) శాపవిముక్తి కలిగించి పరకాయ ప్రవేశ విద్య నేర్చుకొన్న రాకుమారుడు రజకతిప్పడికి ఆ విద్య నేర్పుతాడు. చచ్చిన చేపల పరంగా రజకుని శరీరంలోకి రాజకుమారుని ఆత్మ, రాజకుమారుని శరీరంలోకి రజకుని ఆత్మ ప్రవేశించాయి.

రాజకుమారుని ఆత్మ కల రజకుడు భువనసుందరి భవనంలోకి వెళ్ళి, మూటలో కట్టి తీసుకువస్తాడు. రాజకుమారిని అప్పజెప్పి, నా ఆత్మ నాకిచ్చెయ్యమని రజకుని శరీరంలో వున్న రాజకుమారుని ఆత్మ అర్థిస్తుంది. గూని తిప్పని ఆత్మకు అందమైన రాకుమారుని రూపం వచ్చేసరికి స్వార్థం పెరిగి రాకుమారుని రూపం ఇవ్వనంటాడు.

రజకుని ఆత్మ, రాకుమారుని రూపంకల వ్యక్తికి తిప్పడు పెళ్ళాం (వాణిశ్రీ) వెంటపడతాడు.

రాకుమారుని ఆత్మ, రజకుని రూపంకల తిప్పడను భువనసుందరి స్వీకరిస్తుంది కాని ఇతర ప్రపంచం నమ్మనైనా నమ్మదు.

ఈ ముడి ఎలా విడివడేది?

ఎగిరే పల్లకి వుండి భువనసుందరిని వాంఛిస్తున్న దేవదత్తుడు ఎటువంటి మాయోపాయాలు వేస్తాడు? వాటి (వి)పరిణామా లేమిటి?

ధర్మంపేరుతో అంతా అధర్మమే సాగించిన రాజగురువు పాపం పండదా?

రాకుమారుని కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్న విచిత్రపురం మహారాజుకు (ముక్కామల) కలిగే చిత్రవిచిత్రానుభూతు లేమిటి?

హాస్య ప్రధానంగా హాయిగా సమాధానాలు వస్తాయి చిత్రం చివరి రీళ్ళ నుంచి.

ఒక చేపద్వారా, ఒక ఎలుగు ద్వారా ఇద్దరి ఆత్మలు మార్పు కొనడమనేది ఈ చిత్రంలో ఒక కొత్త.

దుష్టుడు రాజగురువు దౌష్ట్యం ప్రజలకు, రాజుకు తెల్లడి కాకుండా, నాయకుని చేతకాక ఒక ఎలుగు చేత చావడం జానపద సినిమా ఫార్ములాకు అతీతం.

ఎగిరేపల్లకి, అందులోనే క్లయిమాక్స్ కూడా కొత్తే.

అయితే ఆత్మలు, రూపాలు అనే సరికి కొంత అస్పష్టత కన్పిసున్నది. కొంత తికమక కన్పిస్తున్నది. స్క్రీన్ ప్లే రచయిత స్పష్టమైన, ఖండితమైన పద్ధతి అవలంబించినట్లు తోచదు. రాజగురువు తన పంథా అంతా ముందుగానే చెప్పి వెయ్యడంతో ఉత్కంఠ (సస్పెన్స్) తగ్గింది కొడుకుని తన ఇంట్లోనే దాచడం కూడా సరికాదు.

ఈ చిత్రం యూనిట్ వివరమిది,

సాంకేతిక వర్గం: కథ: జి.వి.జి, స్క్రీన్ ప్లే, సంభాషణలు: బి. ఎల్. ఎన్. ఆచార్య, పాటలు: కొసరాజు, నారాయణరెడ్డి, దాశరథి. ఛాయాగ్రహణం: సి. నాగేశ్వరరావు. కళ: వాలి. కూర్పు: బి. గోపాలరావు. సంగీతం: ఘంటసాల. దర్శకత్వం: సి. పుల్లయ్య. నిర్మాణం: తోట సుబ్బారావు. ట్రిక్ వర్క్: హర్బన్స్ సింగ్.

తారాగణం: పైన పేర్కొన్న

వారు కాక అల్లు రామలింగయ్య, జూనియర్ భానుమతి, ఛాయాదేవి, వాణిశ్రీ, సురేంద్రనాథ్ మొదలైన వారు.

రజకుని అత్మ, రాకుమారుని చూపం వున్నప్పుడు రామారావు విశృంఖల నటన మెచ్చదగింది. ధూళిపాళ (రాజగురువు) వాచికం, భావప్రదర్శన ప్రశంసనీయం.

రజక రాణిగా వాణిశ్రీ నటన చెప్పదగ్గది ఎటొచ్చీ గ్లామర్ కొంచెం ఎక్కువైంది.

జానపదంలోనే కొత్త ఫార్ములాను, కొత్త కథకుని శ్రీదేవీ ప్రొడక్షన్స్ సమర్పించింది.



శ్రీ తిరుమలా పిక్చర్స్ వారి "వీరప్రతిజ్ఞ" చిత్రంలో రాజశ్రీ.

# గృహలక్ష్మి

భరణీవారు బెంగాలీ కథలకు వెడుతున్నా తెలుగు సినిమాలలోనే ఒక విడిపుంత త్రొక్కుతున్నారనే చెప్పక తప్పదు.

"బాటసారి"లో హీరో పని పట్టారు. "గృహలక్ష్మి"లో హీరోయిన్ పని పట్టారు.

తెలుగు సినిమా అనగానే ఇద్దరు పిల్లలు (గరల్స్), ఇద్దరు యువకులు (బాయిస్) వుండాలని, కామెడీ ట్రాక్ విడిగా ఒక జంటతో సాగాలని, క్లయిమాక్స్‌లో హీరో తన ప్రతాపం చూపి ఫైటింగ్‌లో నెగ్గాలని అనుకొంటారు. "గృహలక్ష్మి" ఈ పంథా నుంచి పూర్తిగా తప్పుకొంది. కామెడీ అనేది అన్ని పాత్రలలోను వుంది. అన్ని సన్నివేశాలలోను వుంది. విడిగా కామెడీయనీ (హాస్యపాత్ర ధారిణి) అంటూ లేదు. కామెడీ పెయిర్ అంటూ లేదు నిజానికి క్లయిమాక్స్ [illegible]గా కూడా లేదు. నిజానికి సినిమా కథ అంటూ కూడా లేదు ఏదో ఓ చిన్న కథ తీసుకొని, [illegible] పాత్రలు [illegible] అవి వున్నాయికదా అని వా[illegible] మ

ధ్రించే స ఘటనలు చోటిచ్చారు, ఒక్క ఘటన తెచ్చే పరిణామాలకు 15 రీళ్ళతో ముగింపు యిచ్చారు. ఫైటింగులు లేవు. విలన్ లేడు. ఏంగ టీ కథ అయినా ఈ మేరకు తెలుగు సినిమాకు భరణీవారు ఒక కొత్త యిచ్చారనే చెప్పవచ్చు.

"గృహలక్ష్మి" కథను "జ్యోతి" ఏప్రిల్ సంచిలోనే సవివరంగా యిచ్చాము. అందుచేత ఇక్కడ సూక్ష్మంగా మాత్రమే చెబుతాము.

చిట్టిబ్బాయి (నాగేశ్వరరావు) అనే ఒక బి. ఎల్., విద్యార్థి లక్ష్మి (భానుమతి) అనే సౌందర్య లక్ష్మిని వివాహమాడి, పరీక్షలయ్యే వరకు దాంపత్య జీవితాన్ని అనుభవించరాదని చండశాసనుడైన తన తండ్రి భగవంతం శాసించగ బావమరది వాలి (పద్మనాభం) సహాయంతో ఓ కిష్కింధాకాండ సృష్టించి పట్టీలు కొట్టినా తుదకు జంట జీవితం సాధించిన కేవల వినోద కథ యిది:

ఈ చిత్రంలో చిత్రీకరణ శైలి అధునికంగా వుంటే ఇంకా బాగుండేది. ఉదాహరణకు తండ్రిభవంతిలో రాత్రి వేళ తండ్రి అంటే జడిసే బి. ఎల్. విద్యార్థి, భార్య యుగళగీతం పాడుతారు. ఒకేచోట సందర్భదోషంవుంది. నాయికా నాయకులను ఊహాప్రపంచంలోకి తీసుకొని వెళ్ళి అక్కడ రొమాన్స్ చూపిస్తే అధునికంగా వుండేది.

బస హెూటళ్ళలో లగ్నాల బ్రాహ్మణుడు సకుటుంబంగా వుంటున్నట్లు చూపారు. అది బహుశా బెంగాల్‌లో సంభవమై వుండవచ్చు. మన ప్రాంతాలలో ఇప్పుడు ఇట్టిది లేదు.

ఇద్దరు యువతీ యువకులు ఒక హెూటల్‌లో వుంటే ఓ వానరమూకవంటి కో-లాడ్జర్స్ అభ్యంతరం చెప్పారనడం కూడా కాలోచితంగా, ఆంధ్రోచితంగా కన్పించదు.

అయితే నాలుగు లైనుల కథను 15 రీళ్ళ వినోద చిత్రంగా రూపొందించగలిగారూ అంటే అది రచయితకు (డి. వి. నరసరాజు), దర్శక నిర్మాతకు (రామకృష్ణ) గర్వకారణం.

చాలాకాలానికి నాగేశ్వరరావు ఒక హాస్య భూమికను ధరించారన్న సంతోషం కలుగుతుంది. హీరో వేషాలలో ఎందరినో చిత్తు చేసే నాగేశ్వరరావు ఇందులో అందరికీ వంగి తుదకు సానుభూతితో అందరినీ వంచుతారు. చిట్టచివరి దృశ్యాలలో తన పథకం అడ్డు తిరిగిన వైనం బలమైన సస్పెన్స్‌తో చిట్టిబ్బాయి (నాగేశ్వరరావు) తెలుసుకొని, అ తెలుసుకొనడానికి గొప్ప యాక్టింగ్ స్కోప్ యిచ్చివుంటే నాగేశ్వరరావు నటన చిరకాలం నిలచేది.

"పద్మశ్రీ" భానుమతి గానం ఆ బిరుదును నిలుపుకొంది. కొత్త



"మూగజీవులు" చిత్రములో రాజకుమర్, ప్రసన్నలక్ష్మి

పెళ్ళికూతురుగా నటించడం ఎంత కష్టమో ఆమె తన ఉత్తమ నటన ద్వారా నిరూపించ గలిగారు.

ఎస్. రాజేశ్వరరావు తాను రాగ రాజు అని మళ్ళీ ఇన్నాళ్ళకు ఈ చిత్రంతో నిరూపించు కొన్నారు.

రంగారావు, ప్లీడరు గుమాస్తా భూమికలో చలపతి, మద్రాసు "సి.ఐ.డి." గా కె. వి. చలం సహజంగా నటించారు.

పైన పేర్కొన్న ప్రముఖులుకాక ఇంకా క్రింది వారు 'గృహలక్ష్మి' నిర్మాణంలో యథోచిత 'పాత్ర' ధరించారు

సాంకేతిక విభాగం పాటలు సముద్రాల రాఘవాచార్య, ఆరుద్ర, కొసరాజు, సి. నారాయణరెడ్డి దాశరథి. పాటల రికార్డింగ్ కోటేశ్వరరావు, మాట రికార్డింగ్ : సీతం రాజు రామారావు, ఛాయాగ్రహణం: సి. నాగేశ్వరరావు. కూర్పు : హరినారాయణ. నిర్మాణ నిర్వహణ : వేణునాధ్. అభినయ విభాగం: సూర్యకాంతం, నాగరాజారావు, లంక సత్యం, బాలకృష్ణ, రామలింగయ్య, రాజబాబు, కొండలరావు, ఋష్యేంద్రమణి.

* * *

పద్మశ్రీవారి 'ప్రాణమిత్రులు', ఎన్ ఏ టి రామకృష్ణ కంబైన్స్ 'ఉమ్మడి కుటుంబం' ఏ క్షణంలోనైనా విడుదల కావచ్చు

# చలన చిత్ర వార్తలు

## అంతా కొత్తతారల చిత్రం ప్రారంభం

రవి ప్రొడక్షన్స్‌వారి అంతా కొత్తతారల చిత్రం సాంఘికం షూటింగ్ ఏప్రిల్ మొదటి వారంలో మద్రాసు వీనస్ స్టుడియోలో ప్రారంభమైంది. వారసత్వం నిర్మాతలలో ఒకరైన ఎం. రంగారావు ఈ చిత్రం నిర్మాత. దాదాపు అన్ని భూమికలకు కొత్తవారినే తీసుకొన్నారు. దర్శకుడు అనిసెట్టి అప్పారావు (తొలిప్రయత్నం). దర్శక పర్యవేక్షణ : చాణక్య.

గుంటూరు నివాసి శేషగిరిరావు హీరోగాను, ఇందిర హీరోయిన్‌గాను, అంజిబాబు విలన్‌గాను వెండితెరకు పరిచయమౌతున్నారు. గౌతమి, ప్రభాకరరెడ్డి మొదలైన కొత్తవారు కూడా నటిస్తున్నారు. కథకుడు : సి. వేణు. సంగీతం : కోదండపాణి. ఛాయాగ్రహణం : అన్నయ్య.

కొత్త తారలు అణకువతోనే కాక నదురు బెదురు లేకుండా నటిస్తున్నట్లు వార్తలు అందుతున్నాయి.

## బి. ఆర్. ఫిలిమ్స్ అడవి సెట్

బి. ఆర్. ఫిలిమ్స్ వారి మ్యూజికల్ మిస్టరీలో ఏప్రిల్‌లో శ్రీ వెంకటేశ్వర సినీటోన్‌లో అడవి సెట్‌లో షూటింగ్ జరిగింది. ఎల్. ఆర్. ఈశ్వరి, బసవేశ్వర్‌ల పాట రికార్డు చేశారు.

## డార్జిలింగ్‌లో ఆదుర్తి కొత్త హిందీ తారలు

సునీల్‌దత్ హిందీలో నిర్మిస్తున్న 'కన్నెపిల్ల' చిత్రం తాలూకు ఔట్‌డోర్ షూటింగ్ ఏప్రిల్ 5వ తేదీ నుంచి పక్షం రోజులకు పైగా జరిగింది. 'తేనె మనసులు' ఆదుర్తి సుబ్బారావు ఈ చిత్రం దర్శకులు. బెల్గాం విద్యార్థిని తేనాను నాయిక భూమికకు, సునీల్‌దత్ సోదరుడు సోమదత్‌ను నాయకుని భూమికకు పరిచయం చేస్తున్న ఆదుర్తి – 'తేనె మనసులు' తార విజయవాడ సంధ్యారాణిని హిందీ ఉపనాయికగా కూడా వెండితెరకు అర్పిస్తున్నారు. డార్జిలింగ్ వెళ్ళకముందు మద్రాసులోని ప్రసాద్ స్టుడియోస్‌లో ఈ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం షూటింగ్ కొంత జరిగింది. సంగీత దర్శకుడు రవి.

## హైదరాబాద్‌లో బొంబాయి తెలుగు నాటకం

బొంబాయి ఆంధ్ర మహాసభవారు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మేలో నార్ల చిరంజీవి విరచిత 'భాగ్యనగరం', బొంబాయి మునిసిపల్ డిప్యూటీకమిషనర్ శ్రీ సోమంచి యజ్ఞన్న శాస్త్రి విరచిత 'పేరయ్య

రాజంటు !" నాటకం మే మాసంలో ప్రదర్శించ బోతున్నారు.

"భాగ్యనగరం"లో భాగమతిగా కుమారి సరస్వతీరావు, మల్కిభరాం చక్రవర్తిగా శివరామచంద్రమూర్తి, మలికుతుబ్ షాగా అంజనేయ శర్మ నటించగలరు. నృత్య దర్శకురాలు సుమతీరావు దుస్తులు, అలంకరణలు: ఇంజనీర్ టి ఎస్. రావు. సంగీతం: ఎన్. సి. కృష్ణమాచారి. నాటకదర్శకుడు : కూచిమంచి.

ఈ మధ్య "భాగ్యనగరం" ను బొంబాయిలో ప్రదర్శించగా హిందీ నటుడు వై. డి. జైరాజ్ వంటి ప్రముఖులు ప్రశంసించి "భలే హైదరాబాద్" అన్నారు.

## కృష్ణ రాయబారం చిత్రీకరణ

ఈ సంచిక వెలువడేసరికి తారక రామా పిక్చర్స్‌వారి "శ్రీకృష్ణావతారం" లో శ్రీకృష్ణరాయబార ఘట్టం చిత్రీకరించి వుంటారు. పెద్ద కృష్ణుడుగా రామారావు, చిన్న కృష్ణుడుగా రామారావు కుమారుడు హరికృష్ణ, రుక్మిణిగా దేవిక, సత్యభామగా కాంచన, జాంబవతిగా సుకన్య, శకునిగా లింగమూర్తి నటిస్తున్నారు. ఇంకా ముక్కామల, ధూళిపాళ మొదలైనవారు తారాగణంలో కలరు. దర్శకుడు : కమలాకర కామేశ్వరరావు. నిర్మాత : పుండరీకాక్షయ్య. రచన:సముద్రాల.

కృష్ణ జననంనుంచి యాదవ కులము సలంతో సహా కృష్ణ నిర్యాణం వరకు 18, 19 రీళ్ళలో పకడ్బందీగా సర్వాకర్షకంగా, ఉండాగా చిత్రాన్ని తీర్చి దిద్దేందుకు కమలాకర, పుండరీ కాంక్షయ్య, సముద్రాల ప్రత్యేక శ్రద్ధ వహించారు.

## "పూలరంగడు" ఔట్ డోర్ దృశ్యాలు

అన్నపూర్ణా వారి "పూల రంగడు"లో చివరి పాటను ఏప్రిల్ మధ్యంలో మద్రాసులో రికార్డు చేశారు. దీనితో పాటల పని పూర్తి అయినట్లే. మే ఆరంభంలో ఊటకమండలంలో రెండు పాటల చిత్రీకరణ జరగబోతున్నది. ఒకటి నాగేశ్వరరావు, జమునలపైన, మరొకటి శోభన్‌బాబు, విజయ నిర్మలపైన చిత్రీకరిస్తారు దీనితో "పూలరంగడు" చిత్రీకరణ దశ దాదాపు పూర్తి అయినట్లే. ఒక కొత్త సినిమా రచయిత్రిని, ఒక కొత్త గాయకుని, ఒక కొత్త విలన్‌ను పరిచయంచేసే "పూల రంగడు" నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు. దర్శకుడు ఆదుర్తి. అన్నపూర్ణా చిత్రాలలో సంగీతం ఒక ప్రత్యేకత. ఈసారి దాన్ని ఇనుమడింప జేస్తున్నది ఎస్. రాజేశ్వరరావు.

## వి. మధు కథల కథ

పరాభవ ఉగాదికి సినిమా కథలకై నందీ అవార్డుల వేదికనుంచి

విజ్ఞప్తి చేసిన జగపతి వి మధుసూదనరావుకు దాదాపు 250 కథల దాకా పరిశీలనకు వచ్చాయి. లనూ, ఒక టెక్నీషియను, ఇద్దరు సినీకవులు గల సంఘం వాటిని పరిశీలించింది. కథలయితే కథలుగా బాగానే ఉన్నాయి. కాని సినిమాకు ఎంత వరకు పనికివస్తాయి అన్నది వారికి పెద్ద సందేహమే అయింది. సినిమాకు అనుగుణమైన పద్ధతిలో కథ వ్రాయడమనేది ఒక టెక్నిక్. ఒక ప్రత్యేకత. అందులో ఎన్నో పరిమితులూవున్నాయి, కొన్ని సులువులూ వున్నాయి. మధుసూదనరావు ఈ విషయాలను ఈ రచయితతో ప్రస్తావించి సినిమా కథ అయితే రాలేదని, అయితే రచయితలను నిరుత్సాహ పరచరాదనే ఉద్దేశంతో మామూలుగా చదువుకొనే కథలుగా బాగా వున్న రెండింటికి బహుమతులను ఇస్తున్నట్టు తెలియజేశారు. ప్రథమ బహుమతి వెయ్యి రూపాయలు శ్రీమతి సి. ఆనందారామంగారి "ఆత్మబలి"కి. ద్వితీయ బహుమతి అయిదు వందల రూపాయలు శ్రీమతి నూగూరి శాంతాదేవిగారి "రూపవతి"కి.



హృషీకేశ్ పిక్చర్స్ వారి "అందంకోసం పందెం" లో కాంతారావు, భారతి

## నాగేశ్వరరావుకు కత్తి గాయం వివరాలు

ఏప్రిల్ మూడవ తేదీ మధ్యాహ్నం అక్కినేని నాగేశ్వరరావుకు కత్తిగాయం తగిలింది కుడి అర

చేతిలో దాదాపు రెండు అంగుళాల పొడవున్న అంగుళంలోతు కత్తి దూసుకు పోయినా చలించక గంట న్నర సేపు షూటింగ్‌లో పాల్గొ న్నారు.

లలితా శివజ్యోతి వారి 'రహస్యం' ఈస్ట్‌మన్ కలర్ చిత్రం ఔట్ డోర్ షూటింగ్ జరుగుతుండగా పై దుర్ఘటన సంభవించింది. హైదరాబాదుకు 20 మైళ్ళ దూరంలోవున్న ఒక పర్వత ప్రాంతంవద్ద ఏప్రిల్ 1, 2 3 తేదీలలో షూటింగ్ జరిగింది. మూడవ రోజు షూటింగ్‌లో ఫైటింగ్ చిత్రీకరించారు. భటుల వేషాలలో కొందరు, ఇంకా కాంతారావు, కృష్ణకుమారి, లింగమూర్తి, లంక సత్యం మొదలైనవారు పాల్గొన్నారు. నాగేశ్వరరావుతో ఫైట్ చేస్తున్న భటుడు సినిమా సిగ్నల్స్ తెలుసుకోక పోవడంవల్ల తన కత్తిని నాగేశ్వరరావు కుడి అరచేతిలో పెట్టి రక్కునలాగి వేశాడని, తత్కారణంగా అరచేయి కోసుకు పోయిందని ప్రత్యేక వార్త.

ప్రక్కనవున్న నటీనటులు ఇక అంతటితో షూటింగ్ ఆపేసి వెళ్ళి పోదామన్నారు. అప్పటికింకా రెండు మూడు షాట్‌లు కొరవడి వున్నాయి. తాను ఆ సాయంకాలమే మద్రాసు వెళ్ళిపోవలసి వుందని, ఇప్పుడు షూటింగ్ కాన్సిల్‌చేస్తే పిక్చర్‌కు చాలా యిబ్బంది వస్తుందని నాగేశ్వరరావు చెప్పి, నాటు కట్లు కట్టి మిగతా రెండు మూడు షాట్లూ పూర్తి చేశారు.

ఆ తర్వాత డాక్టరు వద్దకువెళ్ళి, యాంటీ సెప్టిక్ ఇంజక్షన్‌లు తీసుకొని, కట్టు కట్టించుకొని, విమానంలో మద్రాసుకు బయలుదేరారు.

ఆంధ్ర ఫిలిం జర్నలిస్టుల సంఘం రజతోత్సవానికి హాజరవుతానని మాట యిచ్చిన దువల్ల బాధపడుతూనే మద్రాసు వచ్చారు.



రేఖా అండ్ మురళీవారి
"శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న"లో
పద్మనాభం

# జీవన్ టోన్

రిజిస్టర్డు నెం. 218726



పత్రికలలో ప్రకటన చేసిన ఔషధాలను సేవించి, ఫలితాలను పొందనివారు అనేకులున్నారు. కాని జీవన్‌టోన్‌ను కొనుక్కొని దానిని ఉపయోగించి ప్రయోజనంపొందండి జీవన్‌టోన్ కేవలం వనస్పతి కొవ్వునుంచి తయారుచేయబడినది జంతువుల కొవ్వు చేరుటవల్లనే యీ అనుకోనటువంటి బలిష్ఠతకు కారణమని కొందరనుకొందురు. కాని అది యిందు చేరలేదు.

**జీవన్‌టోన్ గుణములు:**

ఎంత మంచి ఆహారము తిన్నా ఎముకల పోగువలె, బలహీనంగా ఉండేవారు కొంతమంది ఉన్నారు. అట్టి వారికి జీవన్‌టోన్ మంచిబలాన్ని, లావును, బరువును ఇస్తుంది. ఆకలి లేనివారికిమంచి జీర్ణశక్తినిస్తుంది. ఇది బలహీనత, కాళ్ళు చేతులు తేలిపోవుట, తల తిరుగుడు, రక్తహీనతను పోగొట్టి, పరిపూర్ణమైన దేహారోగ్యాన్ని, పుష్టిని ఇస్తుంది. శరీరం ఎరుపు ఛాయ పొందటానికి జీవన్‌టోన్‌తో టొమాటోలు తీసుకొనండి. ఆరోగ్యవంతులకు కూడ జీవన్‌టోన్ మంచిది. జీవన్‌టోన్ తీసుకొన్నప్పుడు మీరు కొంతశరీరవ్యాయామం చెయ్యటం మంచిది. లేకపోతే మీ శరీరంఅనవసరంగా లావెక్కుతుంది. కావలసిన బరువు, బలిష్టత చేరినవెంటనే జీవన్‌టోన్ సేవించడంమానండి. స్త్రీలు బహిష్టు కాలంలో తీసుకొనకూడదు.

**వెల : 454 గ్రాములు రు. 10/- వి. పి. పి. కి వ్రాయండి**

Tel: 440206 **JOTHI HOSPITAL,**
**P. B. No. 1413, 32, V. N. Road, MADRAS - 17.**
**Resident Doctor : Dr. DAMODARAM, M. A. I. A. D. S.**

మర్నాటి సాయంకాలం ఆ ఉత్సవాలకు వచ్చినప్పటికీ, వందలకొలది విలన్‌లను అణచిన హీరోగారి చెయ్యి పైకి లేవనే లేదు. బాధతో వంగేవుంది. అయినా అయిదారు నిమిషాలసేపు ప్రసంగించి వెళ్ళారు.

రహస్యం చిత్ర నిర్మాత: శంకర రెడ్డి. దర్శకుడు: వేదాంతం రాఘవయ్య. కళ: టి. వి. ఎస్. శర్మ. రచన: సదాశివబ్రహ్మం.

## నవరంగం వేసే చదరంగం

ఎన్. వి. ఆర్. పిక్చర్స్ వారి "చదరంగం" కథా కథనంలో, అభినయంలో నవరంగం నిర్మించబోతున్నది. ఎస్. వి. రంగారావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆయన నటన బరువుతో, మెరుపుతో సాగటమటుంచి హరనాథ్‌కు అంధునిగా నటించడంలో కొత్త విశేషావకాశమిచ్చింది. ఈయూనిట్ వివరమిది.

సాంకేతిక వర్గం: నిర్మాత: బడేటి సత్యనారాయణ. దర్శకుడు: ఎన్. వి. రంగారావు. సహకార దర్శకుడు: కె. ఎ. నందనరావు. కథ; సంభాషణలు: డి. వి. నరసరాజు. పాటలు: దాశరథి. సంగీతం: టి. వి. రాజు. ఛాయాగ్రహణం: చంద్రశేఖర్. కళ: ఎ. కె. శేఖర్. ఎడిటింగ్: ఎన్. ఎస్. ప్రకాశ్. తారాగణం: ఎస్. వి. రంగారావు, రమణారెడి, ధూళిపాళ, హరనాథ్, రామకృష్ణ, రాజబాబు, భూసారపు, జమున, అంజలీదేవి, సూర్యకాంతం, రమాప్రభ, మీనాకుమారి, అన్నపూర్ణ.

## జయంతి జానపదం: సరోజ హాజరు

వివాహానంతరం బి. సరోజాదేవి కెమెరాను ఫేస్ చేసిన తెలుగు చిత్రం జయంతివారి జానపదం. ఏప్రిల్‌లో జరిగిన షెడ్యూలులో ఆమె, రాజనాల, చిల్లర పాత్రధారులు పాల్గొన్నారు. ఒక సన్యాసి "సన్యాసి వేషాలు" బహు రమ్యంగా తీసినట్లు తెలుస్తున్నది. రామారావు, పద్మనాభం భూగర్భంలో, భూమిపై, గగనంలో ప్లవంగలో తెచ్చే విప్లవం హాస్య - అద్భుత వీరరసాల ప్రభావమంటున్నారు. జానపదాలకు కొత్త పథాలు నిర్మించే ఈ చిత్రానికి పింగళి నాగేంద్రరావు రచన సాగించారు. దర్శకత్వం కె. వి. రెడ్డి.

## మద్రాసులో "సాక్షి" షూటింగ్

నందనా వారి "సాక్షి" లో మద్రాసు శివారులోని వింగంబాకం తోటలలో కృష్ణ, విజయనిర్మలలపై ఒక పాటను ఏప్రిల్ రెండవ వారంలో చిత్రీకరించారు. దాశరథి ఆ పాటను వ్రాశారు. ఒక తటాకం ప్రక్కన కృష్ణ, విజయనిర్మలలపై ఒక సన్నివేశం కూడా చిత్రీకరించారు.

## ఉగాదినాడు (సినీ) కవితా సమ్మేళనం

ప్లవంగ ఆర్ట్ ఫెస్టివల్ కమిటీ వారు ఉగాదినాడు మద్రాసు కృష్ణ గాన సభలో కవితా సమ్మేళనం జరిపారు.

కుమారి పద్మిని నృత్యంతో కవులకు జిగినీ హారాలు వేసింది. ముదిగొండ లింగమూర్తి ఆధ్వర్యాన మద్రాసులోని ప్రముఖ ఆంధ్ర సంస్థల అధ్యక్షులు సంఘంగా ఏర్పడి ఉగాది ఉత్సవం జరిపారు. వేదికపై సరస్వతీ విగ్రహం ముందు డాక్టర్ పి. వి. రాజమన్నార్ అధ్యక్షతను జరిగిన ఈ కవితాసభలో శ్రీ శ్రీ, ఆత్రేయ, దాశరథి, కొసరాజు రాఘవయ్య చౌదరి, టి. రామలింగేశ్వరరావు, యామిజాల, చల్లా రాధాకృష్ణశర్మ, కోట సోదరకవులు మొదలైనవారు కవితాగానం, విమర్శ చేశారు. చెన్నపురి ఆంధ్రుల వాంఛిత ఫలసిద్ధికి ప్లవంగ సంఘం చక్కటి వేదిక కావాలని చెన్నపురి ఆంధ్ర మహాసభ అధ్యక్షుడు శ్రీ జె. వి. సోమయాజులు తమ ప్రసంగంలో పేర్కొన్నారు. సాయంకాలం జగ్గయ్యను సన్మానించారు.

## నందీ అవార్డులు

1966 లో సెన్సార్ అయిన తెలుగు చిత్రాలలో పోటీకి వచ్చిన వాటిలో 'రంగులరాట్నం'కు బంగారు నంది, 'చిలకా గోరింక'కు వెండినంది, 'ఆస్తిపరులు'కు కంచు నంది ఆంధ్ర ప్రభుత్వ సంఘం ప్రకటించింది. మొదటి చిత్రం దర్శక నిర్మాత బి. ఎన్. రెడ్డి. ఈ మధ్య వీరు తీసిన చిత్రాలలో బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన చిత్రం ఇదే. 'చిలకా-గోరింక' దర్శక నిర్మాత కె. ప్రత్యగాత్మ. 'ఆస్తిపరులు' దర్శకుడు వి. మధుసూదనరావు. నిర్మాత వి. రాజేంద్రప్రసాద్.

## రామినీడు సాంఘికం

జి. రామినీడు 'ఖడ్గతిక్కన'ను రెండవ ప్రొడక్షన్‌గా పెట్టుకుని తెలుగులో ఒక సాంఘికం తీయబోతున్నారు. నాగేశ్వరరావు, జమున, హరనాథ్ తారాగణంలో వుండగలరని తెలుస్తున్నది.

* * *

విజయశ్రీ ప్రొడక్షన్స్‌వారి 'పాండవుల బాల్యకథ', గౌరీ ప్రొడక్షన్స్‌వారి 'బంగారుపట్నం', టైగర్ ప్రొడక్షన్స్ సాంఘికం, సురేష్‌వారి క్రైమ్ చిత్రం సెట్ పనిని ప్రారంభించి శీఘ్రంగా జరుపుకొంటున్నాయి.

* * *

శ్రీమతి జూనియర్ శ్రీరంజని ఆర్. ఆర్. ఫిలిమ్స్ తమిళ చిత్రంలోను, ఒకటి రెండు తెలుగు చిత్రాలలోను బుక్ అయినారు.

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Printers.
Congressoffice Road, Governorpet, Vijayawada-2.